Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:58 • సంచిక: 178 • గురువారం 17 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore


**ముహూర్తం**

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం,
శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
తిథి: తదియ ఉ. 6.48 వరకు;
నక్షత్రం: కృత్తిక మ.3.52 వరకు;
రాహుకాలం: మ. 1.28 నుండి మ. 2.55 వరకు;
దుర్ముహూర్తం: ఉ. 10.05 నుండి మ. 10.51,
తదుపరి మ.2.43 నుండి 3.30 వరకు; వర్జ్యం: లేదు;
యమగండం: ఉ. 6.12 నుండి ఉ. 7.40 వరకు;
అమృతకాలం: మ. 1.19 నుంచి మ. 3.01 వరకు






## ఆర్టీసీ సమ్మెపై సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్ష

# మంత్రుల కమిటీ?



### నేడు మరోసారి సమీక్ష అనంతరం ప్రకటించే అవకాశం

ఆర్టీసీకి పూర్తిస్థాయి ఎండీ నియామకంపై కసరత్తు • పరిశీలనలో నలుగురు సీనియర్ ఐపీఎస్‌లు

ఆర్టీసీ పరిరక్షణ, సర్వీసుల పునరుద్ధరణపై ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమాలోచనలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మె, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ బుధవారం రాత్రి ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, కమిషనర్, ఇంఛార్జి ఆర్టీసీ ఎండీ సందీప్ కుమార్ సుల్తానియాతో పాటు ఆర్టీసీకి చెందిన ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంబంధించి మంగళవారం హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఏ విధంగా అమలు చేయాలన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. రెండు రోజుల్లో ఆర్టీసీకి ఎండీని నియమించాలని, కార్మిక సంఘాల నేతలతో వారి డిమాండ్లపై చర్చలకు పిలవాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఉన్నతాధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలో ఆర్టీసీ నిర్వహిస్తున్న బస్సులు, ప్రైవేట్ ఆపరేటర్లు నడుపుతున్న బస్సుల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి నివేదించినట్టు సమాచారం. తాత్కాలిక డ్రైవర్లు బస్సులు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారన్న అంశాన్ని ప్రస్తావించిన సీఎం కేసీఆర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలుస్తోంది. అనుభవం కలిగిన వారిని డ్రైవర్లుగా నియమించాలని కోరినప్పటికీ రవాణాశాఖ అధికారులు ఈ నిబంధనను పాటించలేదని దీంతో రాష్ట్రంలో అక్కడక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగాయని కేసీఆర్ వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో వారి డిమాండ్లపై చర్చించేందుకు ముగ్గురు లేదా నలుగురు మంత్రులతో కమిటీ నియమించాలని కేసీఆర్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఇందులో ఎవరెవరిని ఎంపిక చేయాలన్న అంశంపై గురువారం ఉదయం మరోసారి సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ నిర్ణయించారు. మంత్రివర్గ ఉపసంఘంలో ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, రవాణా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో

➪ 3వ పేజీలో...

## పరిషత్తులు ఇక పరిపుష్టం

విధులు.. నిధులు.. బాధ్యతలు

త్వరలో ప్రత్యేక కార్యాచరణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తామని, పంచాయతీలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్‌లను మరింత క్రియాశీలకంగా మారుస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గ్రామ పంచాయతీ

➪ 3వ పేజీలో...



## సమ్మె విరమించేలా చూడండి

ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

గవర్నర్ తమిళ సైని కోరిన బీజేపీ బృందం

నివేదిక తెప్పించుకుంటానన్నారు: లక్ష్మణ్

5



చంద్రుడిపై సేద్యం 9

### అంగారకుడిపై పంటల సాగు

తొమ్మిది పంటల ఉత్పత్తిలో విజయం



జనాభా విస్ఫోటనం 2

### భారత్‌లో ఆకలి కేకలు

దక్షిణాసియా దేశాల్లో చిట్టచివరి ర్యాంక్



నయా ట్రెండ్ 6

### బజాజ్ చేతక్ స్కూటర్లొస్తున్నాయ్

ఇక నుంచి ఎలక్ట్రిక్ స్కూటర్



మౌంట్ పయేక్టుపై కిమ్ 9

### గురుడు గుర్రమెక్కాడు

ఆ పర్వతమెక్కితే భారీ నిర్ణయాలు ఖాయం!



అయోధ్య వివాదం కేసు 9

### విచారణ పూర్తి తీర్పు రిజర్వ్

రెండో సుదీర్ఘ విచారణ కేసుగా రికార్డు



తెలంగాణలో చిరుజల్లులు 2

### ఈశాన్య రుతుపవనాలొచ్చాయ్



5

### సెప్టెంబర్ జీతాలివ్వండి

ఆర్టీసీ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం



2

### చెత్తకుప్పలో పసికందు

నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ప్లాస్టిక్ కవర్‌లో గుర్తింపు

## చుట్టుముట్టిన ఉపద్రవాలు

# ప్రభుత్వాలే ఆదుకోవాలి!

**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

ఓ వంక ఉపాధి లేమి

మరోవైపు వర్షాలు

విష జ్వరాల విజృంభణ

ప్రకృతి విపత్తే ఇది

తెలుగు రాష్ట్రాల ప్రజలు ప్రభుత్వ నిర్ణయాలు, ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమౌతున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ పేద, మధ్యతరగతి ప్రజల్ని ప్రభుత్వం ప్రత్యేక పథకాలతో ఆదుకోవాల్సిన అవసరముంది. సహజంగా వరదలు, ఉప్పెనల సమయంలో ప్రభుత్వం బాధితులకు ఆర్థిక సాయం అందిస్తుంది. వారికి ఆహారం, ఇతర సదుపాయాల్ని కల్పిస్తుంది. కానీ ఇప్పుడు అంతకుమించిన ఉపద్రవాలు తెలుగు రాష్ట్రాల్ని పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఇసుక పాలసీలో లోపాల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. నిర్మాణ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ మరికొన్ని లక్షల మందికి ఇప్పుడు పనిలేదు. ఇటుకల తయారీ పరిశ్రమ మూతబడింది. సిమెంట్ వ్యాపారాల్లేవు. లారీ డ్రైవర్లు, క్లీనర్లకు పనిలేదు. ఇక ఉభయ రాష్ట్రాల్ని గత రెండుమూడు దశాబ్దాల్లో ఎప్పుడూ కనివిని ఎరుగని స్థాయిలో భారీ వర్షాలు, వరదలు పట్టిపీడించాయి. నెలల తరబడి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో వివిధ రంగాలకు

➪ 3వ పేజీలో...



*పేదరికం యొక్క సమస్యలు అవాంఛనీయం. జీవితకాలం పేదరికంలో నివసిస్తున్న ప్రపంచ ప్రజల ఆలోచనలు కూడా భిన్నంగానే ఉన్నట్లు గుర్తించాను. పేదరికానికి వ్యతిరేకంగా పోరాటంలో పరిశోధకులు, విధాన నిర్ణేతలు కలసి పని చేసినప్పుడే ఆశించిన ఫలితాన్ని పొందగలుగుతాం.*

*- హార్వర్డ్ ప్రకటనలో అభిజిత్*

## నోబెల్ అభిజిత్‌కు

# నిజాల చిక్కులు!

భారత్ ఆర్థిక వ్యవస్థపై విమర్శలకు జాతిద్రోహిగా ముద్రవేసే ప్రయత్నాలు

**(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

ప్రపంచ పేదరికంతో పోరాడటానికి ఉత్తమమైన మార్గాల గురించి నమ్మదగిన సమాధానాలు పొందడానికి ఈ ఏడాది బహుమతి గ్రహీతలు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. క్లుప్తంగా ఈ సమస్యను మరింత చిన్నగా నిర్వహించదగిన స్థాయిలో ప్రజలపై ఎక్కువ ప్రభావితం చూపగలిగే ప్రయోగాల్ని వీరు చేసి చూపించారు. తమ పరిశోధనా ఫలితాల్లో ఆచరణలో పేదరికంతో పోరాడగల ప్రజల సామర్థ్యాన్ని నాటకీయంగా మెరుగుపర్చారు. వారి అధ్యయనాల్లో ఒకదాని ఫలితంగా 5 మిలియన్ భారతీయ పిల్లలు సమర్థవంతమైన కార్యక్రమాల నుండి ప్రయోజనం పొందారు. పాఠశాలల్లో రెమిడియల్ ట్యూటరింగ్ విధానం ద్వారా ఇది నిరూపించబడింది.

ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది స్వెరిజస్ రిక్స్ బ్యాంక్ బహుమతిని అభిజిత్ బెనర్జీ, ఎస్తేర్ డుఫ్లో, మైఖేల్ క్రెమర్‌లకు సంయుక్తంగా ప్రదానం చేయాలని నిర్ణయించిన రాయల్ స్వీడిస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంస్థ ఇందుకోసం తాము వీరినే ఎన్నుకోవడానికి గల కారణాల్ని విషదీకరిస్తూ పై వివరణ ఇచ్చింది.

ఈ ముగ్గురు ఆర్థికవేత్తల్లో అభిజిత్ బెనర్జీ భారతీయ సంతతికి చెందిన అమెరికన్. ఈ ముగ్గురూ ప్రపంచ పేదరికాన్ని నిర్మూలించడానికి

➪ 3వ పేజీలో...

## రైతు దండు

# రెడీ..!



### కొత్త సారథి కోసం వెయిటింగ్!

రైతు సమన్వయ సమితికి భారీ అంగబలం

1.6 లక్షల మంది సుశిక్షిత సభ్యులు

అన్నదాతకు చేదోడుగా ఉండేలా తర్ఫీదు

58లక్షల రైతు కుటుంబాలకు అండ

నాలుగు స్థాయిల్లో కొలువుదీరిన కమిటీలు

ప్రపంచంలోనే అతిపెద్ద రైతు వ్యవస్థ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణలో ఆవిష్కరించిన రైతు సమన్వయ సమితుల వ్యవస్థ, సేనాధిపతి కోసం ఎదురు చూస్తోంది. వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచి రైతాంగానికి చేదోడు వాదోడుగా పనిచేసేందుకు లక్షా 60వేలకు పైగా సభ్యులతో ఈ వ్యవస్థ క్షేత్రస్థాయిలో విస్తరించి ఉంది. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే కార్యరంగంలోకి దిగి సత్తా చూపేందుకు వారంతా సంసిద్ధమై ఉన్నారు. ఏడాదిన్నర క్రితం నియామకమైన వీరిలో గ్రామ, రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారున్నారు. ముందుగా సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయిలో జిల్లా సమన్వయ సమితులకు జరిగిన శిక్షణను, తదనంతరం జిల్లా సమితులు, మండల, గ్రామ సమితులను నిర్వహించి

➪ 8వ పేజీలో...

## అండగా సీడీఎఫ్...

# దండిగా నిధులు

### మాంద్యం ఉన్నా సంక్షేమానికి ఢోకా లేదు

గ్రామాల సత్వర అభివృద్ధికి సర్కార్ యోచన

తొలుత రూ.120 కోట్లు విడుదల

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్థిక మాంద్యం ప్రభావం చూపుతుండగా, ప్రాధాన్యతా రంగాలకు నిధుల్లో ఎటువంటి కోతలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉన్నంతలో ప్రజా సంక్షేమం, పల్లెల వికాసం దిశగా నిధులకు ఢోకా లేకుండా సర్కార్ యోచిస్తోంది. వివిధ శాఖలకు బడ్జెట్‌లో కోతలు పెట్టిన ప్రభుత్వం తాజాగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇచ్చే నియోజకవర్గ అభివృద్ధి నిధులు(సీడీఎఫ్)పై ఇప్పటికిప్పుడు అవసరాలు తీరేలా రూ. 120 కోట్లను చెల్లించింది. మిగిలిన నిధులను ప్రత్యేక అభివృద్ధి నిధి పేరుతో ఏర్పాటు చేసిన రూ. 10వేల కోట్ల నుండి చెల్లించేందుకు సర్కార్ సుముఖంగా ఉంది. ప్రతీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి రూ. 3కోట్ల చొప్పున ఏటా నిధులను కేటాయిస్తున్న సర్కార్ తాజాగా 120 మంది ఎమ్మెల్యేలు (నామినేటెడ్ ఎమ్మెల్యేతో సహా). 40మంది శాసన మండలి సభ్యులకు తద్వారా క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధుల లేమి వీడింది. ఇందుకు రూ. 480 కోట్లు అవసరం

➪ 8వ పేజీలో...

### ఫోన్ కాల్స్‌తో రుణాలిచ్చారు 6

మన్మోహన్, రాజన్‌పై నిర్మలా ఫైర్

## ఔరా..!



ఆంధ్రప్రభ

గురువారం 17 అక్టోబర్ 2019



# హుజూర్‌నగర్‌లో చక్రాలాట!

● ఆర్టీసీ సమ్మె చుట్టూ రాజకీయ పరిణామాలు ● విచిత్ర పరిస్థితుల్లో వామపక్షాలు

● సీపీఐ దారెటు?.. కాంగ్రెస్ వైపా.. తటస్థమా? ● మొదట్లో తెరాస తరఫున ప్రచారం.. ఇప్పుడు యూటర్న్

● వ్యతిరేక ప్రచారం చేయడంపై అయోమయం ● అధికార పార్టీకి గుర్తుల గుబులు ● కాంగ్రెస్ వల్లే ఇలా జరిగిందని ఆరోపణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మెతో హుజూర్‌నగర్ ఉపఎన్నిక రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె ఇక్కడి రాజకీయాలపై ప్రభావం చూపడంతో తెరాసకు మద్దతు ప్రకటించిన సీపీఐ వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సీపీఐకి 8 వేల ఓటుబ్యాంకు ఉండడంతో ఎలాగైనా సరే ఈ ఎన్నికల్లో ఆ పార్టీని తమవైపు తిప్పుకోవాలని, పార్టీ తరఫున బరిలోకి దిగిన సైదిరెడ్డి గెలుపుకు సీపీఐ మద్దతు అవసరమని భావించిన తెరాస అధినేత కేసీఆర్ పావులు కదిపారు. ఇరు పార్టీల మధ్య చర్చలు ఫలించడంతోహుజూర్‌నగర్ ఉప ఎన్నికలో తెరాస అభ్యర్థి సైదిరెడ్డికి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికుల విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహించిన సీపీఐ -తెరాసకు తన మద్దతును ఉప సంహ రించుకుంది. ఈనెల 18న హుజూర్‌నగర్‌లో తమ పార్టీ సీని యర్ నేతలమంతా సమావేశమై అధికారిక నిర్ణయాన్ని ప్రక టిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి చెప్పారు.

## సంకటస్థితిలో సీపీఐ

తెరాసతో చర్చల తర్వాత సీపీఐ నేతలు హుజూర్‌నగర్ తెరాస అభ్యర్థి సైదిరెడ్డి తరఫున ప్రచారంలో పాల్గొని ఆయనను గెలిపించాలని కోరారు. పరిస్థితులు మారడంతో గతంలో ప్రచారంలో పాల్గొన్న సీపీఐ ద్వితీయ శ్రేణి నాయకత్వం నిస్తేజంగా ఉండిపోయింది. పోలింగ్ సమీ పిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ సీపీఐ మద్దతును ఆశిస్తు న్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డికి ఫోన్‌చేసి ఉపఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి, తన సతీమణి పద్మావతికి మద్దతు పలకాలని పార్టీ శ్రేణులు ప్రచారంలో పాల్గొనేలా కోరాలని ఆయన అభ్యర్థించినట్టు తెలుస్తోంది. దీంతో హుజూర్‌నగర్ ఉపఎన్నికలో ఏ పార్టీకి మద్దతు ప్రకటించాలన్న అంశంపై సీపీఐ మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది..మారిన సమీకరణాల నేపథ్యంలో ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటిస్తే సీపీఐ శ్రేణులు అయోమయానికి గురవుతారని భావిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రచారంలో తటస్థంగా ఉండాలన్న నిర్ణయాని కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ అంశాన్ని 18వ తేదీన ప్రకటించే అవకాశముంది.

## తెరాసకు సింబల్ కలవరం

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ట్రక్కు గుర్తు కారణంగా తమ పార్టీ అభ్యర్థి సైదిరెడ్డి ఓటమి పాలయ్యారని ఆందోళన వ్యక్తంచేసిన తెరాస ఈ ఉపఎన్నికల్లోనూ ఇదే తరహా తలనొప్పి వచ్చి పడడంతో ఆందోళన వ్యక్తం చేస్తోంది. ట్రక్కు గుర్తు తరహాలోనే ఉపఎన్నికలో ట్రాక్టర్, రోడ్డు రోలర్ గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు ఇవ్వడంతో పరిస్థితి మళ్ళీ మొదటికి వస్తుందన్న అయోమయంలో పార్టీ ఉన్నట్టు చెబుతున్నారు. గత ఎన్నికల్లో తెరాస గుర్తు కారుకు పోలిన గుర్తు ట్రక్కు ఉండడంతో ఈ గుర్తుపై పోటీచేసిన అభ్యర్థికి 7వేల ఓట్లు వచ్చాయని, దీంతో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి గెలుపొందారని చెబుతున్నా రు. ప్రస్తుతం ట్రాక్టర్, రోడ్డు రోలర్ గుర్తును ప్రకటించడంతో ఇబ్బం దులు తలెత్తే ప్రమాదముందని తెరాస నేతలు ఆ పార్టీ కార్యనిర్వా హక అధ్యక్షుడు కేటీ రామారావు సూచించినట్టు తెలుస్తోంది. దీం తో అవసరమైన చర్యలు తీసుకో వాలని కేటీఆర్ ఆదేశించినట్లు సమాచారం.




## సీపీఎం వైఖరి ఇలా..

సీపీఎం తరఫున ఆ పార్టీ అభ్యర్థి పారేపల్లి శేఖర్‌రావు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ తిరస్కరణకు గురైంది. దీంతో ఆగ్రహించిన ఆ పార్టీ అధినాయకత్వం ఎన్నికల్లో పోటీకి పెట్టిన అభ్యర్థిని పార్టీ నుంచి బహిష్కరించింది. తమ పార్టీ అభ్యర్థి బరిలో లేకపోవడంతో తెలంగాణ ప్రజా పార్టీకి చెందిన అభ్యర్థికి మద్దతు ప్రకటిస్తున్నట్టు సీపీఎం ప్రకటించింది.



# తెరాస వైపే వైశ్యులు

● ఫలించిన బొల్లం సంపత్ వ్యూహాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో గెలుపునకు ప్రతి ఓటూ ఎంతో కీలకంగా మారగా, నియోజకవర్గంలో ప్రభావితవర్గంగా ఉన్న వైశ్యులను టీఆర్ఎస్‌వైపు మళ్ళించేందుకు, ఏకపక్షంగా టీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచేందుకు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ చేసిన శ్రమ, అమలుచేసిన వ్యూహాలు ఫలితాన్నిస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ఆదేశాల మేరకు హుజూర్‌నగర్‌లో ప్రచార బాధ్యతలు స్వీకరించిన బొల్లం సంపత్‌కుమార్ స్థానికంగానే మకాం వేసి వైశ్య ఓటర్లపైనే పూర్తిగా దృష్టి నిలిపి పనిచేస్తున్నారు. హుజూర్‌నగర్ టౌన్‌తో పాటు నియోజకవర్గంలోని ఏడుమండలాల్లో వైశ్య సామాజికవర్గానికి చెందిన కుటుంబసభ్యులు, వ్యాపారులతో గ్రూపు సమావేశాలు నిర్వహించి చైతన్య పరచడంతో పాటు ప్రతి గడపకూ వెళ్ళి టీఆర్ఎస్‌కు, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వానికి మద్దతు పలకాల్సిన అవసరాన్ని వివరించారు. పక్షం రోజులుగా ఆయన వైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖులను కలుపుకుని నిర్వహించిన ప్రచారానికి మంచి స్పందన లభించింది. సంపత్ నిర్వహించిన సమావేశాలు, చేసిన పరిశ్రమ ఫలితంగా గతంలో ఇతరపార్టీలకు మద్దతుగా నిలిచిన వైశ్యులు కూడా ఈ దఫా కారుకే జోరుగా ఓట్లేస్తామంటూ ప్రకటించారని నేతలు ఆనందంగా చెబుతున్నారు. హుజూర్‌నగర్‌లో టీఆర్ఎస్ విజయం ఖాయమైందని, ప్రచారంలో అడుగడుగునా అపూర్వస్పందన కనబడుతోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధిసంస్థ ఛైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ గుప్తా ఆంధ్రప్రభకు తెలిపారు. కనీసం 20వేల మెజారిటీతో శానంపూడి సైదిరెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# హుజూర్‌నగర్ వైపే అందరి చూపు

● కేసీఆర్ సభకు ఏర్పాట్లు పూర్తి : పల్లా

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గులాబీదళపతి, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హుజూర్‌నగర్ నియోజకవర్గ సభపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ హ్యాట్రిక్ నియోజకవర్గం, కంచుకోటలో తొలిసారి గులాబీజెండా ఎగరేయాలన్న పట్టుదలతో పకడ్బందీగా పావులు కదిపిన అధినేత తొలిసారి ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని, రాష్ట్ర రాజకీయాల్లో ఇది ట్రెండ్‌సెట్టర్ సభ అవుతుందని, హుజూర్‌నగర్ చరిత్రను తిరగరాస్తుందని టీఆర్ఎస్ ఉప ఎన్నికల ఇన్‌ఛార్జి పల్లా రాజేశ్వరరెడ్డి ఆంధ్రప్రభతో అన్నారు. మరో నాలుగేళ్ళు రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీఆర్ఎస్ అభ్యర్థికే పట్టంకట్టాలని సీఎం పిలుపునివ్వనున్నారు. ఇక ఉప ఎన్నికల ఇన్‌ఛార్జి పల్లా రాజేశ్వరరెడ్డితో పాటు మంత్రి జగదీష్‌రెడ్డి కూడా స్థానికంగానే ఉంటూ ప్రచారాన్ని పర్యవేక్షిస్తుండగా, సీఎం సభకు 50వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

# జోరు పెంచిన కాంగ్రెస్

● 18, 19న రేవంత్‌రెడ్డి ప్రచారం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ప్రచారానికి ఇక మూడు రోజులే ఉండటంతో.. కాంగ్రెస్ నేతలు ప్రచారహోరు పెంచారు. అన్ని వర్గాల ప్రజలను తమ వైపు తిప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని ప్రతీ పల్లె, ప్రతీ గడపను తట్టి ప్రతీ ఓటర్‌ను కలిసి హస్తానికి ఓటేయాలని విజ్ఞప్తులు చేస్తూ పద్మావతి విజయం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. గురువారం టీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నిర్వహించే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటున్నారు. కాంగ్రెస్ ముఖ్యనేతలు ఉత్తమ్ మల్కాజ్‌గిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి 2 రోజులు హుజూర్‌నగర్‌లోనే తిష్టవేసి ప్రచారం చేయనున్నారు. 18, 19వ తేదీన నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనకు షెడ్యూల్‌ను కూడా రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రచారం చేసే గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ సూచనల మేరకు ఖరార్ చేశారు.



# మంత్రులపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. సీఎం కేసీఆర్ బహిరంగ సభ కోసం కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నారని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మొత్తం ఖర్చును టీఆర్ఎస్ అభ్యర్థి ఖాతాలోనే జమ చేయాలని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేతలు బుధవారం ఫిర్యాదు చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు చెందిన ఆంగ్ల దిన పత్రిక, టీవీలో వస్తున్న ప్రకటనలను కూడా టీఆర్ఎస్ అభ్యర్థి ఖాతాలో జమ చేయాలన్నారు. ఉప ఎన్నికల్లో పెద్ద ఎత్తున మద్యం, డబ్బు సరఫరాను అడ్డుకోవాని సీఈఓను కోరినట్లు ఆయన తెలిపారు. ఓటమి తప్పదనే కేసీఆర్ స్వయంగా ప్రచారానికి దిగుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్న మంత్రులపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్వర్‌రెడ్డిలు కోదాడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఎన్నికల కోడ్ ఉల్లంఘనే అవుతోందన్నారు.



# చెత్తకుప్పలో పసికందు!

**హైదరాబాద్/జూబ్లీహిల్స్, ఆంధ్రప్రభ :** భాగ్యనగరంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. నిమ్స్ ఆసుపత్రి ఆవరణలోని చెత్తకుప్పలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన చంటిబిడ్డను ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి వదిలి వెళ్లారు. పసికందు ఏడుపు విన్న స్థానికులు చెత్తకుప్పలో పసికందును గుర్తించారు. అత్యవసర చికిత్సకోసం తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాప క్షేమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఆడపిల్ల పుట్టడంతో వదిలేసి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. కాగా ఆ చంటిబిడ్డను ఎవరు వదిలివెళ్లారన్న విషయంపై పంజాగుట్ట పోలీసులు ఆరాతీస్తున్నారు. ఆడపిల్ల పుట్టిందన్న కారణంతోనే చెత్తకుప్పలో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. నిమ్స్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పాపను వదిలి వెళ్లిన వారి కోసం గాలిస్తున్నారు.




# భారత్‌లో ఆకలి కేకలు



● గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 102వ స్థానం ● 30.3 పాయింట్లతో తీవ్ర ఆకలి కేటగిరిలో చోటు

● దక్షిణాసియా దేశాల్లో చిట్ట చివరి ర్యాంకు ● మెరుగైన స్థానాల్లో పాక్, బంగ్లా, శ్రీలంక

● బ్రిక్స్ దేశాల్లో అట్టడుగు స్థానం ● భారత ర్యాంకుపై అధిక జనాభా ప్రభావం



**న్యూఢిల్లీ:** సామాజిక భద్రత కోసం సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తున్నప్పటికీ అంతర్జాతీయ సూచీల్లో భారత్ ర్యాంకులు మెరుగుపడడం లేదు. తాజాగా మరో అంశంలో భారత్ ర్యాంక్ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ ఆకలి సూచీ( గ్లోబల్ హంగర్ ఇండెక్స్)-2019లో భారత్‌కు 102వ స్థానం దక్కింది. మొత్తం 117 దేశాలున్న ఈ జాబితాలో భారత్‌కు ఈ స్థానం దక్కింది. దక్షిణాసియా దేశాల్లో పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తర్వాత చిట్టచివరి స్థానంలో భారత్ నిలవడం ఆందోళన కలిగిస్తోంది. దక్షిణాసియాలోని దేశాలు అత్యధికంగా 66, అత్యల్పంగా 94వ స్థానాల్లో నిలిచాయి. మరోవైపు బ్రిక్స్ దేశాలతో పోల్చితే భారత్ బాగా వెనుకబడింది. బ్రిక్స్ దేశాల్లో భారత్ కంటే ముందు అత్యల్ప స్థాయిలో దక్షిణాఫ్రికా 59వ ర్యాంకులో నిలిచింది. 2015లో 93వ స్థానంలో నిలిచిన భారత్ క్రమంగా ర్యాంక్‌ను కోల్పోతోంది. గతంలో అంతర్జాతీయ ఆకలి సూచీలో భారత్ కంటే పాకిస్తాన్ వెనుకబడివున్నప్పటికీ తాజా గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ) 2019 సూచీలో మాత్రం తన స్థానాన్ని మెరుగుపరచుకుంది. ఈ ఏడాది 94వ స్థానంలో నిలిచింది. భారత్ అధిక జనాభాను కలిగివుండడంతో ప్రాంతీయంగా జీహెచ్ఐ సూచీ విలువలపై తీవ్రమైన ప్రభావం పడుతోందని నివేదిక పేర్కొంది. బాల్యాన్ని వృథా చేస్తున్న దేశాల జాబితాలో భారత్ రేటు అత్యధికంగా 20.8 శాతంగా నమోదైందని నివేదిక వివరించింది. భారత్ నమోదుచేస్తున్న అత్యల్ప స్కోర్ కారణంగా దక్షిణాసియాలో ర్యాంకు పడిపోతోంది. సబ్-సహారా ఆఫ్రికా దేశాల కంటే దిగువ స్థాయిలో ర్యాంకు నమోదవుతోందని వెల్లడించింది. భారత్‌లో 6-23 నెలల వయసున్న పిల్లల్లో కేవలం 9.6 శాతం మంది మాత్రమే కనీస ఆమోదయోగ్యమైన ఆహారాన్ని పొందుతున్నారు. అయితే కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవలే విడుదల చేసిన రిపోర్ట్ దీనికి విరుద్ధంగా ఉంది. కనీస ఆమోదయోగ్యమైన ఆహారాన్ని తీసుకుంటున్న పిల్లలు కేవలం 6.4 శాతం మంది మాత్రమే ఉన్నారని పేర్కొంది.

## జీహెచ్ఐ ర్యాంకులిస్తారిలా..

2014 నుంచి 2018 మధ్యకాలంలో దేశంలో సరైన పోషకాహారంలేకోవడం, ఐదు సంవత్సరాలలోపు పిల్లల బరువు, ఎత్తు వయసుకు తగ్గట్టు లేకపోవడం, ఐదేళ్లలోపు పిల్లల శిశుమరణాల నిష్పత్తి ఆధారంగా జీహెచ్ఐ స్కోర్‌ను పరిగణించారు. జీహెచ్ఐ ర్యాంకులను ప్రకటించే విషయంలో తీవ్ర స్కేల్‌లో మొత్తం 100 పాయింట్లను కేటాయిస్తారు. సున్న పాయింట్లు పొందిన దేశాల్లో ఆకలి లేనట్టు, 100 పాయింట్లు పొందిన దేశాల్లో అత్యంత దుర్భరమైన పరిస్థితులు ఉన్నట్టు గుర్తిస్తారు. 10 కంటే తక్కువ పాయింట్ల పొందిన దేశాల్లో ఆకలి తక్కువగా ఉన్నట్టు, 20-34.9 పాయింట్లు పొందిన దేశాల్లో తీవ్రమైన ఆకలి పరిస్థితులు ఉన్నట్టు, 35-49.9 పాయింట్లు పొందిన దేశాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నట్టు, 50 కంటే ఎక్కువగా పాయింట్లు పొందిన దేశాల్లో అతి తీవ్రమైన ఆకలి కేకల ప్రమాద ఘంటికలు మోగుతున్నట్టు పరిగణిస్తారు. ఈసారి జాబితాలో భారత్‌కు 30.3 పాయింట్లు వచ్చాయి. అంటే తీవ్రమైన ఆకలి కేటగిరిలో భారత్ నిలిచింది. ఈ కేటగిరిలో సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌కు చెందిన నాలుగు దేశాలు మాత్రమే నిలిచాయి. ఆకలి కేకలు స్థాయి పెరగడానికి వాతావరణ మార్పులు కూడా ఒక కారణమేనని నివేదిక హెచ్చరించింది. ఆహార నాణ్యత, భద్రతతోపాటు పౌష్టికాహార సాగుపై వాతావరణ మార్పులు ప్రభావం చూపుతున్నాయని నివేదిక వివరించింది.



## బంగ్లాకు ప్రశంస

తాజా జాబితాలో తన స్థానాన్ని మెరుగుపరచుకున్న బంగ్లాదేశ్‌ను నివేదిక ప్రశంసించింది. గణనీయమైన ఆర్థికాభివృద్ధి, పౌష్టికాహారాన్ని పెంచేందుకు కీలకమైన విద్య, పారిశుద్ధ్యం, ఆరోగ్య రంగాలపై శ్రద్ధ పెట్టడంతో ఈ పురోగతి సాధ్యమైందని కొనియాడింది. 2000 తర్వాత ర్యాంకుల్లో అత్యధిక శాతం మార్పును పొందిన దేశంగా నేపాల్ గుర్తింపును పొందిందని వివరించింది. ఇంట్లో నగదు నిల్వ పెరగడం, తల్లుల అక్షరాస్యత, పారిశుద్ధ్యంలో పురోగతి, ఆరోగ్యం, పౌష్టికాహారానికి సంబంధించిన పథకాలను అమలు వంటి కారణాలు నేపాల్ ర్యాంకు భారగా పెరగడానికి కారణమయ్యాయని నివేదిక వివరించింది.



| 2019 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ | |
|---|---|
| బ్రెజిల్ | 18 |
| రష్యా | 22 |
| చైనా | 25 |
| దక్షిణాఫ్రికా | 59 |
| శ్రీలంక | 66 |
| మయన్మార్ | 69 |
| నేపాల్ | 73 |
| బంగ్లాదేశ్ | 88 |
| ఉత్తరకొరియా | 92 |
| పాకిస్తాన్ | 94 |
| ఇండియా | 102 |
| జాబితాలోని మొత్తం దేశాలు | 117 |

| భారత్ ర్యాంకు క్షీణిత క్రమం | |
|---|---|
| 2014లో | 55 (మొత్తం దేశాలు 76) |
| 2015లో | 93(117) |
| 2016లో | 97(118) |
| 2017లో | 100(119) |
| 2018లో | 103(119) |
| 2019లో | 102(117) |

# 'ఈశాన్యం' వచ్చింది!

● రుతుపవనాల ఆగమనం

● రెండు రోజులపాటు భారీ వర్షాలు

● తెలంగాణలో చిరుజల్లులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** మొన్నటి వరకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షాలు దిశ మార్చుకున్నాయి. నైరుతి కాలం ముగిసినందున ఆ రుతుపవనాలు తిరోగమనం చెందిన ఈశాన్య రుతువపనాల ఆగమనం జరిగినట్లు బుధవారం వాతావరణశాఖ ప్రకటించింది. ఈ రుతు పవనాల ప్రభావం ఐదు రోజుల పాటు ఉంటుందని, వచ్చే 2 రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది. వాతావరణ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం బుధవారం సాయంత్రం దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించిన ఈశాన్య రుతుపవనాలు తెలంగాణలో ప్రభావం చూపుతున్నాయి. గురువారం మధ్యాహ్నానికి ఆంధ్రప్రదేశ్‌కు తాకుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, తెలంగాణ, లక్షద్వీప్‌లపై ఈశాన్య ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. గత ఐదేళ్ళలో ఎన్నడూ లేనివిధంగా కరువుతో అల్లాడుతున్న తమిళనాడుకు ఈ రుతుపవనాలు శుభవార్తను అందజేశాయి. అక్కడ భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి చెన్నైతో పాటు ప్రధాన నగరాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో తమిళనాడుపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న వార్త ఆ రాష్ట్ర ప్రజలను ఆనందోత్సాహాలు నింపింది. ఈ వర్షాలతోనైనా తాగునీటి కష్టాలు తీరుతాయని వారు భావిస్తున్నారు.

## తెలంగాణలో నిండిన ప్రాజెక్టులు

ఇక తెలంగాణలో ఒకటి, రెండు మినహా అన్ని జలాశయాలు గరిష్ట నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇప్పటికే ఎగువ రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలతో పాటు రాష్ట్రంలో కురిసిన వర్షాలకు జల వనరులన్నీ నిండుకున్నాయి. భూగర్భ జలాలు గరిష్టనీటి మట్టానికి చేరుకు న్నాయి. ఈ సమయంలో ఈశాన్య రుతువపనాల ప్రభా వం మన రాష్ట్రంపై ఎక్కువగా ఉంటే గనుక అతివృష్టి బీభత్సం తప్పదని విపత్తుల నిర్వహణశాఖ అంచనా వేస్తోంది. ఇప్పటి వరకు వాతావరణశాఖ తెలిపిన సమాచారం మేరకు తెలంగాణలో ఈ రుతుపవనాల ప్రభావం నామమాత్రమేనని అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తాయని తెలుస్తోంది. అయితే వాతావరణశాఖ విడుదల చేసిన బులెటిన్‌ను దృష్టిలో పెట్టుకుని అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్న రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వా లు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రటించాయి. ఈ రెండు రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎలాంటి ముప్పు లేదని దీనర్థం. అయినప్పటికీ తీర ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉన్న ఈ రెండు రాష్ట్రాల్లో జాతీయ విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాలు, సముద్రతీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి.

# ప్రభుత్వాలే ఆదుకోవాలి!

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఉపాధి అవకాశాలు మటుమాయమయ్యాయి. చిల్లర వ్యాపారాలు ముందుకు సాగడంలేదు. తోపుడుబళ్ళ నుంచి వివిధ మార్గాల్లో రోజువారి ఉపాధి పొందే లక్షలాది మందికి ఇప్పుడు పూటగడవడం కష్టంగా మారింది. దీనికి తోడు అనారోగ్య సమస్యలు మిన్నంటాయి. విషజ్వరాలు పంజా విప్పాయి. దాదాపు ప్రతి ఇంట్లో ఒకరు ఈ జ్వరాల బారిన పడ్డారు. దీంతో ఆరోగ్యం అదనపు భారంగా మారింది. కూలీకెళ్ళేందుకు పనిలేక, పనున్నా అనారోగ్యంతో చేయలేక దుర్భర పరిస్థితుల్ని తెలుగు రాష్ట్రాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ దశలో ప్రభుత్వాలే ప్రజల్ని ఆదుకోవాలి. కనీసం ఆరోగ్యం బావుంటే ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళి తాత్కాలికంగానైనా ఉపాధి పొందే అవకాశాలుండేవి. కానీ ఇప్పుడు వలసలకు కూడా ఆరోగ్యం సహకరించడంలేదు. పేద, మధ్యతరగతి ప్రజలకు కుటుంబానికి నిర్ణీత మొత్తాన్ని ప్రభుత్వం అందించాలి. ప్రస్తుత పరిస్థితిని కూడా ప్రకృతి విపత్తుగానే ప్రభుత్వాలు పరిగణించాలి. లేనిపక్షంలో తెలుగు రాష్ట్రాల్లో ఉపాధి లేక ఆరోగ్యం కొరవడి, ఆకలి చావులు నమోదయ్యే ప్రమాదం నెలకొందని నిపుణులు సూచిస్తున్నారు.



# నోబెల్ అభిజిత్‌కు నిజాల చిక్కులు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోగాత్మక విధానాల్ని రూపొందించిన కారణంగానే స్వీడిష్ అకాడమీ ఈ నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసింది.

ఈ సందర్భంగా అకాడమీ చేసిన ప్రకటన ప్రపంచ వ్యాప్తంగా పేదరిక నిర్మూలన కోసం మేధావులు పడుతున్న శ్రమకు అద్దంపడుతోంది. ఏటేటా ప్రపంచంలో సంపద పెరుగుతోంది. అదే స్థాయిలో పేదరికం కూడా విస్తరిస్తోంది. పెరిగిన సంపద కేవలం కొన్ని కుటుంబాలకే పరిమితమౌతోంది. మరోవైపు ఆకలి చావులు మిన్నంటుతున్నాయి. ప్రపంచంలో మూడింట రెండొంతుల దేశాల్లో ఇప్పటికీ ఒంటిపూట భోజనాన్ని మాత్రమే తింటున్న ప్రజల సంఖ్య 135 కోట్లుగా ఉంది. 221 కోట్ల మందికి ఇప్పటికీ పౌష్టికాహారం అందుబాటులో లేదు. ఏటా 22 కోట్ల మంది తగిన సమయంలో వైద్య సదుపాయం అందుబాటులో లేక చనిపోతున్నారు. ఏటా 9.75 కోట్ల మంది శిశువులు రక్తహీనతతో మృత్యువాత పడుతున్నారు. ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల్లో సగం మందికి పైగా అక్షరాస్యతకు దూరంగా ఉన్నారు. ఇదంతా పేదరిక ప్రభావమే. సంపద పంపిణీలో వ్యత్యాసాల్ని వీలైనంతగా తగ్గించేందుకు ఆర్థికవేత్తలు పలురకాల ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. సంపద సృష్టి నుంచి అవకాశాల మెరుగుదల, సదుపాయాల కల్పనకు వీరు ప్రాధాన్యతనిస్తున్నారు. ఆరోగ్యకరమైన పరిసరాలు, జీవన విధానాలు, అందరికీ పౌష్టికాహారాలు అందుబాటులో ఉండేలా సిద్ధాంతాల్ని రూపొందిస్తున్నారు. విద్య ద్వారా మెరుగైన ఉపాధి జీవన విధానం అవకాశాల్ని అందుబాటులోకి తేవొచ్చు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన ఉన్నత విద్యను అందుబాటులో పెట్టేందుకు తగినంత సంపదను కేటాయించాల్సిన అవస రాలు, అందుకు అనుసరించాల్సిన విధానాలపై నిర్వహిస్తున్న ప్రయో గాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. అయితే ఇవన్నీ ఆచరణలోకి రావడంలేదు.

రాయల్ స్వీడిష్ సంస్థ ఎలాంటి ఒత్తిళ్ళకు ప్రలోభాలకు లొంగదు. ప్రపంచంలో అనేక అవార్డులు, రివార్డులు, బహుమానాలున్నాయి. కానీ వివిధ రంగాల్లో ప్రజాపయోగ పరిశోధకులకు ఇచ్చే నోబెల్ బహుమతులు వీటన్నింటికంటే అత్యుత్తమంగా పరిగణించబడతాయి. వీటికోసం ఎవరు ఎవరికీ సిఫార్సులు చేయాల్సిన అవసరంలేదు. ఏ రాజకీయ పార్టీ ప్రతిపాదనలు అక్కర్లేదు. నిర్వాహకులు తమంతతామే ప్రపంచ వ్యాప్తంగా వడబోత చేస్తారు. అర్హుల్ని గురిస్తారు. నేరుగా వారికే ఫోన్ ద్వారా సమాచారం అందించి ఆశ్చర్యపరుస్తారు. అప్పటి వరకు కనీసం వారి పేరును నోబెల్ పురస్కారానికి పరిగణనలోకి తీసుకుంటున్న విషయాన్ని కూడా బట్టబయలు కానివ్వరు. అంత రహస్యంగా ఈ ఎంపిక నిర్వహిస్తారు.

బోస్నియా, హెర్జెగోవినా, ఇథియోపియా, మొరాకో, మెక్సికో, మంగోలియా, కెన్యా వంటి పేద దేశాల్లో అభిజిత్ బెనర్జీ తన భార్య డఫ్లోతో కలసి పలు అధ్యయనాలు నిర్వహించారు. ఈ దేశాల్లోని 700మిలియన్లకు పైగా ప్రజలు తీవ్ర పేదరికంలో జీవిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో 5 మిలియన్ల మంది పిల్లలు ఐదేళ్ళలోపు చనిపోతున్నట్లు వీరి అధ్యయనంలో లేదు.

అయితే వీరి మరణానికి కారణం నివారించగల అతిచౌకగా సులభంగా నయం చేయగల వ్యాధులేనని వీరు నిర్ధారించారు. అలాగే ఈ దేశాల్లో అక్షరాస్యత శాతం అతి తక్కు వగా ఉండడానికి ప్రధాన కారణం గణితంలో నైపుణ్యం లేక పిల్లలు ఆరు, ఏడవ తరగతుల్లోనే పాఠశాలల నుంచి బయటపడ్డంగా తేల్చారు. ఈ సమస్యలపై అధ్యయనాన్ని ఆయా ప్రభుత్వాలు సాను కూలంగా తీసుకున్నాయి. వీటి పరిష్కారానికి అభిజిత్ బృందం చేసిన సిఫార్సుల్ని ఇప్పటికే ఆచరణలో పెట్టాయి. ప్రపంచ పేదరికం యొక్క సమస్యలు అవాంఛనీయం. జీవితకాలం పేదరికంలో నివసిస్తున్న ప్రపంచ ప్రజల ఆలోచనలు కూడా భిన్నంగానే ఉన్నట్లు తాను గుర్తించానని హార్వర్డ్ నుంచి ఆయన చేసిన ఓ ప్రకటనలో అభిజిత్ పేర్కొన్నారు. పేదరికానికి వ్యతిరేకంగా పోరాటంలో పరిశోధకులు, విధాన నిర్ణేతలు కలసి పని చేసినప్పుడే ఆశించిన ఫలితాన్ని పొందగలుగుతామని కూడా అభిజిత్ అభిప్రాయపడ్డారు.

ప్రపంచ ప్రశంసలు అందుకుంటున్న అభిజిత్ తన మూలాలు గల భారత్‌లో మాత్రం విమర్శల్ని ఎదుర్కొంటున్నారు. ఆయన్ను ఏకంగా జాతి ద్రోహిగా భారత్‌లోని కొందరు అభివర్ణిస్తున్నారు. ఇందుక్కారణం భారత ఆర్థిక వ్యవస్థ పట్ల ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలే.

భారత్‌లో దీర్ఘకాలానంతరం ఆర్థిక వ్యవస్థ తిరోగమనం బాటపట్టిందంటూ అభిజిత్ పేర్కొన్నారు. లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం అన్ని వర్గాల సంతృప్తికి కొన్ని మంత్రాల్ని పఠిస్తోందంటూ విమర్శించారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌కు తగ్గ రాబడి లేదన్నారు. తన దృష్టిలో భారత ఆర్థిక వ్యవస్థ నాశనమైనట్లేనంటూ వ్యాఖ్యానించారు. ప్రతి 18మాసాలకోసారి జరిగే నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాల్ని వెల్లడించిన అభిజిత్ గత మూడేళ్ళతో పోలిస్తే భారత ఆర్థిక వృద్ధి రేటు ఘోరంగా పడిపోయిందన్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థను అంధకారంలోకి నెట్టే ప్రమాదముందన్నారు. పైగా తనకు వ్యతిరేకంగా ఉన్న లెక్కల్ని భారత ప్రభుత్వం ఆమోదించలేక పోతోం దని విమర్శించారు. వీటిపై భారత్‌లో కొందరు మండిపడు తున్నారు. భారత జాతీయ వాదాన్ని అవమానిం చినట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. అభిజితే కాదు.. గతంలోనూ ఆర్థికశాస్త్రంలో నోబెల్ పొందిన భారత మూలాలు గల అమర్త్యసేన్ కూడా ఈ దేశ ఆర్థిక వ్యవస్థపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పుడూ ఆయన్ను జాతి వ్యతిరేకిగా విమర్శించారు.




## లైఫ్‌సైన్సెస్ రాజధానిగా
# హైదరాబాద్

- బయో ఏషియా 2020 వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- 55 దేశాల నుంచి హాజరుకానున్న 1800 మంది నిపుణులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో ఇప్పటికే రాజధానిగా వర్ధిల్లుతోందని, ఈ స్థానాన్ని మరింత సుస్థిరం చేసే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఐటీ , మున్సిపల్ శాఖ మంత్రి కె.టి.రామారావు అన్నారు. ఆయా రంగాల్లో బంగారు భవిష్యత్ కోసం మరెన్నో చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. బయో ఏషియా సమావేశ థీమ్‌ను మంత్రి కేటీఆర్ బుధవారం ప్రకటించారు. టీఎస్ఐఐసీ కార్యాలయంలో బయో ఏషియా 2020 వెబ్‌సైట్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే బయో ఏషియా సమావేశానికి స్విజర్లాండ్ భాగస్వామి దేశంగా ఉందని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా వివరించారు. జర్మనీ సంయుక్త భాగస్వామిగా, అసోం, కేరళ రాష్ట్రాలు భాగస్వాములు ఈ సమావేశానికి హాజరవుతాయని మంత్రి తెలిపారు. టుడే ఫర్ టుమారో అనే థీమ్‌తో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రపంచంలోని ప్రఖ్యాత లైఫ్ సైన్సెస్ కార్యక్రమాల్లో బయో ఏషియా ఒకటిగా ఉందని వివరించారు. ఈ సమావేశానికి దేశ, విదేశాల నుంచి ఫార్మా, లైఫ్ సైన్సెస్‌రంగ నిపుణులు, ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రాజధానిగా ఎదగడంలో బయో ఏషియా సదస్సు కీలకంగా నిలిచిందన్నారు. ఈ సమావేశానికి సుమారు 55 దేశాల నుంచి 1800 మంది ఫార్మా లైఫ్ సైన్సెస్ రంగ నిపుణులు హాజరుకానున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ సదస్సుకుగాను స్టార్టప్ల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు, దాదాపు 100కు పైగా కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ నరసింహా రెడ్డి, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

# పరిషత్తులు పరిపుష్టం

(మొదటిపేజీ తరువాయి)

ట్రిబ్యునల్ సభ్యునిగా నియామకైన వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన గటిక అజయ్ కుమార్, పలువురు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో కలిసి సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అజయ్‌ని అభినందించారు. వారితో సీఎం మాట్లాడుతూ, ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఆశించిన ఫలితాన్నిచ్చిందన్నారు. గ్రామ పంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా పరిషత్‌లకు కూడా నిర్దిష్టమైన విధులు, నిధులు, బాధ్యతలు అప్పగించడానికి కసరత్తు చేస్తున్నట్టు ఈ సందర్భంగా వెల్లడించారు. త్వరలోనే ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్లతో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మార్గదర్శకాలు ఇస్తానని సీఎం కేసీఆర్ తెలిపారు. ఆర్థిక సంఘం నిధులను ప్రతినెలా రూ.339 కోట్ల చొప్పున విడుదలచేసి గ్రామాల పురోగతికి, అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఇదే తరహాలో మండల, జిల్లా పరిషత్‌లకు కూడా ప్రత్యేక నిధులు ఇచ్చి వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా మార్చాల్సిన విశిష్ట బాధ్యతలను సమిష్టిగా నిర్వర్తించాల్సి ఉందని సీఎం గుర్తుచేశారు. అందుకు అవసరమైన ప్రేరణను ప్రభుత్వం అందిస్తుందని, ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తుందని చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజలంతా సమైక్యంగా ఉండి తమ తమ గ్రామాలను అభివృద్ధివైపు దూసుకువెళ్లేలా చేసే బాధ్యతను చాటి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సరోజ హరికిషన్ నాయక్, ఎంపీపీ జాటోతు రమేష్, వరంగల్ రూరల్ జిల్లా తెరాస నేతలు తాటిపల్లి శివకుమార్, సంపత్ రావు, శ్రీకాంత్, మూర్తి తదితరులు ఉన్నారు.

# బతికుండగానే.. శ్మశాన వాటికకు!



**శంకర్‌పల్లి, ప్రభన్యూస్ :** పెళ్లి అనే బంధంతో ఒక్కటయ్యారు.. ఏడడుగులు వేశారు.. ఆపదలోనూ ఒకరికి ఒకరు తోడుంటాం అని బాసలు వేసుకున్నారు.. కానీ వారి బంధాన్ని గొడవలు దూరం చేశాయి.. అతన్ని మధుమేహం వ్యాధి వెంటాడింది.. వృద్ధాప్యంలో తోడు ఉండాల్సిన భార్య వదిలిపెట్టి వెళ్లిపోయింది. ఆస్తిలో సగం వాటా కూడా తీసుకుంది.. అంతటితో ఆగలేదు.. కట్టుకున్న భర్తను బతికి ఉండగానే శ్మశాన వాటికలో వదిలిపెట్టి తిరిగి చూడకుండా వెళ్లిపోయింది. ఈ హృదయ విదారకరమైన ఘటన రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని ఎల్వర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గొడవల కారణంగా కంకంటి సత్తయ్య (57)ను అతని భార్య వదిలించుకుంది. పెద్దలందరూ కూర్చుని సత్తయ్యకు ఉన్న ఆస్తిని రెండు భాగాలు చేశారు. సగం భార్యకు ఇవ్వగా.. మిగిలిన సగం సత్తయ్యకు ఇచ్చారు. దీంతో సత్తయ్యకు ఇల్లు లేకుండా పోయింది. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటూ సత్తయ్య జీవనం సాగిస్తున్నాడు. పశువులు కాస్తున్న సమయంలో కాలికి తగిలిన గాయం కారణంగా మధుమేహం వ్యాధికి గురై తీవ్ర అనారోగ్యం బారినపడ్డాడు. కాలికి విపరీతమైన వాపు రావడంతో, అంగన్‌వాడీ భవనం నుంచి ఖాళీ చేయించాలని గ్రామంలోని మహిళలు పట్టుబట్టారు. అద్దె ఇంట్లో ఉందామని భావించాడు. ఎవరూ ఇల్లు అద్దెకు ఇవ్వలేదు. స్థానికులు ఈ విషయాన్ని భార్యకు తెలియజేయగా.. ఆమె వచ్చి సత్తయ్యను నేరుగా శ్మశాన వాటికకు తీసుకెళ్లి వదిలిపెట్టి వెళ్లిపోయింది.

## ఆర్టీసీ సమ్మెపై సీఎం కేసీఆర్ సుదీర్ఘ సమీక్ష
# మంత్రుల కమిటీ?

(మొదటిపేజీ తరువాయి)

పాటు పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను ఎంపిక చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కమిటీ నియమించాక వారు ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో చర్చించాల్సిన అంశాలు, మార్గదర్శకాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

### పూర్తిస్థాయి ఎండీ నియామకానికి కసరత్తు

ఆర్టీసీకి కొత్త ఎండీని నియమించాకే సమ్మె చేస్తున్న కార్మిక సంఘాల నేతలతో వారి డిమాండ్లపై చర్చించాలని ప్రభుత్వం ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచార సభలో పాల్గొనేందుకు గురువారం అక్కడికి వెళుతున్న సీఎం కేసీఆర్ ఉదయం రవాణా మంత్రి పువ్వాడ అజయ్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై ఆర్టీసీ ఎండీ నియామకానికి ఆమోదముద్ర వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త ఎండీ నియామకానికి సంబంధించిన నిర్ణయం జరిగిన వెంటనే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలతో వారి డిమాండ్లపై చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. కార్మిక సంఘాల నేతలను చర్చలకు పిలవాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. శుక్ర, శనివారాల్లో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలను నూతన ఎండీ చర్చలకు ఆహ్వానించే వీలుందని రవాణాశాఖలోని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హైకోర్టు తీర్పు మేరకు ప్రభుత్వంతో తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. కాగా ఆర్టీసీ నూతన ఎండీ ఎంపికకు సీఎం కేసీఆర్ నలుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. వీరిలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అకున్ సబర్వాల్, శివధర్‌రెడ్డి, స్టీఫెన్ రవీంద్ర పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



ప్రవీణ్ కుమార్ ప్రస్తుతం షెడ్యూల్డ్ కులాల గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. చాలకాలంగా ఆయన పోలీస్ శాఖ విధుల నుంచి తప్పుకుని ఈ విద్యాలయ నిర్వహణను చేపట్టారు. ఎస్సీ గురుకుల విద్యాలయాల అభివృద్ధికి ప్రవీణ్ కుమార్ చేసిన కృషికి గుర్తింపుగా సీఎం కేసీఆర్ ఆయనను అదే పదవిలో కొనసాగాలని కోరారు. ఇందుకు ఆయన కూడా సమ్మతించారు. మరో సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ పౌర సరఫరాలశాఖ కమిషనర్‌గా ఉన్నారు. శివధర్‌రెడ్డి గతంలో నిఘా విభాగం ఐజీగా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం ఐజీపీ పర్సనల్‌గా పనిచేస్తున్నారు. ఏపీ నిఘా విభాగం చీఫ్‌గా వెళ్ళేందుకు ప్రయత్నించి కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో ఐజీ పదవిలో కొనసాగుతున్న స్టీఫెన్ రవీంద్ర పేరును కూడా ఆర్టీసీ ఎండీ పదవికి సీఎం కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. ఎండీ ఎంపిక ప్రక్రియను పూర్తి చేశాకే ఆర్టీసీ సమ్మె, కార్మిక సంఘాల నేతలతో చర్చల అంశాన్ని ఖరారు చేయాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు తెలుస్తోంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో సంస్థ ఎండీ పదవి భర్తీ ప్రస్తుతం చర్చనీయాంశమైంది. పదహారు నెలలుగా ఆర్టీసీకి ఎండీ లేకపోవడం, ఇంఛార్జి ఎండీతో సంస్థను నిర్వహించడంవల్ల పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్టీసీని నిర్వీర్యంచేసే ఉద్దేశంతోనే సంస్థకు ఎండీని నియమించలేదన్న కార్మిక సంఘాల ఆరోపణను హైకోర్టు క రాడా సమర్థించడాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్ర రవాణాశాఖ కార్యదర్శి సునీల్ శర్మ ఆర్టీసీ ఎండీగా తాత్కాలిక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. రవాణాశాఖతో పాటు రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శిగా కూడా ఆయన ఉన్నారు. ఇటు రోడ్లు, భవనాలశాఖ, అటు రవాణాశాఖ రెండు పదవులు నిర్వహిస్తుండడంతో ఆర్టీసీలో ఉన్న సమస్యలు పేరుకుపోయాయని ఆర్థిక అంశాలకు సంబంధించి ఆయన సత్వర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో కార్మిక సంఘాలు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మెకు దిగడం, సంస్థకు ఎండీ లేకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తోంది. ఆర్టీసీకీ, ప్రభుత్వానికి మధ్య సమన్వయం చేసే అధికారి లేకపోవడంవల్లే ఆర్టీసీలో ఇబ్బందులు తలెత్తాయన్న భావన ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. దీంతోపాటు ఆర్టీసీలో ఎండీతో పాటు కీలకంగా ఉండే ఆర్థిక అంశాలను పర్యవేక్షించేసలహాదారు పదవి కూడా ఖాళీగా ఉండడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెబుతున్నారు. 2018, జూన్ 15వ తేదీవరకు రమణారావు ఆర్టీసీ ఎండీగా కొనసాగారు. నాలుగేళ్ళ క్రితమే ఆయన పదవీ విరమణ చేసినా ప్రభుత్వం రమణారావును కొనసాగిస్తూ వచ్చింది. సమ్మె నేపథ్యంతో పాటు హైకోర్టు తీర్పు ఇచ్చిన దృష్ట్యా గురువారం మధ్యాహ్నంలోపు ఆర్టీసీకి కొత్త ఎండీని నియమించి ఆ విషయాన్ని శుక్రవారం ఉదయం కోర్టుకు తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం.



# అభివృద్ధే ఏకైక అజెండా

- అన్ని రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోంది
- అంకితభావంతో పని చేస్తే అద్భుతాలు
- ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** అంకితభావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని, అంకితభావమే గుణాత్మక మార్పులకు నాంది పలుకుతుందని ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం ట్రాన్స్‌ఫార్మింగ్ స్టేట్ ఎఫెక్టివ్ ఇన్ తెలంగాణ అనే అంశంపై అర్థగణాంక శాఖ కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుతోపాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సలహాదారు మురళీధరన్ కార్తికేయన్ ఆధ్వర్యంలో సేజిస్ సంస్థతో కీలక ఎంవోయూలను కుదుర్చుకున్నారు. రాష్ట్రప్రణాళిక, అభివృద్ధిలో సమగ్ర కార్యాచరణను రూపొందించేందుకు ఈ ఒప్పందం చేసుకున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఈ ఎంవోయు ఎంతో ఉపయోగపడుతుందని వారు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అర్థగణాంక, ప్రణాళికా శాఖలు పక్కా వివరాలు సేకరించాలని మంత్రి హరీష్‌రావు అన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. తాము ఉద్యమకారులమని, నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. ఎప్పుడు ఏది ఎలా చేయాలో, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో ఉద్యమకారులమైన తమకు తెలుసునని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఆయన గుర్తు చేశారు. కేవలం తెలంగాణ అభివృద్ధి ఏకైక అజెండాగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ అన్ని రంగాల అభివృద్ధిలో దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు.

## అమరావతికి రాయలసీమ హైకోర్టు
# ఉద్యమ సెగ

- సచివాలయం ఎదుట న్యాయవాదుల ఆందోళన
- ఏపీ సీఎంకు ప్లకార్డుల ప్రదర్శన

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని గత కొద్దికాలంగా అక్కడి న్యాయవాదులు చేస్తున్న ఉద్యమ సెగ రాజధానిని తాకింది. రాయలసీమ ప్రాంతానికి చెందిన కర్నూలు, కడప, అనంతపురం, జిల్లాలకు చెందిన వందమందికి పైగా న్యాయవాదాఉలు బుధవారం సచివాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లకార్డులు పట్టుకొని ఆందోళనకారులు రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని, శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయాలని, అభివృద్ధిని వికేంద్రీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ రోజు కేబినెట్ సమావేశం ఉండడంతో సచివాలయంకు ముఖ్యమంత్రి జగన్ కాన్వాయ్ వెళ్తుండగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. అలాగే మంత్రుల వాహనాలు సచివాలయంలోకి వెళుతున్న సమయంలో కూడా ఫ్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా రాయలసీమ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే రాయలసీమలోనే హైకోర్టు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇవ్వడం.. అధికారంలోకి వెళ్లాక పట్టించుకోకపోవడం పార్టీలకు అలవాటైందని విమర్శించారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు హైకోర్టును రాయలసీమకు తరలించాలని డిమాండ్ చేశారు. అన్ని వ్యవస్థలను అమరావతిలోకి తెచ్చిపెట్టింది టీడీపీయేనని, అందుకు తమ డిమాండ్ విషయమై టీడీపీని సంప్రదించలేదని అడ్వకేట్లు చెప్పారు. హైకోర్టు కోస్తాలోనే ఉండాలని కోస్తా న్యాయవాదులు కోరితే రాజధానిని రాయలసీమకు కేటాయించాలన్నారు. సీఎం జగన్ కలిసేంత వరకు సెక్రటేరియట్ నుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేసి న్యాయవాదులను అక్కడి నుంచి పంపివేశారు.

# చెన్నూరుకూ కాళేశ్వరం జలాలు

- ప్రతిష్టాత్మకంగా పథకం మరింత విస్తృతం
- 1.31లక్షల ఎకరాలకు నీళ్లు
- నియోజకవర్గానికి ఇక మహర్దశ



**హైదరాబాద్ /చెన్నూరు,ఆంధ్రప్రభ :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఫలితాలు మరింత విస్తృతం కానున్నాయి. కాళేశ్వరం బ్యారేజీలతో సజీవనదీ ప్రవాహం సుదూరంగా ఏర్పడుతున్నప్పటికీ పరిసర ప్రాంతాల్లోని కొన్ని నియోజకవర్గాలకు సమగ్రంగా నీరు అందని స్థితి నెలకొంది. మొత్తం ఉత్తర తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ప్రాజెక్టు వల్ల ఆయా నియోజకవర్గాలకు నీరందుతున్నా, సమగ్రంగా అందే పరిస్థితులు ప్లాన్ ప్రకారం లేవు. ఈ నేపథ్యంలో గ్యాప్ ఆయకట్టు పూడ్చేందుకు, తమ నియోజకవర్గాలకు సమగ్రంగా నీరందించేందుకు జలప్రణాళిక రూపొందించాలని, ఏదో ఒక మార్గం ద్వారా ప్రతి ఎకరానికి నీరందించే ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వవిప్ బాల్కసుమన్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తిచేయడంతో నీటిపారుదల శాఖ ఈఎన్‌సికి దీనిపై ఆదేశాలిచ్చారు. గత కొద్దిరోజులుగా దీనిపై నీటిపారుదల శాఖ అధికారులు కసరత్తుచేసి చెన్నూరు నియోజకవర్గానికి సమగ్రంగా నీరందించేందుకు ప్రణాళిక రూపొందించారు.

### కొత్తగా 1.31లక్షల ఎకరాలకు లబ్ధి

చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ ఆదేశాల వల్ల మహర్దశ పట్టనుంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 1,31,840ఎకరాలకు సాగునీ రందించే బృహత్తర ప్రణాళిక రూపుది ద్దారు. బుధవారం దీనికి సంబంధించిన సమావేశం జల సౌధలో జరిగింది. నీటి పారుదల శాఖ ఈఎన్‌సి బాల్కసుమన్‌తో పాటు ప్రభుత్వ విప్ బాల్కసుమన్, చీఫ్ ఇంజనీర్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రాణహిత ఎస్ఈ ఎం.విష్ణుప్రసాద్, డిఈఈ రామకృష్ణ తదితరులు సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఉన్న ఆయకట్టు స్థిరీకరణ, కొత్త ఆయకట్టుకు సాగు రీరందించే ప్రణాళిక, ఇందుకు కావాల్సిన లిఫ్టులు, కాల్వలు, సబ్ స్టేషన్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల అంశాలపై సమగ్రంగా చర్చించారు. దీనిపై డిపిఆర్ రూపొందించనున్నారు.



**మూడు లిఫ్టుల ద్వారా..**

**మొదటి లిఫ్ట్: మేడిగడ్డ బ్యాక్‌వాటర్ ద్వారా..**

వెంచనపల్లి గ్రామం, వేమనపల్లి మండలం దగ్గర ప్రాణహిత నదిమీద ఒక లిఫ్ట్ నిర్మించనున్నారు. ఈ లిఫ్ట్ సహాయంతో వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో 23,770 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందనుంది. 1330 ఎకరాల స్థిరీకరణ జరగనుంది. మొత్తంగా 25,100 ఎకరాలకు లబ్ధి చేకూరనుంది.

**రెండో లిఫ్ట్: అన్నారం బ్యారేజీ ఫోర్‌షోర్ ద్వారా..**

అన్నారం బ్యారేజీ ఫోర్‌షోర్ నుండి 50మీటర్లు నీరు లిఫ్ట్‌చేసి చెన్నూరు, కోటపల్లి మండలాల్లో 31252 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందిస్తూ 30,491ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించనున్నారు.

**మూడో లిఫ్ట్: సుందిళ్ళ బ్యారేజీ ఫోర్‌షోర్ ద్వారా**

సుందిళ్ళబ్యారేజీ ఫోర్‌షోర్ నుండి 83మీటర్లు నీరు లిఫ్ట్ చేసి భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లోని 29,418ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందడంతో పాటుగా 21,879 ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించనున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 17 అక్టోబర్ 2019

## అభిజిత్ ప్రయోగం అభిలషణీయం!

ఈ ఏడాది ఆర్థికశాస్త్రపు నోబెల్ బహుమతి మనదేశానికి ఎన్నో గుణాత్మక సంకేతాలనిస్తున్నది. ప్రవాస భారతీయుడు, బెంగాలీ వారసత్వపు ఆలోచనాపరుడు అభిజిత్ బెనర్జీకి నోబెల్ రావడం భారతదేశానికి గర్వకారణమని వేరే చెప్పుకోనక్కర్లేదు. భారతీయ మూలాలున్న ఒక ఆర్థిక మేధావికి ఇంతటి గుర్తింపు రావడం మన దేశానికి ఒక పాఠం కూడా. ఇంట్లో పెరటి చెట్టు వంటకి పనికిరాదన్నట్టు ఇక్కడే పుట్టి, ఇక్కడే ఎదిగి, ఇక్కడే చదివి, ఇక్కడే ప్రపంచపు ఆర్థిక రథచక్రాల నడతను, నడకను అంచనా వేసిన అభిజిత్ విదేశాల్లో వ్యాపకాలు వెతుక్కుని అక్కడే స్థిరపడి అక్కడే ప్రయోగాలు చేసి అక్కడే విశిష్టమైన అవార్డు గెలుచుకోవడం గురించే ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. ముఖ్యంగా మనదేశం ఆర్థికమాంద్యం ప్రభావానికి గురై, ఒడిదుడుకులతో సతమతమవుతున్న ఈతరుణంలో అభిజిత్ ఉదంతాన్ని ఒక పాఠ్యాంశంగా పాలకులు పరిగణనలోకి తీసుకుని, పరిశీలనాత్మకంగా ఆత్మావలోకనం చేసుకుని విధానపరమైన సవరణలు చేసుకుంటే దేశ ఆర్థిక ఆరోగ్యం కుదుటపడే అవకాశా లున్నాయి. నోబెల్ బహుమతులు కొత్తేమీ కాదు. కాకపోతే అభిజిత్ గెలుచుకున్న నోబెల్ బహుమతి మాత్రం కార్యోన్ముఖ, క్షేత్రస్థాయి సత్ఫలితాలకు సంకేతం. అందుకే ఈ ఉదంతాన్ని మన కేంద్ర, రాష్ట్రాల పాలకులు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. అభిజిత్ చేసింది గొప్ప పనేనా? ఆకాశాన్ని తవ్వి తీశారా? అదేం కాదు. అతి చిన్న ప్రశ్నలు వేసుకుని, దాన్నొక సందేహంగా మార్చుకుని, దానికొక సహేతుక సమాధానం కోసం అన్వేషణ ప్రారంభించి, సంబంధిత బాధితుల సరసన చేరి, వారి జీవనసరళిని పరిశీలించి, ఆవాహన చేసుకుని, అక్కడికక్కడే ఒక తరుణోపాయం ఆలోచించి, వారికి దాన్ని ఆపాదించి, ఫలితాలు చూసి, ఆతర్వాత మాత్రమే దాన్ని సూత్రీకరించి, సైద్ధాంతిక రూపమిచ్చారు. ఇంతటి కసరత్తుని ఏమనాలి? ఆలోచన, అవగాహన, ఆవాహన, అన్వేషణల సమ్మిళితమే ఆయన పరిశోధన. ఆ పరిశోధనకే నోబెల్ వచ్చింది. నిరుపేదల జీవితాలను అట్టడుగునుంచి పైకి తేలేమా? అనే ప్రశ్న అందరికీ వస్తుంది. కాని దానికి సమాధానం? ఆలోచిస్తే చాలా మార్గాలు స్ఫురిస్తాయి. అలా వచ్చినవాటిని వచ్చినట్టు అమలు చేయడమే మన పాలకులు ఘనకార్యంగా భావిస్తున్నారు. ఇక్కడే తప్పటడుగులు పడుతున్నాయి. అలాంటి పథకాలకు డబ్బు వెచ్చిస్తున్నామే గాని క్షేత్రస్థాయిలో ఆశాజనకమైన ఫలితాలు రావడం లేదు. ఇందుకే అభిజిత్ ప్రయోగం అవసరం. సమాజంలోని ఏ వర్గానికైనా ఉపయోగకరమైన సంక్షేమ చర్యలు తీసుకోవాలనుకున్నప్పుడు సదరు జనావళితో మమేకమై, వారి సమస్యలను ఆవాహనం చేసుకుని, అధ్యయనం చేయడం ఒక విశేషప్రక్రియ. తద్వారా లక్షిత వర్గానికి ఉపయుక్తమయ్యే ఆలోచనలు వస్తాయి. వాటికి కార్యాచరణ రూపమివ్వడం ఒక ఎత్తు. అలా అమలవుతున్న కాలంలో నిర్ణీత వ్యవధుల్లో వాటి ఫలితాలను అధ్యయనం చేస్తూ ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేయడం మరొక ఎత్తు. తద్వారా లక్షిత వర్గాల సమూహాల జీవనాల్లో కాలానుగుణంగా చోటు చేసుకునే మార్పులకు తగ్గట్టు పథకాలకూ మార్పులు చేర్పులు చేయొచ్చు. తద్వారా ఆయా పథకాలు దీర్ఘకాలికంగా మనగలుగుతాయి. ఇదంతా ఒక అనివార్యమైన ప్రక్రియగా చూస్తే ఇంతటి కసరత్తు సాధ్యం కాదు. దీన్నొక ఉద్యమంగానే చూడాలి. అభిజిత్ ప్రయోగమూ ఒక ఉద్యమమే. నోబెల్ బహుమతి ప్రకటించిన స్వీడిష్ అకాడెమీ కూడా అభిజిత్ ప్రయోగాన్ని, అతని విజయాన్ని ఒక ఉద్యమంగానే పరిగణించింది.

పెద్దనోట్ల రద్దు అనే విధాన నిర్ణయాన్ని ఈ సందర్భంగా ఆర్థిక నిపుణులు ప్రస్తావిస్తున్నారు. అభిజిత్ ప్రయోగానికి భిన్నంగా ఈ నిర్ణయం జరిగినందునే ఈనాటికీ దాని దుష్ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద నోట్లు రద్దయి ఈ ఏడాది డిసెంబరు నాటికి మూడేళ్లు నిండుతాయి. అయినా అది సృష్టించిన ఆర్థిక కలకలం ఇంకా సద్దుమణగలేదు. నిజానికి ఇది కొన్ని తరాలను ప్రభావితం చేస్తుందనడానికి ఎలాంటి సంకోచం అక్కర్లేదు. అభిజిత్ ప్రయోగాన్నే గనక దీనికి వర్తింపచేసి ఉంటే చక్కని మార్గాన్వేషణకు వీలయ్యేదన్నది సర్వత్రా వినవస్తున్న ఒక అభిప్రాయం. సమస్య మూలాల జోలికి వెళ్లకుండా, తీవ్ర దుష్ప్రభావాలుండే అత్యంత శక్తిమంతమైన మెడిసిన్ వాడిన చందంగా ఈ నిర్ణయం ఉన్నట్టు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈరోజుకీ మన ఆర్థిక వ్యవస్థలో నల్లధనం ఎంతుందో చెప్పలేని స్థితిలో ఉన్నామంటే పెద్దనోట్ల రద్దు నిర్ణయంలో సహేతుకత నేతిబీరకాయ చందమేనని వారి ఉద్దేశం. అలాగే జీఎస్టీ. ఇతర దేశాల్లో దివ్యంగా అమలవుతున్న ఈ నిర్ణయం మనదేశంలో నేటికీ ఇబ్బందులనెదుర్కొంటున్నది. దేశ ఆర్థిక ప్రగతి రథచక్రాలకు కందెనలాంటి నిర్ణయాలలో ఆర్థిక నిపుణుల ప్రమేయాన్ని పెంచాలని పలువురు సూచిస్తున్నారు. మనదేశంలో ఏ రంగంలోనైనా నిపుణులకు కొదువ లేదు. కాని వేలాది మంది నిపుణులు ఇక్కడ తమ మేధస్సుకి పదును పెట్టుకుని విదేశాలకు వెళ్లి అక్కడ స్థిరపడిపోతున్నారు. ఆయా దేశాలకు వారి సేవలను వినియోగిస్తున్నారని అనేకంటే అక్కడి ప్రభుత్వాలు వారి నైపుణ్యాన్ని గుర్తిస్తున్నాయని చెప్పుకుంటే సబబుగా ఉంటుంది. కాని మనదేశంలో మాత్రం నిపుణులకు ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో పెద్దగా గౌరవం, గుర్తింపు ఉండదు. విధాన నిర్ణయాలను అమలుచేసే ప్రక్రియలో పాలుపంచుకునే అవకాశం ఇస్తారు గాని విధాన నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం ఉండదు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి మాత్రం ఇందుకు మినహాయింపు. ఆర్థిక నిపుణుడిగా ఉంటూ రిజర్వుబ్యాంకు గవర్నరుగా వ్యవహరించారు. ఆర్థికశాఖ మంత్రిగా ఉండి అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకి కుడిభుజంగా ఆర్థిక సంస్కరణలకు నాంది పలికారు. తర్వాత ప్రధానమంత్రిగా కూడా ఆర్థికరంగం మీదే ఎక్కువ దృష్టి పెట్టారు. ఇదంతా చరిత్ర. దేశ ఆర్థికమంత్రిగా ఆర్థిక నిపుణులను నియమించి, దేశ ఆర్థిక సమస్యలకు పరిష్కారం వెదికే బాధ్యతను పూర్తిగా వారి భుజస్కంధాల మీద వేయడానికి మన పాలనావ్యవస్థ అంగీకరించదు. ఏ రంగానికి చెందిన నిపుణులైనా..వారి ఆలోచనలన్నీ ప్రాక్టికల్ విజన్‌తో ఉంటాయన్నది ఒక నమ్మకం. థియరిటికల్‌గా కాకుండా క్షేత్రస్థాయి పరిస్థితులకు తగ్గట్టు ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరాన్ని నిపుణులు అంగీకరిస్తారు. రాజకీయ నాయకులు వారి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగానే ఆలోచిస్తారు. అది వారికి అనివార్యం కావచ్చు. కాని ఇక్కడ రాజకీయ ప్రయోజనాల కన్నా ప్రజల ప్రయోజనాలు, వారి సంక్షేమం, దరిమిలా దేశ ఆర్థిక ప్రగతి ముఖ్యం. అది గుర్తించక కాదు. గుర్తిస్తే వారి రాజకీయ లక్ష్యాలకు విఘాతం కలుగుతుంది. ప్రజలకు సుపరిపాలన అందించే ప్రక్రియలో అభిజిత్ ప్రయోగాలకు పెద్దపీట వెయ్యాల్సిన అవసరమెంతైనా ఉంది. వివిధ రంగాల్లో మేధావులు, నిపుణులు చేసిన కృషిని గుర్తించి, వారి ప్రయోగాత్మక వైఖరికి భాగస్వామ్యం కల్పించాలని పాలకులు గుర్తిస్తే మున్ముందు దేశ ఆర్థిక వ్యవస్థ ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కోగలుగుతుంది. మనకున్న అసంఖ్యాక అభిజిత్‌లను గుర్తించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం!

# ఎఫ్‌డీఐలపై సంఘ్ గుర్రు!

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బీజేపీకి సైద్ధాంతిక స్ఫూర్తిని ఇస్తున్న సాంఘిక, సాంస్కృతిక సంస్థ. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు పాలనలో ఆర్ఎస్ఎస్ జోక్యంలేదని ఆ సంస్థ వారూ, బీజేపీ నాయకులూ ఖండిస్తూ ఉన్నప్పటికీ, ప్రభుత్వ విధానాలను ఆర్ఎస్ఎస్ ప్రభావితం చేస్తుందనేది సర్వత్రా ఒక నమ్మకం. దసరా సందర్భంగా నాగ్ పూర్‌లో జరిగిన సంస్థ వార్షికోత్సవాల సందర్భంగా ఆ సంస్థ అధిపతి మోహన్ భగవత్ ప్రసంగం లో అన్యాపదేశంగా స్వదేశీ జాగరణ్ మంచ్ వారంరోజుల పాటు జరిపే ఉద్యమం గురించి విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల గురించి ప్రధానంగా ప్రస్తావించారు.ఎఫ్ డిఐల ను ఆర్ ఎస్ఎస్ ఆనాడు వాజ్ పేయి హయాంలోనూ వ్యతిరేకించింది. అయితే, ఆర్ఎస్ఎస్ సలహాలను ఏదో రూపంలో అమలులో పెట్టేందుకు ప్రయత్నించడం వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డీఏ-1 ప్రభుత్వంలో చూశాం. పాఠ్యాంశాల కాషాయీ కరణ విషయం అప్పట్లో పెద్దదుమారాన్ని రేపింది. ఆనాటి కేంద్ర మానవ వనరుల మంత్రి డాక్టర్ మురళీమనోహర్ జోషి చొరవను చాలామంది వ్యతిరేకించారు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ హయాంలో అటువంటివేమీ ఇప్పటివరకూ బయటపడలేదు. ఆయన ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా దీర్ఘకాలం అనుభవాన్ని కలిగి ఉన్నందున సంస్థ సిద్ధాంతాలనే తన కార్యక్రమాలుగా మలుచుకున్నారు. ఉదాహరణకు కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణాన్ని రద్దుచేయాలని సంఘ్ శ్రేణులు, కమలనాథులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. మోడీ రెండోసారి అధికారంలోకి రాగానే ఆ డిమాండ్‌ను అమలుజేశారు. ఉమ్మడి పౌరస్మృతి కూడా ఆర్ఎస్ఎస్ అజెండాలోనిదే. ముస్లిం మహిళలను ముమ్మారు తలాక్ ఆచారం నుంచి విముక్తి కలిగించారు. ఆర్ఎస్ఎస్ అజెండాలోని పెక్కు ముఖ్యాంశాలను మోడీ అమలు జేస్తున్నారు. అయితే, ఆర్థిక విధానాలకు సంబంధించి ఆర్ఎస్ఎస్ విధానాలకు ఆయన కొద్దిగా దూరం జరుగుతున్నట్టు కనిపిస్తోంది. ఆర్ఎస్ఎస్ ఆర్థిక సిద్ధాంతాల ప్రకారం స్వదేశీ సంస్థలనే ప్రోత్సహించాలి. కానీ, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐలను) ఆహ్వానించడం అనివార్యం అవుతోంది. ప్రపంచీకరణ అమలులోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛా వాణిజ్యాన్ని అన్ని దేశాలూ అనుసరిస్తున్నాయి. అంతమాత్రాన మోడీ ప్రభుత్వంపై భగవత్ ధ్వజమెత్తుతారనుకుంటే పొరపాటే. చాలా విషయాల్లో ఆయనను మోడీ సంప్రదిస్తున్నారు. భగవత్ ప్రసంగంలో ముఖ్యమైన ముగ్గురి పేర్లను ప్రస్తావించారు.






సిక్కు మత స్థాపకుడు గురునానక్ (550వ జయంతి), మహాత్మాగాంధీ (150వ జయంతి), సంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన దత్తోపంత్ ఠేంగ్డీ (ఈ ఏడాది శత జయంతి). వీరిలో మొదటి ఇద్ద రి గురించి దేశ ప్రజలందరికీ తెలుసు. వారిని పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఠేంగ్డీ ఆర్ఎస్ఎస్ భావజాలానికి చెందినవారు. ఆయన మాజీ ప్రధాని వాజ్‌పేయితో కలిసి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)ను స్థాపించారు. ఆ తర్వాత ఠేంగ్డీ పూర్తిగా ఆర్ఎస్ ఎస్ కార్మిక విభాగమైన బీఎంఎస్ కార్యకలాపాలకే పరిమితం కాగా, వాజ్‌పేయి రాజకీయాల్లో అంచలంచెలుగా పైకి వచ్చారు. వాజ్‌పేయి తనకు మిత్రుడైనా, ఎన్‌డీఏ-1 పాలనలో వాజ్‌పేయి ఆర్థిక విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఒక దశంలో ప్రభుత్వంపై యుద్ధాన్ని ప్రకటించినంతగా పనిచేశారు. ఆయనకు మద్దతుగా స్వదేశీ జాగరణ్ మంచ్ కూడా ఆందోళనలను నిర్వహించేది. బీజేపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆ పార్టీ సిద్ధాంత కర్త గోవిందాచార్య, స్వదేశీ జాగరణ్ మంచ్ తరఫున గురుమూర్తి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వ్యతిరేకిస్తూ అప్పట్లో పత్రికల్లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు రాసేవారు. ఇప్పుడు అలా ఎవరూ రాయకపోయినా మోడీ ప్రభుత్వం ఎఫ్‌డీఐల విషయంలో దూకుడుగా వ్యవహరించడం సంఘ్ నాయకులకు నచ్చడంలేదన్న సంగతి మోహన్ భగవత్ ప్రసంగాన్ని బట్టి తెలుస్తోంది. దత్తోపంత్ ఠేంగ్డీకి తన ప్రసంగంలో అంత ప్రాధాన్యం ఇవ్వడంలో ఆయన ముఖ్యోద్దేశ్యం అదే కావచ్చు. అయితే ఈ ఏడాది ఠేంగ్డీ శతజయంత్యుత్సవాల కారణంగా ఆయన పేరును భగవత్ ప్రధానంగా ప్రస్తావించి ఉండ వచ్చు. భారతీయ జనతా పార్టీ, దాని మాతృక అయిన భారతీయ జనసంఘ్ భావజాలానికి ఆయన ప్రతినిధి. ఆ పార్టీ వారందరికీ ఆయన ఎంతో గౌరవ భాజనుడు. అయితే, మోడీ ప్రభుత్వం ఎఫ్‌డీఐలను జోరుగా ఆహ్వానిస్తున్న తీరు ఆయనకు నచ్చలేదన్న సంగతి తేటతెల్లం అవుతోంది. ఆర్ఎస్ఎస్‌కు పార్టీ రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలన్న ఆకాంక్ష లేదు. తమ మనసెరిగి ప్రవర్తించే నాయకుడు అధికారంలో ఉన్నప్పుడు బయటపడాల్సిన అవసరం లేదన్నది భగవత్ ఉద్దేశ్యం. వాజ్‌పేయి హయాంలో అయితే ఠేంగ్డీ ఆనాటి ఆర్థికమంత్రి యశ్వంత్‌సిన్హాను తప్పించాలని గట్టిగా పట్టుపట్టినట్టు, దానికి వాజ్‌పేయి ఒప్పుకోనట్టు అప్పట్లో కథనాలు వెలువడ్డాయి.. కొంతకాలం తర్వాత భగవతే వెనక్కి తగ్గారు. వాజ్‌పేయి సంస్కరణలను కమ్యూ నిస్టులు, కాంగ్రెస్ వారి కన్నా ఎక్కువ ఆయన విమర్శిం చేవారు. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు అడ్డూఅదుపూ లేకుండా వచ్చి పడుతున్నాయి. ఆ మాటకు వస్తే ప్రధానమంత్రి నరేంద్రమోడీ విదేశీ పర్యటనల్లో ఆయా దేశాల్లో పేరొందిన సంస్థలనూ, ప్రవాస భారతీయులను భారత్‌లో పెట్టు బడులు పెట్టమని ఆహ్వానిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తరచూ ఇస్తున్న కాంగ్రెస్ ముక్త్ భారత్ (కాంగ్రెస్ రహిత భారత్) నినాదం ఆర్ఎస్ఎస్ అధిపతికి నచ్చలేదు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించి ఆయనను గౌరవించారు. గత ఏడాది భగవత్ మూడు ప్రసంగాల ద్వారా తమ సంస్థపై ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేశారు.

తమ సంస్థకు రాజకీయాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ, 2018లో విజయ దశమి సందర్భంగా ఆయన చేసిన ప్రసంగంలో అంతర్లీనంగా రాజకీయాంశాలే ఉన్నాయి. బహుశా 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీ విజయానికి ఊతం ఇచ్చే రీతిలో ఆయన ప్రసంగించి ఉండవచ్చు. స్వయం సేవక్‌లు దేశానికి ఏది మంచో అది ఎంచుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపు ఇచ్చారు. అంటే మళ్లీ బీజేపీని గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేయమని ఆయన పిలుపు ఆంతర్యం. దానికి తగ్గట్టుగానే 2014 కన్నా, 2019లో స్వయం సేవక్‌లు బీజేపీ విజయానికి అవిశ్రాంతంగా కృషి చేశారు. ఈ దేశానికి హిందుత్వ విధానమే సరైనదనీ, హిందుత్వలో మత ప్రమేయం ఏమీ లేదనీ, అది భారత్ జీవన విధానమని స్పష్టం చేశారు. అదే సందర్భంలో ఆయన అర్బన్ నక్సల్స్‌ను తీవ్రంగా విమర్శించారు. నగరాలు, పట్టణాల్లోని మేధావులు యువతను పెడతోవ పట్టిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. . 2008 తర్వాత దేశం ఇప్పుడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడాన్ని ఆర్ఎస్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దానివల్ల మన రక్షణ వ్యవస్థ గుట్టుమట్లు విదేశాలకు తెలుస్తాయన్నది ఆర్ఎస్ఎస్ అనుమానం.

అంతేకాక, విదేశీ సంస్థలకు స్వదేశీ సంస్థల్లో ప్రవేశం కల్పించినప్పుడు వీటో హక్కు మన ప్రతినిధులకే ఉండాలన్నది ఆర్ఎస్ఎస్ వాదన. విదేశీ పరిజ్ఞానాన్ని పుణికి పుచ్చుకోవడంలో తప్పులేదు కానీ, విదేశీ సంస్థలకు మన శాస్త్ర, సాంకేతిక అంశాలను అందుబాటులో ఉంచడం సబబు కాదన్నది ఆర్ఎస్ఎస్ వాదన. అయితే, ఇప్పటికిప్పుడు ప్రభుత్వంతో తలపడే ఉద్దేశ్యం ఆర్ఎస్ఎస్‌కు లేకపోయినా, మోడీ ఆర్థిక విధానాలు ఆర్ఎస్ఎస్‌కు ఏమాత్రం నచ్చడం లేదన్నది వాస్తవం.

**- తన్మయ్**

## బహుజన రాజ్యస్థాపనే ఓంకార్‌కు నివాళి



(నేడు 11వ వర్ధంతి)

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ శాసనసభ్యులు, ఎంసిపిఐ(యు) వ్యవస్థాపకులు, అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అమరులై 2019 అక్టోబర్ 17 నాటికి పదకొండు సంవత్సరాలు కావస్తోంది. 1924లో ఉమ్మడి నల్గొండ జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం, ఏపూర్‌లో మద్దికాయల రామయ్య, అనంతలక్ష్మి దంపతులకు జన్మించారు. 16 సంవత్సరాల వయస్సులోనే నిజాం నవాబ్ పాలన నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆంధ్ర మహాసభలో వాలెంటర్‌గా చేరి ఆ తరువాత భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తికి సాగిన మహత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారు. నిజాం సైన్యాలపై, యూనియన్ సైన్యాలపై ఆయన తుపాకీ అందుకొని సాయుధపోరాటం చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర ప్రభుత్వమే రిజర్వేషన్స్ కల్పించినప్పటికీ సక్రమంగా అమలుకు నోచుకోలేకపోతున్నాయి. బిసిలను రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలినప్పటికీ నేటికీ శాసనసభలలో, పార్లమెంటులో వీరి రాజకీయ ప్రాతినిధ్యం వేళ్ళపై లెక్కపెట్టే విధంగా ఉన్నాయని ఎప్పుడో గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చి అనేక దశాబ్దాలు గడుస్తున్నా రాయితీలు మాకు, రాజ్యాధికారం మీకా? పరికరాలు మాకు పదవులు మీకా? ఓట్లు మావి, సీట్లు మీవా? విద్య, ఉద్యోగం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలపై అగ్రకుల సంపన్న వర్గాల ఆధిపత్యం సాగదు అంటూ, జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు పంపకం కావాలి, వారే రాజ్యాధికారం చేపట్టాలంటూ 1999లో 14 కుల సంఘాలను కలుపుకొని ఉమ్మడి రాష్ట్రంలో మహాజన ఫ్రంట్ ఏర్పాటు చేసి జనాభాలో ఎక్కువ శాతం ఉన్న బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు అన్ని రంగాలలో సమన్యాయం సాధించాలని పిలుపునిచ్చి, వారందరినీ ఒక తాటిపైకి తెచ్చిన ఘనత కామ్రేడ్ ఓంకార్ గారిది. వరంగల్ జిల్లా నర్సంపేట నుండి ఐదుసార్లు శాసనసభ్యునిగా రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తున్న సమయంలో కూడా సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం చట్టసభలో తన గళాన్ని వినిపించారు. ఓంకార్ అంచనా వేసినట్లు ప్రస్తుత దోపిడీ పాలన వ్యవస్థలో కుల ఆధిపత్యం బలపడింది. జనాభాలో 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ బహుజన ప్రజలు రాజకీయ రంగాలలో ప్రాధాన్యత సాధించవలసి ఉంది. ఇప్పటికైనా మేమెంతో మా సీట్లు అంతే! ఓట్లు మావే సీట్లు మావే ఓట్లు మావి అధికారం మీదంటే ఇక చెల్లదని పాలకవర్గ పార్టీలకు తగిన విధంగా బహుజన ప్రజలు బుద్ధి చెప్పవలసి ఉంటుంది. నాడు 1999లో ఏర్పాటు అయి న మహాజన ఫ్రంట్ కూడా ఈ నినాదంతోనే ఏర్పడింది. బహుజనులకే రాజ్యాధికారం నినాదాన్ని దేశంలో, రాష్ట్రంలో ఎంసిపిఐ(యు) బలోపేతం చేసే దశలో ఉండగానే మన రాష్ట్రంలో 2018 జనవరిలో సిపిఎం నేతృత్వంలో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బిఎల్ఎఫ్) ఏర్పడింది. ఓంకార్ గారి 11వ వర్ధంతి సందర్భంగా 2019 అక్టోబర్ 17 నుండి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బహుజనులకు రాజ్యాధికారం - బిఎల్ఎఫ్‌యే ప్రత్యామ్నాయం అనే అంశంపై సభలకు, సదస్సులు జరుగుతున్నాయి. బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే కామ్రేడ్ ఓంకార్‌కి అర్పించే నిజమైన నివాళి.

**-వనం సుధాకర్**
ఎంసిపిఐ(యు), రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు
9989220533

## అవినీతి అభివృద్ధిని మింగేస్తోంది!

సొంతకీయం

ఇటీవల ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ వెల్లడించిన నివేదికలో భారత్ మరింత అవినీతి గల దేశాలలో ముందంజలో ఉందని తెలిపింది. అవినీతి అభివృద్ధిని మింగేస్తోంది. తెలుగు రాష్ట్రాలలో అవినీతి అధికారుల హవా కొన సాగుతోంది. రెవెన్యూ, రిజిస్ట్రార్ శాఖలలో అవినీతి అధికంగా జరుగుతున్నట్లు సర్వేలో వెల్లడైంది. గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులు ప్రజలను పీల్చిపిప్పిచేస్తున్నారు. సాదాబైనామా నుండి భూముల క్రమబద్ధీకరణలో అవినీతికి పాల్పడవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా అవేమీ పట్టించుకోకుండా బాహాటంగానే బరితెగించి జనాల నుండి జలగల్లా డబ్బులు గుంజుతున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి గూర్చి అందరికీ విదితమే. బ్రోకర్ల నుండి పెద్దమొత్తంలో ఆమ్యామ్యాలు అధికారు లకు వెళుతుంటాయి. ఏసిబి అధికారులు వరుసగా దాడులు నిర్వహించి అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించినా అవినీతి తగ్గుముఖం పట్టడం లేదు. వారంలో మూడు నుండి నాలుగు అవినీతి కేసులు నమోదు అవుతున్నాయి.

**-కామిడి సతీష్‌రెడ్డి**
జడలపేట, 9848445134

# ఏకీకరణ విధానం వెనుక అసలు కథ..!



వాణిజ్యం, వ్యాపారంలో అగ్రరాజ్యం అమె రికాతో పోటీపడుతున్న చైనాను ఆర్థిక మందగమనం పెనుభూతంలా వెంటాడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా చైనా ముందడుగు వేస్తున్న క్రమంలోనే కీలక రంగాల్లో వృద్ధిగణ నీయంగా పడిపోవడం.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 13 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా అమెరికా తర్వాత అంతటి దేశంగా ఎదగాలన్న ఆకాంక్షకు మందగమనం అడ్డుకట్ట వేసిందనే చెప్పాలి. ఇక పాకిస్థాన్ మీదుగా నిర్మిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ పథకం కూడా ఆర్థిక భారాన్ని మోపింది. ఈ ప్రాజెక్టు కోసం చైనా ఒక ట్రిలియన్ డాలర్లు వెచ్చిస్తోంది. దీంతో ముంచుకొస్తున్న ముప్పు నుంచి గట్టె క్కేందుకు చైనా తన ముందున్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నది. ఇదే సమయం లో బంగారు బాతులా తన భూభాగంలోనే ఉన్న హాంకాంగ్‌ను విలీనం చేసుకోవాలన్న ఆలోచనతో ఉంది. హాంకాంగ్ చైనాలో విలీనం అనుకున్నంత సులువైన పని కాకపోయినా.. తప్పనిసరి అన్నది చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ మనోగతం. బంగా రు గుడ్లు పెట్టే బాతును సొంతం చేసుకుంటే ఆర్థిక కష్టాలు తీరిపోతాయన్నది ఆయన మనసులోని మాటగా తెలుస్తోంది. ఇటీవల జరిగిన చైనా ఆవిర్భావ దినోత్సవం రోజున జిన్‌పింగ్ ప్రసంగాన్ని పరిశీలిస్తే 60 సార్లు ఆయన నోట పోరా టం అనే మాట వినిపించింది. జిన్‌పింగ్ అధికారం లోకి వచ్చేనాటికి 2012 లో ఆయన ఎత్తుకున్న జాతీయ పునరుద్ధరణ, ఏకీకరణ నినాదానికి బీజం వేసేట్లుగా ఆయన ప్రసంగం సాగింది. అంటే అభివృద్ధిలో అందనంత ఎత్తులో ఉన్న హాంకాంగ్‌ను చైనాలో పూర్తిగా విలీనం చేయాలన్నదే జిన్‌పింగ్ మనోగతంగా తెలు స్తున్నది. హాంకాంగ్‌ను పూర్తిగా విలీనం చేసు కుంటే మందగమనం దరిదాపుల్లోకి కూడా రాదన్నది విశ్లేషకుల మాట. అందుకే జిన్‌పింగ్ ఐక్య చైనా కోసం ఉద్యమిద్దాం.. పోరాటం చేద్దాం అనే నినాదాన్ని ఎత్తుకున్నారు.

**హాంకాంగ్‌లో గందరగోళం:** మనకు మరో రాజకీయ ప్రత్యామ్నాయం లేదు..కేంద్రీకృత, ఏకీకృతమైన బలమైన నాయకత్వం కావాలి..అని చైనా పౌరులకు చైనా కమ్యూనిస్ట్ పార్టీ మొదటి నుంచి ఊదరగొడుతోంది. సెప్టెంబర్‌లో ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోనూ కీలక అంశాలను ప్రస్తావించింది. సరిహద్దుల్లో ఘర్షణలు, ఆందోళ నలను విభజన, విచ్ఛిన్న రాజ కీయాలకు తెరతీసే పరిస్థితులు వస్తున్నాయని.. ఇలాంటి పరిస్థితుల్లో ఐక్య చైనా ఒక్కటే మన ముందున్న మార్గమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 1న చైనా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హాంకాంగ్‌లో నిరసన ప్రదర్శనలు సాగాయి. చైనా నుంచి తమకు విముక్తి కల్పించాలన్న డిమాండ్ హాంకాంగ్‌లో తీవ్రమైంది. నిరసనలు, ఆందోళనలు ఉధృతం చేయడంతో ఓ దశలో పోలీసులు కాల్పులు జరపాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. నిజానికి హాంకాంగ్‌లో కొన్ని దశాబ్దాలుగా ఆందోళనలు సాగుతూనే ఉన్నాయి. 1997 నుంచి అమలులోకి వచ్చిన ఒకే దేశం రెండు విధానాలు పాలసీని వ్యతిరేకిస్తున్నారు. హాంకాంగ్ ప్రజలు స్వేచ్ఛను హరించే విధంగా బీజింగ్ వ్యవహ రిస్తోందంటూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సమయం చూసి హాంకాంగ్, తైవాన్‌పై చైనా తన పీపుల్స్ లిబరేషన్స్ ఆర్మీని ప్రయోగించడం.. అధికారదాహానికి సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. చైనా ప్రజలు కూడా హాంకాంగ్‌ను దారిలోకి తెచ్చుకుని పూర్తిగా విలీనం చేసుకుంటేనా.. మనకు మంచిదన్న ధోరణితో ఉండటంతో జిన్‌పింగ్ ప్రభుత్వం ఇష్టానుసారంగా హాంకాంగ్‌పై ఆధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తోంది. హాంకాంగ్‌లోని పాలకులు సైతం చైనా అధ్యక్షుడి కనుసన్నల్లోనే



పనిచేస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన హాంకాంగ్ వాసుల్లో నెలకొంది. ముఖానికి మాస్కులు ధరిం చరాదని ఇటీవలే హాంకాంగ్ ప్రజలకు హుకుం కూడా జారీ అయింది. చైనా అధ్యక్షుడు హాం కాంగ్‌పై ఆధిపత్యం కోసం రెండు విధానాలను అవలంభిస్తున్నారని విశ్లేషకులు చెబు తున్నారు. హాంకాంగ్‌లో సాగుతున్న ఆందోళనలకు చైనా ప్రజల నుంచి మద్దతు లేకుండా చూడటం మొద టిదైతే.. చైనా కమ్యూనిస్ట్ పార్టీపై హాంకాంగ్‌లో వ్యతిరేకతను తొలగించడం రెండోదిగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. నిజానికి చైనా హాంకాంగ్ 150 ఏళ్లకు పైగా బ్రిటన్ పాలనలో ఉండగా.. 1842 లో చైనా - హాంకాంగ్ ద్వీపాన్ని బ్రిటన్‌కు అప్పగిం చింది. నాటి నుంచి బ్రిటన్ ఆధిపత్యంలో హాం కాంగ్ వేగంగా ముందడుగు వేసి ..చైనా మొత్తం లో ఎక్కడా లేనంతగా అభివృద్ధి చెందింది.

**వాణిజ్య యుద్ధంతో అంతర్జాతీయ వ్యాపారానికి దెబ్బ:** ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకు ఇటీవలి పరిణామాలు మింగుడు పడటం లేదు. అమెరికా ఎప్పటికప్పుడు చైనా వస్తువులపై దిగుమతి సుంకాలు పెంచడం ఆ దేశ వ్యాపార దిగ్గజాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అంతర్జాతీయ టెలిక మ్యూనికేషన్ సంస్థగా పేరున్న హువావే, జెడ్‌టీఈ సంస్థలను అమెరికా బద్ధవి రోధిగా చూస్తున్నది. చైనా ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయడం ద్వారా భారీగా నగదును సాధిస్తున్న తరుణంలో ట్రంప్ వైఖరి ఆయా సంస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. అమెరికాతో వాణిజ్య యుద్ధం వల్ల కేవలం అమెరికాలోనే కాదు..అమెరికా ప్రభావం ఉన్న ఇతర దేశాల్లో చైనా వాణిజ్య, వ్యాపారాలు దెబ్బతిన్నాయి. చైనా టెలి కమ్యూనికేషన్ సంస్థల నుంచి 5 జీ సేవలు పొందాలనుకుంటున్న భారత్‌కు ఇది శరాఘా తంగా మారింది. చైనా సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటే అమెరికాతో ఎక్కడ మైత్రి సంబంధాలు చెడిపోతా యోనన్న ఆందోళన మొదలైంది. చైనాలో పెట్టుబడులు పెట్టిన అమెరికా కంపెనీలన్నీ వెనక్కి రావాలని ట్రంప్ ఆదేశాలిచ్చినా.. ఆయా కంపెనీల అధినేతలు ఇంకా ఆలోచిస్తూనే ఉన్నారు. ఇక చైనాలో పెట్టుబడులు పెట్టిన భారత కంపెనీలు 40 శాతం వరకు తమ కార్యకలాలను విస్తరించాయి.

**చైనాను వణికిస్తున్న ఆర్థిక మందగమనం:** వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనాపై ఆర్థిక మందగమనం ప్రభావం తీవ్రంగా ఉంది. వినియోగం గణనీయంగా తగ్గడంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సైతం నిధుల కొరత ఏర్పడింది. బుల్లెట్ రైలును ఎప్పుడో ప్రారంభించాలనుకున్నా.. నిధుల కొరతలో ఈ ఏడాదిలో పట్టాలెక్క బోతోంది. చైనాతో పోలిస్తే ఐదురెట్ల చిన్న ఆర్థిక వ్యవస్థ (2.6 ట్రిలియన్ డాలర్లు) కలిగిన భారత్ ఇప్పటికే 508 కి.మీ దూరంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టును పూర్తిచేసిందంటే.. మందగమనం ప్రభావం చైనాపై ఏ స్థాయిలో ఉందో అర్థమౌతోంది. చైనాలో పని చేసే సామర్థ్య వయస్సు గల వారి సంఖ్య గణనీయంగా తగ్గిపో వడం ఇందుకు ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2030 నాటికి చైనాలో 830 మిలియన్ల మంది పని చేయలేని స్థితిలోకి చేరుకుంటుండగా..2050 నాటికి ఈ సంఖ్య కొద్దిగా తగ్గి 700 మిలియన్లకు చేరవచ్చని చెబు తున్నారు. గతేడాది చైనాలో శ్రామికుల సంఖ్య 0.5 శాతం తగ్గిందంటే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థమౌతోంది.చైనా మిత్రుల విషయా నికొస్తే ఆ దేశానికి మంచిమిత్రులుగా కొనసా గుతున్న దేశాల్లో ఒకటి పాకిస్థాన్, రెండోది ఉత్తర కొరియా. చైనా పాకిస్థాన్‌కు మద్దతివ్వడం భారత్ తీవ్రంగా పరిగణిస్తుంది. అందుకే వివిధ వేదికల్లో అంశాల వారీగా విభేధిస్తూనే వస్తోంది. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు విషయంలోనూ పాకిస్థాన్ వాదనకు చైనా మద్దతివ్వడాన్ని భారత్ జీర్ణిం చుకోలేకపోతోంది. అందుకే భారత్‌లోని రాజ కీయ నాయకులు మోడీ ప్రభుత్వానికి కొన్ని సూటిప్రశ్నలు వేస్తున్నారు. కాశ్మీర్ విషయం లో చైనా పాకిస్థాన్‌కు మద్దతివ్వడం మంచిపద్ధతి కాదని.. చైనాలోని హాంకాంగ్‌లాగే భారత్‌లో కాశ్మీర్ ఉందని తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. మహాబలిపురం వేదికగా మోడీతో జిన్‌పింగ్ భేటీలో ఈ అంశాన్ని ప్రస్తావిం చాలని కోరుతున్నారు.

**- రాపెల్లి నీలకంఠం**

Andhraprabha business 2019
బిజినెస్
BUSINESS

## వ్యవసాయ వ్యర్థాలతో బయో బ్రిక్స్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఐఐటీ హైదరాబాద్, కేఐఐటీ భువనేశ్వర్ సంయుక్త భాగస్వామ్యంతో వ్యవసాయోత్పత్తుల వ్యర్థాల నుంచి బయోబ్రిక్స్ తయారు చేసేందుకు పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ప్రతియేటా వేల టన్నుల్లో ఉత్పత్తి అవుతున్న వ్యవసాయోత్పత్తుల వ్యర్థాలను భవన నిర్మాణ రంగానికి ఉపయోగకరంగా మార్చే ప్రక్రియతో పర్యావరణ పరిరక్షణ కూడా దోహద పడుతుందని ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ రిసెర్చ్ స్కాలర్ ప్రియబ్రత రోట్రయ్ తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు ఒక అంచనా ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతియేటా 500 మిలియన్ మెట్రిక్ టన్నుల వ్యవసాయోత్పత్తుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు. ఆ వ్యర్థాలను ఉపయోగించి బయో బ్రిక్స్ తయారు చేసేందుకు ప్రతియేటా 84 నుంచి 104 టన్నుల బూడిదను ఉపయోగించేఅవకాశం ఉంద న్నారు. తాము చేస్తు్న్న పరిశోధనలు ఫలిస్తే భవన నిర్మాణ రంగానికి బయో బ్రిక్స్ ఎంతో దోహద పడతాయన్నారు.



# బ్యాంకు రుణాలకు డిమాండ్ తగ్గింది

## ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం అనుమానమే

### ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి



**ముంబై :** బ్యాంకుల రుణాల డిమాండ్ రెండేళ్ల కనిష్ఠానికి దిగిచ్చింది. వినియోగం మందగించడంతో పాటు డిమాండ్ తగ్గడంతో దాని ప్రభావం బ్యాంకు రుణాల డిమాండ్‌పై ప్రభావం చూపించిందని రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరేళ్లలో ఈ స్థాయిలో బ్యాంకుల డిమాండ్ గతంలో ఎన్నడూ తగ్గిన దాఖలాల్లేవు. బ్యాంకుల రుణాల డిమాండ్ తగ్గడాన్ని బట్టి చూస్తే డిమాండ్.. సరఫరా రెండు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోందని కేర్ రేటింగ్ ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్‌నివాస్ అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి సెప్టెంబర్ వరకు చూస్తే బ్యాంకుల రుణాల డిమాండ్ 8.8 శాతం వరకు క్షీణించింది. దేశంలోని అన్నీ బ్యాంకుల గణాంకాలను పరిగణనలోకి తీసుకొని ఆర్‌బీఐ నివేదికను విడుదల చేసింది. వాటిలో ప్రభుత్వరంగానికి చెందిన అతిపెద్దస్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి బ్యాంకు ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకులున్నాయి. ప్రైవేట్ బ్యాంకుల విషయానికి వస్తే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకులను కూడా పరిగణనలోకి తీసుకుంది. రిటైల్ రుణాల విషయానికి వస్తే పరిస్థితి కాస్తా మెరుగ్గా ఉన్నా, కన్స్యూమర్ రుణాలు ఇవ్వడానికి ముందు బ్యాంకులు జాగ్రత్త వహిస్తున్నాయి. రిటైల్ రుణాల విషయానికి వస్తే కస్టమర్లు రుణాలు తీసుకొని తిరిగి చెల్లించడంలో... వాస్తవంగా చెల్లించాల్సిన తేదీ కంటే మరి కొన్ని రోజులు జాప్యం చేసి రుణాలు చెల్లిస్తున్నారని, ప్రైవేట్ బ్యాంకింగ్‌కు చెందిన కన్స్యూమర్ విభాగం చీఫ్ చెప్పారు. అదే సమయంలో కార్పొరేట్ రుణాలకు కూడా పెద్దగా డిమాండ్ లేకుండా పోయిందన్నారు.

### వచ్చే ఏడాది కూడా ఇంతే

వచ్చే ఏడాది కూడా రిటైల్ రుణాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉంటుందని ఇండియా రేటింగ్స్ గత నెలలో విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అన్నీ రంగాలు మందగమనంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వాటిలో గృహ, ఆటో రంగాలున్నాయి. ఇవే కాకుండా అన్‌సెక్యూర్డ్ రుణాలు వాటిలో క్రెడిట్‌కార్డులు, విద్యారుణాలు, ఇతర రుణాలు వ్యక్తిగత రుణాల్లో కూడా స్వల్ప వృద్ధి కనిపించిందని నివేదికలో వివరించింది.

### ఎన్‌బీఎఫ్‌సీ సంక్షోభంతో మొదలు

రుణాల డిమాండ్ తగ్గడం, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐఎల్అండ్ఎఫ్‌సీ కుప్పకూలిన తర్వాత నుంచి ఈ పరిస్థితి మొదలైంది. కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు రుణాలు ఇవ్వడం తగ్గించాయి. మరి కొన్ని పూర్తిగా నిలిపివేశాయి. ఇదే సమయంలో బ్యాంకులు మాత్రం ఈ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయాయి. ఎన్‌బీఎఫ్‌సీల నుంచి పెద్దమొత్తంలో మార్కెట్ వాటాను తమ ఖాతాలో వేసుకోలేకపోయాయి. ఉదాహరణకు ఆటో రుణాల విషయానికి వస్తే 30 శాతం, గృహ రుణాల విషయానికి వస్తే 40 శాతం ఎన్‌బీఎఫ్‌సీలు ఆక్రమించాయి.

### వడ్డీరేట్లు తగ్గించినా..

బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గించినా రుణాలకు డిమాండ్ మాత్రం పెరగడం లేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆర్‌బీఐ రెపోరేటును 135 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అయితే ఇక్కడ చెప్పుకోవాల్సింది ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గించినా.. వాణిజ్య బ్యాంకులు మాత్రం ఆ స్థాయిలో వడ్డీరేట్లు తగ్గించడంలేదు. ఆర్‌బీఐ బ్యాంకులను వడ్డీరేట్లు తగ్గించాలని ఒత్తిడి చేసిన తర్వాత ఇప్పుడిప్పుడు కాస్తా తగ్గించే పనిలోపడ్డాయి. రుణాలు - డిపాజిట్‌ల మధ్య నిష్పత్తి సమతూకంగా లేనందువల్ల బ్యాంకు వడ్డీరేట్లు తగ్గించలేకపోతున్నాయి. డిపాజిట్‌ల కంటే రుణాల డిమాండ్ తగ్గడంతో బ్యాంకుల ప్రస్తుతం వడ్డీరేట్లు మరి కొంత తగ్గించడానికి అవకాశాలు మెరుగుపడ్డాయి. ఆర్‌బీఐ తగ్గించిన వడ్డీరేట్లను వినియోగదారుడికి బదలీ చేయాలని ఆర్‌బీఐ బ్యాంకులపై ఒత్తిడి తెస్తోంది. ఈ నెల ప్రారంభం నుంచి రుణాలను రెపోరేటుతో అనుసంధానం చేసింది. దీంతో బ్యాంకు రుణాల వడ్డీరేట్లు తగ్గి రుణాలకు డిమాండ్ పెరగుతుందని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. మొత్తానికి రుణాల డిమాండ్ పది శాతం కిందే నమోదయ్యే అవకాశాలున్నాయని కేర్‌రేటింగ్ ఆర్థికవేత్త అభిప్రాయపడుతున్నారు.

## ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టం

### ప్రధాన ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్



భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని, పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టాలని ప్రధాన ఆర్థిక సలహాదారు కెవి సుబ్రహ్మణ్యం బుధవారం నాడు ఇక్కడ చెప్పారు. చిన్న కంపెనీలకు అతి పెద్ద కార్పొరేట్లు సుమారు రూ.40వేల కోట్లు వరకు బకాయిలు పడ్డాయని తెలిపారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా కంపెనీలకు సకాలంలో చెల్లింపులు చేసి వారికి నగదు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫిక్కి ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ ఆయన చెప్పారు. చిన్న కంపెనీలకు నగదు చెల్లించడంతో పెద్దకంపెనీలు కీలకపాత్ర పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి అతి పెద్ద కార్పొరేట్ కంపెనీలు హాజరయ్యాయి. సోమవారం నాడు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఒక సదస్సులో మాట్లాడుతూ అతి పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలకు సుమారు రూ.40వేల బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కంపెనీలు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖకు రిటర్న్స్‌లో ఈ అంశాలను ప్రస్తావించాయని ఆమె అన్నారు. ఆర్థిక వ్యవస్థ మందగించడానికి ప్రధాన కారణం పెట్టుబడులు తగ్గడమేనని సుబ్రమణియన్ అన్నారు. వృద్ధి రేటుకు పెట్టుబడులే కీలకమన్నారు. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ మందగించింది కాబట్టి మానవ వనరులు చౌకకు లభిస్తాయని, పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ఆయన సలహా ఇచ్చారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కూడా గట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నందు వల్ల వృద్ధిరేటు 7-8 శాతానికి తిరిగి చేరుకుంటామన్నారు. ఇదిలా ఉండగా రిజర్వుబ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటును 6.9 శాతం నుంచి 6.1 శాతానికి సవరించింది. ప్రపంచబ్యాంకు తాజా నివేదికలో ఈ ఏడాది వృద్ధిరేటు 6 శాతానికి దిగిరావచ్చునని అంచనా వేసింది.

## ఫోన్‌కాల్స్‌తో రుణాలిచ్చారు

- పీఎస్‌యూ బ్యాంకులను దివాలా తీయించారు
- రఘురాం రాజన్, మన్మోహన్‌సింగ్‌లపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజం



**న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం సంక్షోభంలో కూరుకు పోవడానికి మాజీ రిజర్వు బ్యాంకు గవర్నర్ రఘురాం రాజన్, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌లు కారణమని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయ నాయకులు తమకు దగ్గరి సంబంధికులకు, మిత్రులకు రుణాలు ఇవ్వమని ఫోన్‌లో ఆదేశిస్తే.. పప్పు బెల్లాల్లా రుణాలు మంజూరు చేశారని ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బ్యాంకింగ్ వ్యవస్థను వారు సక్రమంగా నిర్వహించలేదని ఆమె అన్నారు. వీరి నాయకత్వంలో పీఎస్‌యూ బ్యాంకులు భ్రష్టు పట్టిపోయాయన్నారు. రాజన్ పదవిలో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు ఫోన్ చేసి తమవారికి రుణాలు ఇవ్వాలని కోరిన వెంటనే రుణాలు మంజూరు చేశారని ఆరోపించారు. వారి నిర్వాకం వల్ల ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులు మూలధనం కోసం ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. కొలంబియా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ పబ్లిక్ అఫైర్స్‌లో ప్రసంగిస్తూ ఆమె ఈ అంశాలను ప్రస్తావించారు. మాజీ ప్రధాని గురించి మాట్లాడుతూ.. తన వాదనతో డాక్టర్ రాజన్ కూడా ఏకీ భవిస్తారని అంటూ.. మాజీ ప్రధానికి భారత్‌పై స్పష్టమైన దృష్టి, అవగాహన ఉండాల్సిందన్నారు. పీఎస్‌యు బ్యాంకులకు జవసత్వాలు కలిగించ డంపైనే ప్రస్తుతం తాము ఫోకస్ పెట్టామని సీతారామన్ పేర్కొన్నారు.ఇటీవల బ్రౌన్ విశ్వవిద్యాలయంలో రాజన్ ప్రసంగిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొదటి టెర్మ్‌లో ఆర్థిక వ్యవస్థను బలోపేతానికి చేయాల్సినంత చేయలేకపోయారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం కేవలం నాయకత్వం మీద దృష్టి పెట్టింది కానీ, ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ఫోకస్ పెట్టలేదన్న రాజన్ వ్యాఖ్యపై నిర్మలా సీతారామన్‌ను కోరగా.. రాజన్ అంటే తనకు గౌరవమని ఆయన ఆర్థిక మేధావి, రిజర్వుబ్యాంకు బలంగా పటిష్టంగా ఉన్నప్పుడు రాజన్ గవర్నర్‌గా పని చేశారని వ్యంగ్యంగా అన్నారు. రాజన్ అంటే తనకు అపారమైన గౌరవమని.. తాను ఎవరిని కించపరచడం లేద న్నారు. రాజన్ చేసిన వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకొనే తాను వ్యాఖ్యానిస్తు న్నానని ఆమె పేర్కొన్నారు. రాజన్, సింగ్‌లు పద విలో ఉన్నప్పుడు ప్రభుత్వరంగా నికి చెందిన బ్యాంకులు ఇప్పుడున్న పరిస్థితి కంటే మెరుగ్గానే ఉన్నాయన్నారు. అయితే రాజన్‌కు తాను ఒక విషయంలో అభి నందిస్తున్నానని, ఎందుకంటే బ్యాం కుల మొండిబకాయిలతో సతమతమవుతుంటే ఆయన వాటి ఆస్తులను సమీక్షించడానికి గట్టి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజలకు ప్రస్తుతం బ్యాంకులు ఏ పరిస్థితిలో ఉన్నాయో తెలవాల్సిన అసవరం ఉం దన్నారు. రాజన్ బ్యాంకుల ఆస్తుల నాణ్యతపై సమీక్షలు జరిపారు. అక్కడి వరకు బాగా ఉన్నా.. ప్రస్తుతం బ్యాంకులు పూర్తి సంక్షోభంలో కూరుకుపోవడానికి గల కారణం ఏమిటో ఆలోచించాలి, వారిని ప్రశ్నించాలన్నారు. ప్రస్తుత బ్యాంకుల పరి స్థితి, గతంలోని బ్యాంకుల పరిస్థితులపై ఆర్థికవేత్తలు దృష్టి పెట్టి వ్యత్యాసాలను గమనించాలన్నారు. రాజన్ గవర్నర్‌గా ఉన్నప్పుడు భారతీయ బ్యాంకుల గురించి గొప్పగా ప్రసంగించే వారు. ఆయన నుంచి తాను కొన్ని సమాధానాలు రాబట్టాలనుకుంటున్నానని పేర్కొన్నారు. బ్యాంకులను గాడిలో పెట్టడమే ఆర్థికమంత్రి ప్రస్తుతం ప్రధాన దిన చర్య అయ్యిందన్నారు. బ్యాంకుల సంక్షోభం రాత్రికి రాత్రే రావన్నారు. గతంలో చేసిన తప్పిదాలు ఇప్పుడు తమపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

## ఎక్స్ప్రెడ్ నుంచి ఈ- రిక్షా



**కోల్‌కతా :** బ్యాటరీ తయారీ కంపెనీ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈ- రిక్షాల తయారీరంగంలోకి ప్రవేశించబోతోంది. దీనికి 'ఎక్సైడ్ నియో' అని పేరు కూడా పెట్టి బుధవారం మార్కెట్లో విడుదల చేసింది. ముందుగా ఎంపిక చేసిన మార్కెట్లో విడుదల చేసి దశల వారీగా ఇతర మార్కెట్లోకి విస్తరిస్తామని ఎక్సైడ్ ఇండస్ట్రీస్ ఎండీ, సీఈవో గౌతమ్ చటర్జీ అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి దేశంలో ఈ-రిక్షాలకు క్రమంగా డిమాండ్ పెరగుతోందని అన్నారు. ఈ - రిక్షారంగంలో మొట్ట మొదటిసారి ప్రత్యేకంగా బ్యాటరీ సమకూర్చింది ఎక్సైడ్. ఈ- రిక్షాలకు దేశీయ మార్కెట్లో వృద్ధి రేటుకు అవకాశాలు మెండుగా ఉన్నా, ఈ రంగంలోకి అతి పెద్ద కంపెనీలు రావడం లేదని డిప్యూటీ ఎండీ సుభీర్ చక్రవర్తి తెలిపారు.

# హమారా బజాజ్ ఎలక్ట్రిక్ స్కూటర్



**న్యూఢిల్లీ:** బజాజ్ చేతక్ స్కూటర్ కొత్త రూపుతో తిరిగి మార్కెట్లో రీ ఎంట్రీ కాబో తోంది. ఈ సారి ఎలక్ట్రిక్ అవతారంతో ప్రజల ముందుకు దర్శనమివ్వబోతోందని బజాజ్ ఆటో బుధవారం నాడు ప్రకటించింది. బజాజ్‌ను ఎలక్ట్రానిక్ స్కూటర్స్ (ఈ-స్కూటర్) విభాగం కింద చేతక్ బ్రాండ్‌పేరు అమ్మకాలు జరుపుతుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి పూనేలో అమ్మకాలు మొదలుపెట్టి అటు తర్వాత బెంగళూరులో ప్రారంభిస్తుంది. ఈ రెండు నగరాల్లో స్పందన చూసిన తర్వాత దేశంలోని మిగిలిన ప్రాంతాలకు అమ్మకాలను విస్తరిస్తుంది. ఈ-స్కూటర్‌ను బజాజ్‌కు చెం దిన చకాన్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేసి విడుదల చేస్తుంది. కంపెనీకి చెందిన ప్రో-బైకింగ్ డీలర్ షిప్‌ల ద్వారా విక్రయాలు మొదలుపెడుతుంది. ఈ-బజాజ్ స్కూటర్‌ను యూరోప్‌తో పాటు ఇతర మార్కెట్లకు వచ్చే ఏడాది నుంచి ఎగుమతులు చేస్తుంది. నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రవిబజాజ్‌ల సమక్షంలో రవాణామంత్రి నితిన్ గడ్కరీ ఈ-స్కూటర్‌ను ఆవిష్కరించారు. ద్విచక్ర వాహనాల పరిశ్రమలో అందరికంటే ముందు తాము ప్రవేశించాలను కొనే ఈ స్కూటర్ రం గంలో ప్రవేశించామని రవి బజాజ్ అన్నారు. ఈ- స్కూటర్‌ను ఆవిష్కరిం చడం ద్వారా తాము తిరిగి సంప్రదాయ స్కూటర్ రంగంలోకి ప్రవేశించి నట్లు కాదని ఆయన తెలి పారు. అమ్మకాలు పెంచు కోవడానికి తమ దృష్టి ప్రధానంగా బైక్‌లపైనే ఉంటుందని తెలిపారు. ఈ-స్కూటర్‌తో పాటు ఇతర బ్రాండ్‌లు కెటీఎం, ట్రయంఫ్‌ల అమ్మకాలపై కూడా ఫోకస్ పెడుతుందన్నారు. అయితే కొత్త ఈ-స్కూటర్ ధరను మాత్రం వెల్లడించలేదు. దీని ధర మాత్రం రూ.1.5 లక్షలపైనే ఉంటుం దని చెబుతున్నారు. ఈ-స్కూటర్ స్పోర్ట్స్ మోడ్‌లో 85 కిలోమీటర్లు, ఈకో మోడ్‌లో 95 కిలోమీటర్ల వరకు ప్రయాణిం చవచ్చు. సింగిల్ చార్జ్‌కు 5 గంటల సమయం పడు తుంది. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆటో పరిశ్రమ పర్యావ రణానికి అనుకూలంగా ఉండే టెక్నాల జీకి మారుతుందని.. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహ నాలు, జీవ ఇంధనల ద్వారా నడుస్తున్నా యని గడ్కరీ అన్నారు. త్వరలోనే ప్రభుత్వం పాత వాహనాలను తక్కు కింద మార్చే విధా నాన్ని ప్రక టిస్తుం దన్నారు. కాంత్ మాట్లాడుతూ, భవిష్యత్తు ఆటోరంగంలో విప్లవాత్మ కమైన మార్పులు కనిపిస్తా యన్నారు. సంప్రదాయబద్ధమైన ఇంజిన్‌ల స్థానంలో ఎలక్ట్రానిక్‌లకు మారుతోందన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాలకు భారత్‌ను హబ్‌గా మార్చడానికి అందుబాటులో ఉన్న అన్నీ అవకాశాలను విని యోగించుకోవాలని కాంత్ సూచించారు. ఇప్పటికే కార్లు, మొబైల్‌ఫోన్లు, టెలికం విడిభా గాలు, సోలర్‌సెల్స్ తయారీలో మంచి అవకాశాలను కోల్పోయామని కాంత్ వాపోయారు.

## ఐఓబీ బకాయిలు మేజిక్ బ్రిక్స్ ద్వారా విక్రయం

- రూ. 800 కోట్ల వసూళ్లే లక్ష్యం

**0న్యూఢిల్లీ:** ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు రూ.800 కోట్ల మొండిబకాయిలు వసూలు చేసుకోవడానికి .. మేజిక్‌బ్రిక్స్ పోర్టల్స్ ద్వారా ఈ- వేలం చేపట్టనుంది. ఈ వేలం 2 దశల్లో ఉంటుంది. అక్టోబర్ 21, అక్టోబర్ 30 తేదీన నిర్వహిస్తుంది. ఈ ఆస్తుల విక్ర యం దేశంలోని 12 నగరాలకు విస్తరించి ఉన్నాయి. ఐఓబీ మేజిక్ బ్రిక్స్‌తో ఒక ఒప్పందం కూడా కుదర్చుకుంది. సు మారు 500 కంటే ఎక్కువ ఆస్తులను ఈ వేలం ద్వారా విక్రయించి బకా యిలను రాబట్టుకుంటుంది. ఈ ఆస్తులు చెన్నై, కోయంబత్తూరు, ముంబై, పూనే, నాగపూర్, కోలకతా, రాంచీ, మీరట్, లక్నో, లూధి యానా, హైదరాబాద్, భోపాల్‌లో ఉన్నాయి.

# ఆ ప్రయోజనాలన్నీ అందాలి

- నినదించిన విద్యుత్ ఉద్యోగులు
- 'మింట్' వద్ద టీటీఎఫ్ ధర్నా

**హైదరాబాద్, ప్రభ న్యూస్ :** సమస్యల సాధన కోసం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాతో మింట్ కాంపౌండ్ ప్రాంతం దద్దరిల్లింది. వేలాదిగా తరలివచ్చిన ఉద్యోగులు బుధవారం ఎస్పీడీసీఎల్ ప్రధానకార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్య క్రమంలో టీఈటీయూఎఫ్ చైర్మన్ పద్మారెడ్డి, కన్వీ నర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆర్టిజన్ ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే ఏపీఎస్ ఈబీ సర్వీస్ రెగ్యు లేషన్స్‌ను అమలుచేస్తు, 2018 వేతన సవరణతో పాటు ఆర్టిజన్ కార్మికులకు ఇంక్రిమెంట్ అమలు చేయాలని, 1999 ఫిబ్రవరి 1 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులందరికి రివైజ్డ్ పెన్షన్ రూల్స్ 1980 (ఈపీ ఎఫ్ నుంచి జీపీఎఫ్) వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. డిస్కంలలో దీర్ఘ కాలంగా పనిచేస్తున్న అన్-మెన్ వర్కర్లను ఆర్టిజన్ ఉద్యో గులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖల్లో వివిధ పేర్లతో పీస్‌రేట్ విధానంలో పనిచేస్తున్న (ఎస్పీఎం, ఎంఆర్ టీ, స్టార్ వర్కర్స్, స్పాట్ బిల్లింగ్, పీసీఏ, పీఏఏ, ఎన్ ఎస్‌టీపీడీ, వర్కర్స్, హాస్పిటల్ వర్కర్స్, వాచ్ అండ్ వార్డు, ఏపీటీఎస్ సెక్యూరిటీ గార్డులు) ప్రస్తుతం సంస్థల్లో పనిచేస్తున్న వారిని ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ కన్వర్షన్‌కు స్క్రీనింగ్ టెస్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన ఆర్టిజన్ ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగ సదుపాయం కల్పించాలని, ప్రభుత్వం ఇచ్చిన టీవో వో నెంబర్ 160/28-7-2018ని తక్షణమే అమలు చేయా లన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు పరిమితి లేని వైద్య సదుపాయం కల్పించాలని, 1990, 1991, 1992, 1993 స్కేళ్ల వ్యత్యాసాన్ని సరి చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులను వారి స్వస్థలంలో ఉన్న ఆఫీస్ ప్రాంతానికి వెం టనే బదిలీ చేయాలని, సంస్థల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్ మెన్, జూనియ ర్ అసిస్టెంట్, సబ్‌స్టేష న్ ఆపరేటర్, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ ఖాళీలను, కొత్తగా ఏర్పాటైన కార్యాల యా లకు కొత్త పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారు కోరారు. ఈ ధర్నాలో కోచైర్మన్ ఎం.ఎ.వజీర్, శ్రీధర్‌గౌడ్, కుమార్ చారి, సాయిబాబు, మజీద్, గంబో నాగరాజు, రాధాకృష్ణ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 18 నుంచి పార్లమెంట్ సమావేశాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట శీతాకాల సమావేశాలు వచ్చేనెల 18నుంచి ప్రారంభం కానున్నాయి. బుధ వారం కేబినెట్ పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ సమావేశం అనంతరం కొందరు అధికారులు ఈ అంశంపై సూచనప్రాయ వ్యాఖ్యలు చేశారు. కమిటీకి అధ్యక్షత వహిస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. వచ్చేవారం కేబినెట్ సమావేశంలో దీనిపై స్పష్టమైన ప్రకటన వచ్చే అవకాశం ఉంది. గత రెండేళ్ల సంప్రదాయాలను పరిశీలిస్తే, నవంబర్ 21నుంచి సమావేశాలు మొదలై, జనవరి మొదటి వారం వరకు కొనసాగాయి.

## హస్తినలో ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** మెగాస్టార్ చిరంజీవి నటించిన 'సైరా నర్సింహారెడ్డి' చిత్రాన్ని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు మెచ్చుకున్నారు. దేశభక్తి, జాతీయ చిత్రంగా పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలోని ఆయన అధికార నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఈ సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి ఉపరాష్ట్రపతి నివాసానికి చేరుకుని వెంకయ్య నాయుడుతో భేటీ అయ్యారు. సినిమా చూసిన తర్వాత మీడియాతో మాట్లాడిన ఉపరాష్ట్రపతి స్వతంత్రం సంగ్రామంలో ఒక భాగాన్ని ఇతివృత్తంగా తీసుకుని సినిమాను అద్భుతంగా చిత్రీకరించారని చిత్ర నిర్మాత రామ్ చరణ్‌ను, మిగతా యూనిట్‌ను అభినందించారు. ఈ రోజుల్లో ప్రజల్లో భావనాత్మకమైన దేశభక్తి ప్రబోధాన్ని రగిలించేటటువంటి చిత్రాల అవసరం చాలా ఉందని అన్నారు. సినిమాలో చిరంజీవి నటన గురించి ప్రత్యేకంగా చెప్పాలని, అద్భుతంగా, ప్రేరణాదాయకంగా ఒక దేశభక్తుడు దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఎలా పోరాడారనే విషయాన్ని చాలా చక్కగా నటించారని మెచ్చుకున్నారు. ఈ సినిమాలో నటించిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అమితాబ్ బచ్చన్‌ను, వీర వనితగా నటించి రంజింపజేసిన తమన్నాకు, ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి భార్య పాత్రలో నటించిన నయనతారకు కూడా అభినందనలు తెలియజేస్తున్నట్టు ప్రకటించారు.ఒకరి నొకరు గౌరవించుకోవాలనే సందేశాన్ని చూపించారని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. ఈ సినిమాను ప్రత్యేకంగా చూసేందుకు అవకాశమిచ్చిన చిరంజీవికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని తెలిపారు.

ఆంధ్రప్రభ
గురువారం 17 అక్టోబర్ 2019

## లాలాగూడ రైల్వే వర్క్‌షాప్‌కు పురస్కారం




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దక్షిణ మధ్యరైల్వేకు చెందిన క్యారేజి వర్క్‌షాప్ లోని ప్రాథమిక శిక్షణా కేంద్రానికి ఉత్తమ ఎస్టాబ్లిష్‌మెంట్ అవార్డు దక్కింది. ఆ అవార్డును రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి బుధవారం అందజేశారు. 2018- 19 ఆర్థిక సంవత్సరంలో 550 మంది ట్రేడ్ అప్రెంటిస్ అభ్యర్థులకు ఇక్కడ శిక్షణా తరగతుల నిర్వహణతో వృత్తి నైపుణ్యాభివృద్ధి కల్పన కార్యక్రమాలను నిర్వహిం చారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీలో నిర్వహించిన వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవార్డును ఆయన అందజేశారు. నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ (ఎన్‌ఏపీఎస్) పథకాన్ని 2016 ఆగస్టులో కేంద్రం ప్రారంభించింది. శిక్షణా కార్య క్రమాలను నిర్వహించేపరిశ్రమలు, సంస్థలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తారు. పారిశ్రామిక రంగానికి అవసరమైన వృత్తి నైపుణ్యం కలి గిన కార్మి కులను తయారు చేయడమే కాకుండా వారి నైపుణ్యాన్ని మరింత మెరుగు పరచడం ఈ పథకం ముఖ్యోద్దేశం. ఈ పథకంవల్ల ప్రాథమిక శిక్షణా సౌకర్యాలు అందజేస్తున్న సంస్థలు, పరిశ్రమలకు మూడు నెలలు 500 గంటల శిక్షణకు ప్రతి అభ్యర్థికి రూ.7,500లు, లేదా నెలకు రూ.1500లకు పరిమిత వేతనం అందజేస్తారు.

## క్షేత్రస్థాయిలో అడవుల పరిశీలన



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ సహా ఇతర రాష్ట్రా ల అటవీశాఖ అధికారులందరూ మేడ్చల్ జిల్లా కండ్లకోయలో ఉన్న ఆక్సిజన్ అర్బన్ ఫారెస్టు పార్కు, సిద్ధిపేట జిల్లా గజ్వేల్ అటవీ ప్రాంతాల్లో పర్యటించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో ఈనెల 18 వరకు హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో వాతావరణంలో మార్పులు - అడవులపై ప్రభావం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రా లకు చెందిన అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ క్రమంలో బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కండ్లకోయ ఆక్సిజన్ అర్బన్ ఫారెస్టు పార్కు, గజ్వేల్ అటవీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈసందర్భంగా తెలంగాణ ప్రభుత్వం పచ్చదనం పెంపు, అటవీ రక్షణ, హరితహారం, అటవీ పునరుజ్జీవన చర్యలకు ఇస్తున్న ప్రాధాన్యతను రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధానాధికారి(పీసీసీఎఫ్) ఆర్. శోభ ఇతర రాష్ట్రా ల అధికారులకు వివరించారు. గజ్వేల్ షరీఫ్ రిజర్వ్ ఫారెస్టు బ్లాక్ పరిధిలో సింగాయపల్లిలో క్షీణించిన అటవీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పునరుజ్జీవనం చేసిన విధానాన్ని తెలంగాణ అటవీశాఖ అధికారులు అన్ని రాష్ట్రా ల అధికారులకు చూపించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశంగా రాష్ట్రమంతటా హరితహారం, అటవీ పునరుద్ధరణ పనులను అన్ని నియోజకవర్గాలలో చేపడుతున్నట్లు పీసీసీఎఫ్ శోభ వివరించారు. ఈ కార్య క్రమంలో తమిళనాడు, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరాంచల్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, జార్ఖండ్, కేరళతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల అటవీశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్య మంత్రి ఓఎస్డీ ప్రియాంకా వర్గీస్, హైదరాబాద్ చీఫ్ కన్జర్వేటర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆస్కీ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ వల్లి మాణిక్యం, మేడ్చల్, సిద్ధిపేట జిల్లాల అటవీశాఖ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా అటవీ ప్రాంతాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. అడవులు, అర్బన్ ఫారెస్టు పార్కులు, ఎకో టూరిజం ప్రదేశాలను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించి నిషేధాన్ని అమలు చేస్తున్నారు. పర్యావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని నిర్ణయించింది. ఆ దిశగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. ఈ క్రమంలో అటవీశాఖ ప్లాస్టిక్ నిషేదంపై దృష్టి సారించింది. అటవీ ప్రాంతాల్లోకి విహారానికి వచ్చే సందర్శకులు ప్లాస్టిక్ బాటిల్స్, ఆహార పదార్థాల ప్యాకింగ్ కవర్లు, వాటర్‌ప్యాకెట్లు వంటి వస్తువులను అడవుల్లో ఎక్కడిక్కడ వదిలిపెట్టి వెళ్తున్నారు. వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలు, టైగర్ జోన్లలో పూర్తిగా ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించారు.

## సాయి మహాసమాధికి 101 ఏళ్లు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** షిర్డీ సాయిబాబా మహాసమాధి చెంది 15 అక్టోబర్ 2019 నాటికి 101 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా సాయిబాబా ప్రియశిష్యుడైన మహ ల్సాపతి మనవడు అశోక్ నాగరి వద్ద ఉన్న బాబా పాదుకలు, ఆయన ధరించిన కఫ్నీ (వస్త్రం)తో పాటు మహల్సాపతికి ఇచ్చిన మూడు నాణాలను నగరంలోని లక్డీకా పూల్‌లో వున్న వాసవీ కేంద్రం నందు తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ బుధవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో బొగ్గారపు దయానంద్, సంజయ్ విడియాల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాహితం కోసమే యాగం.. యజ్ఞం

**• చండీయాగంలో చినజీయర్‌స్వామి సందేశం**



**సత్తుపల్లి, ప్రభ న్యూస్:** ప్రజాహితం కోసమే యాగ, యజ్ఞాలు సాగుతాయని, భగవంతుడి ఆరాధనలో సంతృప్తి లభిస్తుందని చినజీయర్ స్వామి పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలం, నారాయణపురంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సాగుతున్న చండీ యాగంలో బుధవారం పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. మనిషి స్వార్థంతో కాకుండా తోటివారి శ్రేయస్సు కూడా కోరినప్పుడే దైవానుగ్రహం ప్రాప్తమవుతుందని తెలిపారు. గాలి, నీరు, అగ్ని, వాయువు, చెట్టు, పుట్ట, మట్టి, పక్షి ప్రతి దాంట్లోనూ దైవం ఉంటుందన్నారు. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, కలుషితం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని ఆదేశించిన ఆయన యాగశాలలో కనిపించిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు.

# రైతు దండు రెడీ..!



(మొదటిపేజీ తరువాయి)

రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే విధానమేమిటో ప్రభుత్వం వారికి తర్ఫీదు ఇచ్చింది. విత్తనాలు వేయడం మొదలుకొని పంటను మార్కెట్‌కు తీసుకువెళ్ళేంత వరకు అన్ని దశల్లోనూ రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యం అత్యంత కీలకంగా ఉంటుంది.

### కార్పొరేషన్ స్థాయి... వెయ్యికోట్ల కార్పస్ ఫండ్

రాష్ట్ర రైతు సమన్వయ సమితికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ స్థాయి కల్పించింది. ప్రతియేటా రూ.1000 కోట్ల నిధులతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటుచేసి అత్యవసర సమయాల్లో రైతు సంక్షేమం కోసం ఆ నిధులను ఖర్చు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీచేసింది. రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా కేబినెట్ హోదాలో గుత్తా సుఖేందర్ రెడ్డిని నియమించి బాధ్యతలు కూడా అప్పగించింది. తదనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయనను శాసనమండలి ఛైర్మన్‌గా నియమించ డంతో ప్రస్తుత ఆ పదవి ఖాళీ అయింది. ఇదంతా జరిగి దాదా పు మూడు నెలలైంది. కొత్త సారథిని నియమించాల్సి ఉంది. ఇదిలా ఉంటే, రాష్ట్రసమన్వయ సమితి పాలక మండలి ఏర్పాటై ఏడాదిన్నర గడుస్తున్నా ఏ ఒక్కసారి ఈ కమిటీ సమావేశం కాలేదు. రైతు శ్రేయస్సు, వ్యవసాయ రంగ పురోగతి, సహకార పరపతి విధానంపై చర్చ జరగలేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర సమితికి అధ్యక్షుడిని నియమించాలన్న డిమాండ్ క్షేత్రస్థాయి నుంచి పెరుగుతోంది.

### గ్రామానికి 15మంది రెడీ

ఇప్పటికిప్పుడు కార్యాచరణ ప్రణాళికను అమలుచేసి ఫలితాలను చూపేందుకు ప్రతి గ్రామంలోనూ 15 మంది చొప్పున సమితి సభ్యులు కొలువుదీరి ఉన్నారు. ప్రభుత్వం ఆదేశించిందే తడవుగా ఖరీఫ్ కొనుగోళ్ళలో తమవంతు భాగ స్వామ్యం పంచుకునేందుకు వారంతా సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో 24మంది, జిల్లా స్థాయిలో మరో 24మంది సభ్యులతో కమిటీలు కూడా ఉన్నాయి. వీరికి ప్రత్యేకంగా కార్యాలయాలుకూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయిలో 42మంది సభ్యులతో సమన్వయ సమితి వ్యవస్థ కొలువుదీరి ఉంది. రైతుసంక్షేమం కోసం, వ్యవసాయ రంగంపై ఆధారపడిన కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం తపనతో ఉన్న వ్యక్తికి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

### రైతు ఆదాయం పెంచడమే సమితుల లక్ష్యం

దేశానికే ఆదర్శంగా మారిన రైతు సంక్షేమ కార్యక్రమాలు, వేలకోట్లతో అమలు చేస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాల ద్వారా రైతు ఆర్థికంగా స్థిర పడాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు సమన్వయ సమితులు వారధిగా పనిచేయాల్సి ఉంది. ఇప్పటికే గ్రామస్థాయి నుంచి విస్తరించి ఉన్న మూడంచెల సహకార పరపతి వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదన్న ఆలోచనతో సీఎం కేసీఆర్ ఈ సమితులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పరంగా వ్యవసాయ రంగానికి అందించే చేయూతను పూర్తిగా ఈ సమితుల పర్యవేక్షణలోనే కొనసాగించాలని, పంటల సాగుకు ఎలాంటి ముడిసరుకు కావాలన్నా వీరి ద్వారానే అందించాలని స్పష్టమైన నిర్ణయం ప్రకటించారు. సబ్సిడీపై అందించే ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల సరఫరా, బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు అందేవిధంగా చూడడం, వ్యవసాయ శాస్త్రజ్ఞుల సూచనలు, సలహాలను రైతులకు తెలియపరచడం ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత వీరిపై ఉంది.

### సాంకేతిక, యాంత్రిక సాగు పరిచయం

అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పంటల యాజమాన్యాన్ని నిర్వహించడం, సాంకేతిక, యాంత్రికసాగు విధానాలను పరిచయంచేసి ప్రోత్సహించడం, క్రిమిసంహారక మందుల వినియోగాన్ని తగ్గించే సస్యరక్షణ చర్యలను సూచించడం, ఏ సమయంలో ఏయే పంటలు సాగు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించడం, ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే క్రమంలో కీలకపాత్ర పోషించడం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా క్రయ, విక్రయాలు నిర్వహించేలా చూడడం, సకాలంలో చెల్లింపులు జరిగేలా బాధ్యత తీసుకోవడంలాంటి అనేక కార్యక్రమాలను రైతు సమన్వయ సమితులకు అప్పగించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చింది.

### పంటల ఎంపికలో పారదర్శకత

అన్నింటికీ మించి ఇష్టారాజ్యపు పంటల ఎంపిక, సాంప్రదాయ పంటల సాగుతో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడానికి గల కారణాలను గుర్తించి పంట కాలనీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చే కీలక బాధ్యత కూడా రైతు సమన్వయ సమితులపైనే ఉంది. గ్రామస్థాయిలో 15 మంది, మండల స్థాయిలో 24 మంది, జిల్లా స్థాయిలో 24 మంది, రాష్ట్ర స్థాయిలో 42 మంది సభ్యులతో కూడిన రైతు సమన్వయ సమితుల వ్యవస్థ ప్రస్తుతం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు చేపట్టేందుకు సంసిద్ధమై ఉన్నప్పటికీ ప్రభుత్వం వారికి ఎలాంటి పనిని అప్పగించలేదు. ఈ తరుణంలో ఇంత పెద్దఎత్తున యంత్రాంగాన్ని ఎందుకు ఏర్పాటు చేశారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

### బాధ్యతలు అప్పగిస్తే మెరుగైన ఫలితాలు : వరప్రసాద్



తమకు బాధ్యతలు అప్పగిస్తే రైతులకు అనేక కోణాల్లో మేలు చేసేందుకు సం సిద్ధమై ఉన్నామని సంగా రెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యు డు కె.వర ప్రసాద్ అన్నా రు. వ్యవ సాయంపై పూర్తి అవగా హన కలిగి ఉన్న సమితి సభ్యులు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు అనుగుణంగా రైతు కుటుం బాలను మలిచేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యం గా పంట కాలనీల ఏర్పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో అవశ్య మని చెప్పారు.

# ప్రతి గింజ కొంటాం

**• ఈ ఏడాది 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం • తొలిసారి రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ • ప్రతి కొనుగోలు కేంద్రానికి ఏఈవో ఇన్‌చార్జ్ • మానిటరింగ్ సెల్, చెక్‌పోస్టుల ఏర్పాటు • రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్**




**కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో:** ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగం, రైతాంగంపై ప్రత్యేక శ్రద్ధకన బరుస్తున్నారని, రైతులు పండించే ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఈ ఏడు 92 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్‌తోపాటు పౌరసరఫరాల శాఖ అధికారులతో కలసి ధాన్యం కొనుగోలుపై సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి అవుతున్న నేపథ్యంలో ధాన్యం విక్రయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌరసరఫరాల శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టిం దన్నారు. ఇందులో భాగంగానే గత ఏడాది రూపొందించిన పాలసీలో పలు మార్పులు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు కీలక బాధ్యతలు అప్పగిం చారని, ప్రతి కొనుగోలు కేంద్రానికి ఏఈవో ఇన్‌చార్జ్‌గా వ్యవహ రిస్తారని తెలిపారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లాసరి హద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తా మన్నారు. పౌర సర ఫరాల శాఖ కమిషనర్ ఛైర్మన్‌గా రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు చేశామని, రైతు సమస్యలు, కనీస మద్దతు ధర తదితర విషయాలలో ఫిర్యా దుల కోసం రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటుతోపాటు టోల్ ఫ్రీ నంబర్ (180042500333) ను కూడ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో చేపట్టిన రైతు సంక్షేమ చర్యలు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటలకరెంటు, రైతుబంధు వంటి పథకాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి అయిందన్నారు. ఈ ఖరీఫ్ కు సంబంధించి 55 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 37లక్షల మెట్రిక్ టన్నులు, కలిపి దాదాపు 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

గత ఏడాది ఖరీఫ్‌లో 40 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా ఈసారి 15 లక్షల మెట్రిక్ టన్నుల అధికంగా వస్తుందనే అంచనాలతో తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతులకు అదుబాటులో 2544 కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్‌లు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్ వంటి కనీస వసతులు కల్పించాలని నిర్ణయించామన్నారు. ధాన్యం రవాణా, పర్యవేక్షణ, కనీస మద్దతు ధర, వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం రాష్ట్ర స్థాయిలో పౌరసరఫరాల శాఖ కమి షనర్ ఛైర్మన్‌గా సమన్వయ కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో వ్యవసాయశాఖ కమిషనర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, పోలీసు శాఖ నుంచి ఒకరు, సీడబ్ల్యూసీ రీజనల్ మేనేజింగ్ డైరెక్టర్, సెర్ప్ సీఈవో, కోపరేషన్ కమిషనర్, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. జిల్లా స్థాయి లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ కమిటీలను ఏర్పాటు చేశామని, ఇందులో జిల్లా ఎస్పీ/ కమిషనర్, జిల్లా లేబర్ ఆఫీసర్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌లను కొత్తగా సభ్యులుగా ఉంటారన్నారు. 55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా 12 కోట్ల గోనె సంచులు అవసరం ఉంటుందని అంచనావేశామని, ప్రాధాన్యత క్రమంలో జిల్లాల వారిగా, కేంద్రాల వారిగా గోనె సంచులను కేటాయించడం జరుగుతుం దన్నారు. పౌరసర ఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్‌తోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జీన్స్‌లో బంగారం పేస్ట్

**శంషాబాద్‌లో 653 గ్రాముల పట్టివేత**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా దొంగ బంగారం పట్టుబడు తున్నా.. అక్రమార్కులు మాత్రం స్మగ్లింగ్ ఆపడం లేదు. ఎలక్ట్రిక్ కూకర్, ఇస్త్రీ పెట్టెల్లో దొంగచాటున బంగారాన్ని రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతు న్నారు. మరికొందరు అయితే వాటిని బంగారంతో తయారు చేసి స్టీల్ పూత వేసి మరీ స్మగ్లింగ్ చేస్తు న్నారు. బంగారం ఎలా తీసుకొచ్చినా పోలీసుల కళ్లు గప్పి బయటికి మాత్రం వెళ్లడం లేదు. కొన్ని రోజుల క్రితం ఓ మహానుభావుడు గుండు కొట్టించుకుని.. అందులో బంగారంపెట్టి ఆపైన విగ్గు పెట్టుకుని స్మగ్లింగ్ చేస్తూ చెన్నైలో పట్టుబడ్డాడు. శంషాబాద్‌లో బుధవారం ఇలాంటి విచిత్రమైన స్మగ్లింగ్ చూసి పోలీసులు నోరెళ్లబెట్టారు. సదరు ప్రబుద్ధుడు 653 గ్రాముల బంగారాన్ని పేస్ట్ చేయించి.. వాటిని ప్యాకెట్లలో నింపి.. ప్రత్యేకంగా కుట్టిన జీన్స్ ప్యాంట్‌లో పెట్టుకుని స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. షార్జా నుంచి హైదరాబాద్‌కు ఇండిగో విమానంలో తీసుకొచ్చిన ఈ బంగారం విలువ రూ.24 లక్షలు ఉంటుందని డీఆర్ఐ అధికారులు చెబుతున్నారు. బంగారం తీసుకొచ్చిన ప్రయాణికుడితో పాటు దాన్ని తీసుకోవడానికి వచ్చిన వ్యక్తినీ అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

# దరఖాస్తుల 'కిక్'

## అప్లికేషన్ల ఆదాయం రూ.858 కోట్లు

**• మద్యం దుకాణాలకు పెరిగిన దరఖాస్తులు • గతం కన్నా 2వేలు ఎక్కువ.. ఆదాయం రెట్టింపు • ముగిసిన గడువు.. గణాంకాలపై నేడు స్పష్టత • చివరి రోజు 25వేలకు పైగా దరఖాస్తులు • సిండికేట్ల ప్రభావంతో తగ్గిన పోటీ**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వం ఊహించినంతగా కాకపోయినా గతంతో పోలిస్తే మద్యం దుకాణాల దరఖాస్తులు గణనీయంగా పెరిగాయి. ఆదాయమైతే దాదాపు రెట్టింపైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినట్టయితే ప్రభుత్వం కోరు కున్నట్లు దరఖాస్తులు, ఆదాయం ఇంకా పెరిగేవి. కానీ ఆఫ్‌లైన్‌లో అప్లికేషన్లు తీసుకోవడం, సిండికేట్ల జోక్యం తో పలువురు వెనక్కు తగ్గడంతో ప్రభుత్వ ఆశలకు గండి పడినట్టయింది. మొత్తం 2216 మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. బుధవారం సాయంత్రంతో ఆ గడువు ముగిసింది.

### అప్పుడు... ఇప్పుడు

2017-19 పాలసీ ప్రకారం అప్పుడు మద్యం దుకాణాల నిర్వహణ కోసం వచ్చిన దరఖాస్తులకు కొంత ఎక్కువగానే ఈసారి దరఖాస్తులు దాఖలయ్యాయి. చివరిరోజు రాత్రి పొద్దుపోయే సమయానికి 44,000 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. తద్వారా రూ. 858.10 కోట్ల దరఖాస్తు రాబడి ఖజానాకు చేరింది. అయితే రాత్రి వరకూ ఇంకా దరఖాసుదారులు క్యూ లైన్లల్లో పలు జిల్లాల్లో వేచి ఉండటంతో పూర్తి సమాచారంపై గురువారం స్పష్టత వస్తుంది. ఆ తర్వాత దరఖాస్తుల పరిశీలన సీఐల నేతృత్వంలో కొనసాగించనున్నారు. కాగా 2017-19 పాలసీలో భాగంగా 44,000దరఖాస్తులు రాగా, రూ. 411 కోట్ల రాబడి సమకూరింది. అప్పుడు దరఖాస్తు రుసుము రూ. లక్షగా ఉండేది. అయితే ఈసారి అది రెట్టింపు చేస్తూ రూ. 2 లక్షలుగా నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అదనంగా ఒక గంట సమయం ఎక్కువగా అనుమతించినా, ఈఎండీ మినహాయిం పునిచ్చినా, లైసెన్సు రుసుముల చెల్లింపులకు 6నుంచి 8 వాయిదాలకు అవకాశమిచ్చినా పెద్దగా వ్యాపారులు ఉత్సాహం చూపలేదని తెలుస్తోంది.

### కొన్ని దుకాణాలకు దరఖాస్తులు నిల్

అయితే గతేడాది దాదాపు 76 దుకాణాలు మిగిలిపోగా ఈ ఏడాది కూడా కొన్ని దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలిసింది. అయితే పూర్తి వివరాలు గురువారం సాయంత్రానికి తెలిసే అవకాశా లున్నాయి. ఏపీ వ్యాపారులు భారీగా తెలంగాణవైపు పరుగులు తీస్తారని ఆశించిన అంచనాలు పటాపంచ లయ్యాయి. సిండికేట్లు కొత్త వారికి దరఖాస్తులు సమర్పించే అవకాశం ఇవ్వకుండా చేశాయని, ఎక్సైజ్ అధికారులు కూడా పాత మద్యం వ్యాపారులకే అనుకూలంగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తులైతే కొత్తవారు ఎక్కువగా దరఖాస్తులు సమర్పించేవారని, ఆదాయం కూడా పెరిగేదని కొందరు అధికారులు అంటున్నారు. మాఫియా బెదిరింపులు, అధికారుల పక్షపాతం, ఆఫ్‌లైన్‌లో కొరవడిన అధికారుల సహకారం కారణంగా దరఖాస్తులు తగ్గినట్లు అనుమానిస్తున్నారు. అయితే సిండికేట్లు ఎక్కడికక్కడ తమకు పట్టున్న ప్రాంతాల్లో కొత్త వారిని దరఖాస్తులు వేయకుండా విజయవంతమయ్యారని, అధికారులు అందుకు సహకరించారని ఆరోపణలు వస్తున్నాయి.

మొత్తం2,216 దుకాణాలకు 44,000 దర ఖాస్తులు రాగా వీటిలో ప్రధానంగా కరీంనగర్ 87 షాపులకు 1346, సూర్యాపేట 75 షాపులకు 2318, భద్రాద్రి (కొత్తగూడెం) 76 షాపులకు 2743, ఖమ్మం 89 షాపులకు 4281, నల్గొండ 134 షాపులకు 3026, మేడ్చేల్(మల్కాజ్‌గిరి)213 షాపులకు 1676, రంగారెడ్డి 241షాపులకు 6032, హైదరాబాద్ 173 షాపులకు 658, సికింద్రాబాద్ 94 షాపులకు 661 దరఖాస్తులు దాఖలయ్యాయి.

## స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం క్రీడా హబ్‌గా రూపుదిద్దుకుంటోందని క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. క్రీడలపై లాల్‌బహదూర్ స్టేడియంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో క్రీడలకు ప్రాధాన్యత పెరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 2014 తర్వాత 45 స్టేడియంల నిర్మాణం పూర్తి చేశామని అన్నారు. క్రీడాశాఖకు చెందిన భూములు, ఆస్తులను డిజిటలైజేషన్ చేసి వాటిని సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. క్రీడాశాఖకు చెందిన స్థలాల్లో ప్రైవేట్ వ్యక్తులు తీసుకున్న లీజులపై మంత్రి సమీక్ష జరిపారు. లీజుకు తీసుకుని ప్రభుత్వానికి అద్దె చెల్లించకుండా కోర్టులకు వెళ్లిన వారి వివరాలు ఇవ్వాలన్నారు. మార్కెట్లో ఉన్న ధరల ప్రకారమే అద్దెలు వసూలు చేయాలని ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో క్రీడా స్టేడియాలలో మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. అంతర్జాతీయ క్రీడా వసతులను ఉపయోగించుకని క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను కోరారు. ఖైలో ఇండియా పథకంలో నూతన క్రీడా పాఠశాల కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను కోరారు.

# అండగా సీడీఎఫ్...దండిగా నిధులు

(మొదటిపేజీ తరువాయి)

కాగా, తొలుత రూ. 120కోట్లను చెల్లింపులు చేసింది. 2018-19లో రూ. 362కోట్లు కేటాయించగా కొంద రు ఖర్చు చేయకపోవడంతో రూ. 288కోట్లకు సవరించారు. 2017-18లో రూ. 280 కోట్లను ఖర్చు చేశారు. ఓటాన్ అకౌంట్ కారణంగా పనులను ప్రతిపాదించకుండా ఉండిపోయిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తాజాగా నిధుల కేటాయింపుతో వేగం పెంచనున్నారు.

అరకొర నిధులతో అభివృద్ధి పనులకు అవస్థలు ఎదుర్కొంటున్న తెలంగాణ పల్లెలకు మహర్దశ పట్టించేలా 2014-15కు ముందు నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 1కోటిగా ఉండగా, టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఈ మొత్తాన్ని రూ. 1.5 కోట్లకు పెంచింది. 2016-17లో విపక్షాల అభ్యర్ధన మేరకు సీఎం కేసీఆర్ వీటిని రెట్టింపు చేశారు. దీంతో అన్ని నియోజకవర్గాలు అప్రతిహతంగా అభివృద్ధికి నోచుకునేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటికే 104 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను ప్రజలకు అందుబాటు లో ఉంచేలా నిర్మిస్తున్న 104 ఎమ్మెల్యేల వసతి, కార్యా లయాల భవనాలు పూర్తవనున్నాయి. ఇదే క్రమంలో నియోజకవర్గాలు, కొత్త జిల్లాలు అన్నీ సమగ్రాభివృద్ధి దిశగా ముందుకెళుతున్నాయి. ఇందు కు అవసరమైన సహకారం అందిస్తున్న ప్రభుత్వం నిధుల కొరత లేకుండా చూస్తూనే అవసరమైన భూ సేకరణ చేస్తూ ఇబ్బందులు తొలగిస్తోంది. దీంతో వచ్చే రెండేళ్లలో తెలంగాణ పల్లెలన్నీ సమగ్రాభివృద్ధితో దూసుకెళ్లేలా ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులు వేస్తోంది.

గతేడాది వరకు ఒక్కో ఎమ్మెల్యేకు నియోజకవర్గ అభివృద్ధి నిధిగా రూ. 1 కోటిని ప్రభుత్వాలు కేటాయించేవి. వీటిని ఖర్చు చేసే విషయంలోనూ సవాలక్ష ఆంక్షలు, నిబంధనలు ఉండేవి. అయితే విపక్షాల విజ్ఞప్తి మేరకు నిబంధనలను సరళం చేయడంతోపాటు, ఇంచార్జి మంత్రి కోటాను ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. దీంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు తమ నియోజకవర్గాల్లో తమ నిధులను ఖర్చు చేసుకునే స్వేచ్ఛ తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో సాకారం చేశారు కేసీఆర్. సీఎం ఉదారతతో ఇచ్చిన నిధులతో పల్లెలు సమగ్రాభివృద్ధితోపాటు ప్రాధాన్య తల మేరకు కనీస సౌకర్యాలు, అత్యవసర పనులకు వీలు కలుగుతోంది. గ్రామీణులకు అవసరమైన సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, హైమాస్ట్ లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ వంటి పనులతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజల కోరిక మేరకు ఇచ్చిన హామీల అమలుకు ఈ నిధులు ఉపయోగపడుతున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని రీతిలో ఏక మొత్తంలో నిధులను ఇవ్వడంతోపాటు నామినేషన్ పద్ధతిలో పనులను చేసేలా సర్కార్ మినహాయింపులను వర్తింపజేసింది.

## కాంగ్రెస్ వల్లే పసుపురైతుకు అన్యాయం



**నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో:** స్పైసెస్ బోర్డు 1987లో ఏర్పడ్డప్పుడు పసుపును అందులోచేర్చడం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చారిత్రాత్మక తప్పిదమని, పసుపునకు మద్దతు ధర ఇవ్వాల్సిందేనని, పసుపు రైతులు సమస్యలను తీర్చడానికి వేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన తొమ్మిది రాష్ట్రాల స్పైస్ బోర్డు, హార్టికల్చర్, కామర్స్ డిపార్ట్‌మెంట్, ఉన్నతాధికారులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులు, సైంటిస్టులు పాల్గొన్న సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ఏకగ్రీవ తీర్మానం చేయించడంలో కీలక పాత్ర పోషించారు. పసుపును కూరల్లో వేసుకునేది రుచి కోసం కాదు బ్యాక్టిరియాలను చంపడం కోసం అన్న ఇంగిత జ్ఞానం కూడా అప్పటి కాంగ్రెస్ సర్కార్‌కు లేదన్నారు. 1981లో కొబ్బరి బోర్డును ఏర్పాటు చేసినప్పుడు మరి కొబ్బరిని ఎందుకు సుగంధ ద్రవ్యాల బోర్డులో కలపలేదని, కొబ్బరిని కూడా కూరల్లో వేస్తారు కదా అని ప్రశ్నించారు. విత్తన సరఫరా సరిగా లేకపోవడం, రైతులకు అవగాహన కల్పించకపోవడం మార్కెటింగ్‌లో ఎలాంటి సహాయం, మద్దతు లభించక పసుపు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని ఈ సమావేశం అభిప్రాయం పడింది.



## దేశీయ డయాగ్నోస్టిక్ కిట్లు రెడీ

**న్యూఢిల్లీ:** జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తించే ప్రాణాంతకమైన జపనీస్ ఎన్సాఫాలిటీస్, బ్లూటంగ్ వైరస్‌లను నిరోధించే మేడ్ ఇన్ ఇండియా డయాగ్రోస్టిక్ కిట్స్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. వ్యవసాయ మరియు రైతు సంక్షేమ, మత్స్య, జంతు పరిరక్షణ మరియు డెయిరీ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా మంగళవారం ఈ కిట్లను విడుదల చేశాయి.బ్లూటంట్ సాండ్‌విచ్ ఎలీసా, జపనీస్ ఎన్సాఫాలిటీస్ 1జీఎం ఎలీసా కిట్లను ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్), ఇండియన్ వెటర్న రీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐవీఆర్ఐ) సంయుక్తంగా రూపొందించాయి. స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఈ కిట్ల తయారీతో విదేశాల నుంచి కొనుగోలు చేసే అవకాశం లేదు. అంతేకాకుండా 10 రెట్ల తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్(డీఏఆర్ఈ), ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ టీ. మహాపాత్ర వివరాలు వెల్లడించారు.




## 20 గంటల నాన్‌స్టాప్ ఫ్లైట్

**న్యూయార్క్:** అమెరికా నుంచి ఆస్ట్రేలియా మధ్య ఇప్పటివరకూ ఒక్క నాన్ స్టాప్ విమానం కూడా ప్రయాణించలేదు. అయితే తొలిసారిగా ఈ శుక్రవారమే న్యూయార్క్ నుంచి సిడ్నీకి 20 గంటల నాన్‌స్టాప్ విమానాన్ని నడిపేందుకు క్వాంటాస్ ఎయిర్‌వేస్ లిమిటెడ్ సిద్ధమైంది. భూమిలో సగం దూరం ఉండే ఈ దూరాన్ని నాన్‌స్టాప్‌గా విమానాన్ని నడిపిన సంస్థగా క్వాంటాస్ ఎయిర్‌వేస్ గుర్తింపు పొందనుంది. మధ్యలో విరామం లేకుండా ఇంతవరకూ ఏ విమానయాన సంస్థ కూడా ఈ రికార్డ్‌ను సాధించలేదు. అయితే ఈ విధంగా ఏకంగా 20 గంటలపాటు ఎత్తులో ప్రయాణమంటే ప్రయాణికులకు అత్యంత ప్రతికూలమైన పరిస్థితులు తప్పవని చెప్పాలి. ప్రయాణికుల తీవ్ర జెట్ లాగ్(తీవ్రమైన అలసటతో నిద్రమత్తు)తో బాధపడే అవకాశం ఉంటుంది. అయితే తొలిసారి గా సుదీర్ఘంగా ప్రయాణం చేయనున్న ఈ విమానంలోని ప్రయాణికులు, సిబ్బందిని వైద్యులు, పరిశోధకుల బృందం పరిశీలించనుంది.



## గురుడు గుర్రమెక్కాడు..!

**సియోల్:** ఉత్తర కొరియాలోని అత్యంత ప్రమాదకర పర్వతమైన 'మౌంట్ పయేక్టు' ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వంశానికి ఆధ్యాత్మికంగా ఎంతో ముఖ్యమైంది. దీనికితోడు అది ఎంతో ప్రమాదకరమైన పర్వతం కూడా. ఏదైనా కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో కిమ్ ఇలాంటి సాహస యాత్రలు చేస్తుంటారని ఆ దేశ కేసీఎన్ఏ మీడియా సంస్థ వెల్లడించింది. కిమ్ జోంగ్ మంచుతో కప్పబడి, ఎంతో ప్రమాదరకమైన ఈ పర్వతంపై తెల్లని గుర్రంపై స్వారీ చేశారు. దీన్ని బట్టి ఆయన ఏదో సంచలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని స్థానిక వార్త సంస్థలు చెబుతున్నాయి. ఎంతో ప్రమాదకరమైన పర్వతం అయినప్పటికీ కిమ్ ఏ మాత్రం భయపడకుండా తన షికారు పూర్తి చేశారని, కొరియా చరిత్రలో ఇదో అద్భుతమైన ఘట్టమని కేసీఎన్ఏ మీడియా సంస్థ వెల్లడించింది. 2017లో అతిపెద్ద ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షించడానికి ముందు కిమ్ పయేక్టు పర్వతాన్ని కిమ్ సందర్శించారని ఈ సందర్భంగా గుర్తు చేసింది.



## అంగారకుడిపై పంటల సాగు

**న్యూఢిల్లీ:** ప్రయోగాలు ఫలించి.. అన్నీ అనుకూలిస్తే అంగారకుడిపై మానవుడి మజిలీ స్వప్నం త్వరలోనే నెరవేరుతుంది. అంగారక గ్రహాన్ని వలసరాజ్యంగా మార్చుకుంటే, అక్కడ నివసించేవారికి ఆహారం కూడా అక్కడే తయారు చేసుకోవచ్చని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. నేరుగా అక్కడే సేద్యం చేసుకుని పంటలు పండించవచ్చని, ఈ మేరకు తమ అధ్యయనాల్లో తేలిందని డచ్ వర్సిటీ (వాంగెనింగెన్) శాస్త్రవేత్తల అధ్యయనం తెలిపింది. భూమ్మీద పండించినట్లే చంద్రుడు, అంగారకుడి మట్టిపై పది వేర్వేరు రకాల పంటలు పండించే ప్రయత్నం చేశారు. అంగారక గ్రహం పైభాగంలో అకర్బన పదార్థం తొమ్మిది రకాల పంటలకు అనుకూలమని పరిశోధకులు కనుగొన్నారు. క్వినోవా, ముల్లంగి, టమోటా మొక్కల నుండి తినదగిన ఉత్పత్తులను వారు పండించగలిగారు. బచ్చలికూర మాత్రం సాధ్యం కాలేదని పరిశోధకులలో ఒకరైన వైగర్ వామెలింక్ అన్నారు. ఓపెన్ అగ్రికల్చర్ జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురించబడింది.

## కాంగ్రెస్‌కు కుటుంబ భక్తే ముద్దు

- 'మహా' ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

**అకోలా:** ప్రధాని మోడీ కాంగ్రెస్ పార్టీపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో జాతీయవాదం అంటే.. కుటుంబ భక్తే అని చురకలంటిస్తూనే.. ప్రధాన ప్రతిపక్షం కొనఊపిరితో అవస్థలు పడుతోందని ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీకి.. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీకి ఎంతో తేడా ఉందన్న ప్రధాని.. మహారాష్ట్రలో ముగ్గురు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అకోలా, జాల్నా జిల్లాల ఎన్నికల ర్యాలీలో ప్రధాని ప్రసంగిస్తూ.. కాంగ్రెస్- ఎన్సీపీ కూటమి ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలిందని ఆరోపించారు. 70 ఏళ్లుగా జమ్ము కాశ్మీర్ ప్రజలు ఉగ్రవాద పీడితులై నరకం అనుభవించినా పట్టించుకోని కాంగ్రెస్‌కు .. కాశ్మీర్‌లో శాంతి స్థాపన కోసం ఆర్టికల్ 370 ని రద్దు చేస్తే వ్యతిరేకించేంత దమ్ము ఎలా వచ్చిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చురకలంటించారు.ఎన్సీపీ నాయకుడు ప్రఫుల్ పటేల్ పేరు ప్రస్తావించకుండా.. కొంతమంది వ్యాపారాల్లో వచ్చిన డబ్బును దేశ వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించారని మండిపడ్డారు.

### వారిద్దరినీ కాంగ్రెస్ అవమానించింది..

జాతి నిర్మాణంలో హిందుత్వ ఐడియాలజిస్ట్ వినాయక్ దామోదర్ సావార్కర్ పాటించిన విలువలను ఆదర్శంగా తీసుకుని జాతీయవాదాన్ని తెరకెక్కించామని గుర్తు చేశారు. జాతి నిర్మాణానికి అహర్నిశలు కృషి చేసిన వీడీ సావార్కర్‌కు కూడా గత ప్రభుత్వాలు భారత రత్న ఇవ్వకుండా అవమానించాయని మండిపడ్డారు. సావర్కర్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నను ఇవ్వాలని మహారాష్ట్ర బీజేపీ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మోడీ పై విధంగా స్పందించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను సైతం కాంగ్రెస్ అవమానించిందని మండిపడ్డారు.

## చిద్దూని అరెస్ట్ చేసిన ఈడీ

**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. ఆయనను కస్టడీలోకి తీసుకునేందుకు ఢిల్లీ ప్రత్యేకకోర్టు అనుమతించిన మరుసటి రోజు చిదంబరాన్ని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను అరెస్టు చేసేందుకు ఈడీ అధికారులు బుధవారం తీహార్ జైలుకు చేరుకున్నారు. చిదంబరం అరెస్టు కోరుతూ మంగళవారం ఈడీ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రత్యేక సీబీఐ న్యాయమూర్తి అజయ్‌కుమార్ కుహర్‌తో మాట్లాడుతూ చిదంబరాన్ని కస్టడీలో విచారించడం అవసరమని సుప్రీంకోర్టు కూడా వ్యాఖ్యానించిందని తెలిపారు. తుషార్ మెహతా వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి కుహర్ ఈడీ తీహర్ జైలుకు వెళ్లి ఆయనను విచారించి అవసరమైతే అరెస్టు చేయడానికి అనుమతించిన విషయం తెలిసిందే.

## కర్బన ఉద్గారాలు తగ్గించాలి

**న్యూఢిల్లీ:** కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రపంచ దేశాలు తక్షణమే నడుంబిగించాలని ఇంటర్‌నేషనల్ మోనిటరీ ఫండ్(ఐఎంఎఫ్) తీవ్రంగా హెచ్చరించింది. కార్బన్ ఉద్గారాల పన్నుల విధింపు అమలు, అంతర్జాతీయ సహకారంతో గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చునని గురువారం సూచించింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సహజసిద్ధమైన ప్రపంచం మనుగడపై గ్లోబల్ వార్మింగ్ తీవ్రమైన ప్రభావం చూపుతుండడంతో భారీ విపత్తులు, నివారణసాధ్యంకాని ఫలితాలను అనుభవించాల్సి ఉంటుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అర్ధ సంవత్సర నివేదికను విడుదల చేసింది. వచ్చేవారం ప్రపంచ దేశాల ఆర్థిక మంత్రులు మరియు విధాన రూపకర్తలతో ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్‌ల సమావేశం జరగనున్న సందర్భంగా ఈ నివేదికను విడుదల చేసింది. కార్బన్ పన్నును ప్రవేశపెట్టడంలో ఆర్థిక మంత్రులు కీలకమైన పాత్ర పోషిస్తారని నివేదిక పేర్కొంది. విస్తృతమైన వ్యూహంలో పన్ను కుదింపు, వ్యయ విధానాలు కీలకపాత్ర పోషిస్తాయని, అవసరమైన సాంకేతికతలో పెట్టుబడులు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని నివేదిక సూచించింది.

## కేంద్రంపై సుప్రీం గుస్సా

**శ్రీనగర్:** ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూ కాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై సుప్రీం కోర్టు బుధవారం కేంద్ర ప్రభుత్వం, జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభింపజేయడం, కీలక నేతలను గృహం నిర్బంధం చేయడంపై మండిపడింది. పౌరహక్కులపై ఆంక్షలు, నిర్బంధాలతో పాటు మరికొన్ని అంశాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సమాధానం ఎందుకు ఇవ్వలేదంటూ సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది.కాశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్ అనురాధ భాసిన్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. ప్రస్తుతం పరిస్థితిలో మార్పు వచ్చిందని, తాజా అఫిడవిట్‌ను దాఖలు చేస్తామని వివరించారు.

### ఉగ్రవాదుల చేతిలో కూలీ హతం

ఉగ్రవాదుల చేతిలో ఓ వలస కూలీ హత్యకు గురయ్యాడు. కాక్‌పురాలోని ఓ గ్రామంలోని ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. అతన్ని కొందరు ఉగ్రవాదులు దగ్గరకు పిలిపించుకుని మరీ హత్య చేసినట్టు సమచారం. మరోవైపు జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా దళాలు బుధవారం ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాయి. వీరు కొన్ని రోజుల క్రితమే మిలిటెంట్ గ్రూపులో చేరినట్టు అధికారులు చెప్పారు. ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు దళాలు ఆపరేషన్ చేపట్టాయి.

## 18 శాతం పెరిగిన పశు సంపద

**న్యూఢిల్లీ:** దేశంలో పశుసంపద 18 శాతం పెరిగింది. 2012 నుంచి 2017 మధ్యకాలంలో ఈ మేరకు గణనీయమైన ఈ వృద్ధి నమోదైంది. అంటే 14.5 కోట్ల పశువులు పెరిగాయి. 20వ పశుగణన నివేదిక ఈ మేరకు వివరాలను వెల్లడించింది. రిపోర్ట్ పూర్తి వివరాలు వచ్చేవారం విడుదలకానున్నాయని జంతు పరిరక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు వెల్లడించా యి. 2007-2012 చివరి నివేదికతో 2017 నివేదికను పోల్చితే 4.6 శాతం వృద్ధితో దేశంలో మొత్తం 53.57 కోట్ల పశువులున్నట్టు లెక్కతేలింది. ఈసారి గణాంకాల్లో నూతన టెక్నాలజీని ఉపయోగించామని అధికారవర్గాలు వెల్లడించాయి.

# సుప్రీంలో.. హైడ్రామా..!



జమాత్ ఉలామా-ఏ- హింద్ అధ్యక్షుడు మౌలానా సుహైబ్ ఖాస్మీతో నిర్మోహి అఖాడా నేత మహంత్ రామ్‌దాస్ అభివాదం

- 'అయోధ్య రీవిజిటెడ్' పుస్తకం చించివేత
- గొగోయ్ ముందే చించేసిన సున్నీ వక్ఫ్ బోర్డు లాయర్
- పుస్తకాన్ని సమర్పించిన హిందూ మహాసభ న్యాయవాది
- ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం
- ఉండాలా... పోవాలా.. అని మండిపాటు
- అయోధ్య కేసులో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్
- నవంబర్ 17లోగా తీర్పు

**న్యూఢిల్లీ:** వివాదాస్పద అయోధ్య కేసులో వాదనలు బుధవారంతో ముగిశాయి. సుప్రీం కోర్టులో 40 రోజుల పాటు వాదనలు కొనసాగాయి. రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో తీర్పును సుప్రీం రిజర్వ్‌లో ఉంచింది. కేసుకు సంబంధించిన రాతపూర్వక దస్త్రాలను మరో మూడు రోజుల్లో సమర్పించాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది. బుధవారం సాయంత్రం 5 గంటల డెడ్‌లైన్ ఉన్నా.. ఓ గంట ముందే సుప్రీం ఈ కేసులో వాదనలు ముగించింది. వివాదాస్పద స్థలం గురించి అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయి. వక్ఫ్ బోర్డు, హిందూ మహాసభ, నిర్మోహి అఖాడాలు తమ అభిప్రాయాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ముందు ఉంచాయి. జస్టిస్ ఎస్ఏ బోబ్డే, డీవై చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్ఏ నజీర్ బెంచ్ 40 రోజుల పాటు వాదనలు విన్నది. సుదీర్ఘ విచారణ అక్టోబర్ 14న కీలకమైన తుది దశకు చేరుకుంది. వారం రోజుల దసరా సెలవుల తరువాత 38వ రోజు సుప్రీం తిరిగి విచారణ ప్రారంభించి 40వ రోజు అయిన బుధవారంతో పూర్తి చేసుకుంది. ఆగస్టు 6 నుంచి రోజువారీ విచారణను సుప్రీం కోర్టు రికార్డు చేస్తూ వచ్చింది. నవంబర్ 17న జస్టిస్ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేయనున్నారు. దీనికంటే ముందే తీర్పు వెల్లడించడానికి సుప్రీం కోర్టు సిద్ధం అవుతోంది. ఈ నేపథ్యంలో అయోధ్యలో 144 సెక్షన్ విధించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వికాస్ సింగ్

### గొగోయ్ చెబితేను చించేశా: రాజీవ్

మధ్యాహ్నం వరకు కొనసాగిన వాదనలు మళ్లీ భోజనం విరామ అనంతరం ప్రారంభం అయ్యాయి. ఈ మధ్యలో రాజీవ్ ధావన్ మీడియాతో మాట్లాడారు. సీజే రంజన్ గొగోయ్ చెబితేనే పుస్తకం చించేశానంటూ తప్పంతా ఆయన పై నెట్టేశాడు. ''అయోధ్య రీవిజిటెడ్ పుస్తకాన్ని సమర్పిస్తానని వికాస్ సింగ్ ధర్మాసనాన్ని కోరారు. నేను అంగీకరించలేదు. రంజన్ గొగోయ్ కల్పించుకున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కునాల్ కిశోర్ రాసిన పుస్తకంలో వివాదాస్పద అంశాలు ఉన్నాయని వివరించాను. అలా ఉంటే మీరు చిప్పేయండి అని రంజన్ గొగోయ్ చెప్పారు. అందుకే ఆ పుస్తకాన్ని చింపేశాను'' అని రాజీవ్ ధావన్ చెప్పడం గమనార్హం.

### బాబర్ అయోధ్యకు రాలేదు : సుశీల్

నేను నిర్మోహి అఖాడా తరఫున కేసును వాదిస్తున్నాను. బాబర్ అయోధ్యకు వచ్చారు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. వారు చూపించిన పత్రాలు ఓ రెవెన్యూ గ్రాంట్‌కు సంబంధించినవి. అవి బాబ్రీ మసీదుకు సంబంధించినవి కావు. మనల్ని కలిపి ఉంచేది విశ్వాసం, నమ్మకాలే. బాబర్ ఏం చేశారనేదానితో సంబంధం లేదు. అక్కడున్నది మందిరమే. దాన్ని బాబర్ కూలగొట్టలేదు. గతంలోనూ, ఇప్పుడు కూడా అది మందిరమే. మందిరాన్ని కూలగొట్టి మసీదును నిర్మించారనే వాదన అనవసరంగా సృష్టించారు. దీన్ని పొందాలంటే ముస్లింలు కూడా అసలు వారికి ఆ ప్రదేశం ఎలా వచ్చిందో నిరూపించుకోవాలి. మందిరాన్ని నిర్మోహి అఖాడాకు చెందిన మహంత్ నిర్వహించారు.

### హిందువులే పూజలు చేశారు: వైద్యనాథ్

నేను హిందువుల తరఫున సీనియర్ న్యాయవాదిగా విచారణలో పాల్గొన్నాను. వివాదాస్పద ప్రాంతంలో 1857 నుంచి 1934 వరకు ప్రతీ శుక్రవారం ప్రార్థనలు నిర్వహించేవారు. అయితే ఆ తరువాత వారు ప్రార్థనలు చేశారు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. అయితే ఇక్కడ హిందువులు మాత్రం తమ పూజలు కొనసాగిస్తున్నారు. వివాదాస్పద ప్రాంతంపై ముస్లింలకు హక్కులేదు. రామ జన్మ భూమికి పరిగణించే స్థలంలో హిందువులు పూజించేందుకు స్థలం లేదు.

### సుదీర్ఘ విచారణలో రెండో కేసు

అయోధ్య కేసును రాజ్యాంగ ధర్మాసనం 40 రోజుల పాటు విచారించింది. దీంతో సుప్రీం చరిత్రలో అతిసుదీర్ఘ వాదనలు జరిగిన రెండో కేసుగా రికార్డులో నిలిచింది. 1972లో కేశవానంద భారతి కేసులో సుప్రీం ధర్మాసనం అత్యధికంగా 68 రోజుల పాటు విచారించింది. 13 మందితో కూడిన ధర్మాసనం కేసు విచారించింది.

ఇక ఆధార్ కేసు అత్యున్నత న్యాయ స్థానం 38 రోజుల పాటు విచారించింది. అయోధ్య కేసులో అలహాబాద్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మొత్తం 14 కేసులు దాఖలయ్యాయి. అయోధ్యలో వివాదాస్పదంగా ఉన్న 2.77 ఎకరాల భూమిని మూడు భాగాలుగా పంచాలని గతంలో తీర్పునిచ్చారు. సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్ లల్లాకు ఇవ్వాలని సూచించారు. నవంబర్ 17వ తేదీలోపు విడుదలయ్యే ఈ తీర్పులో సీనియర్ న్యాయవాదులు కే.పరశరన్, సీఎస్ వైద్యనాథ్‌లు రామ్‌లల్లా తరఫున వాదించారు. న్యాయవాది ఎస్‌కే జైన్ నిర్మోహి అఖాడా తరఫున వాదించగా.. రాజీవ్ ధావన్, మీనాక్షి అరోరా, శేఖర్ నపడేలు సున్నీ వక్ఫ్ బోర్డు తరఫున వాదించారు.

### ఆగస్టు 6న విచారణ మొదలు

ఆగస్టు 6 నుంచి రోజువారీగా అయో ధ్య కేసులో వాదనలు సాగాయి. వాస్తవా నికి అయోధ్య కేసును పరిష్కరించేం దుకు ఓ మధ్యవర్తి ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. ఎఫ్ఎం ఖలీఫుల్లా, శ్రీశ్రీ రవిశంకర్, సీనియర్ న్యాయవాది శ్రీరాం పంచూలు మధ్యవర్తు లుగా ఉన్నారు. కానీ వారి మధ్యవర్తిత్వం విఫలమైం ది. వివాదాస్పదంగా ఉన్న 2.77 ఎకరాల స్థలం అంతా రాముడి జన్మస్థలమే అని హిందూ పార్టీలు వాదించాయి. కానీ ముస్లిం బోర్డు దీన్ని వ్యతిరేకించింది.



### వాదనలు.. ప్రతి వాదనలు

రామ జన్మ భూమి-బాబ్రీ మసీదు కేసు చివరి విచారణ రోజైన బుధవారం సుప్రీం కోర్టులో ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా కొనసాగింది. సున్నీ వక్ఫ్ బోర్డు తరపు న్యాయవాది రాజీవ్ ధావన్ సుప్రీం కోర్టులో హల్‌చల్ చేశారు. సీజే రంజన్ గొగొయ్ ధర్మాసనానికి ఆగ్రహం తెప్పించారు.

**వికాస్ సింగ్:** 'అయోధ్య రీవిజిటెడ్' పేరుతో ఐపీఎస్ మాజీ అధికారి కిశోర్ కునాల్ ఓ పుస్తకం రాశారు. ఇందులో అయోధ్యలో రాముడికి సంబంధించిన కీలక విషయాలు ఉన్నాయి. సాక్ష్యం కింద దాన్ని ధర్మాసనం ముందు ఉంచేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

**రంజన్ గొగొయ్:** తప్పకుండా ప్రవేశపెట్టండి. ఎలాంటి అభ్యంతరం లేదు.

**రాజీవ్ ధావన్:** సుప్రీం కోర్టుకు సీరియస్‌గా చెబుతున్నాను.. కోర్టు ఇలాంటి పుస్తకంపై ఆధారపడకూడదు. 1986లో ముద్రించిన ఈ పుస్తకాన్ని రికార్డుల్లోకి తీసుకోవద్దు.

**రంజన్ గొగొయ్:** మీరు అనుకున్నదేంటో చేయండి.

(వికాస్ సింగ్ తన వాదనలు వినిపిస్తున్నారు)

**రాజీవ్ ధావన్:** ఆ పుస్తకాన్ని ధర్మాసనం ముందు ఉంచితే చింపేస్తాను. (అంటూనే.. పుస్తకంలోని కొన్ని పేజీలు, మ్యాపును సీజే గొగొయ్ ముందు చింపేశాడు)

(దీంతో రంజన్ గొగొయ్‌తో పాటు న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ..)

**రంజన్ గొగొయ్ :** ఈ పద్ధతి సరికాదు. ఇలాగైతే విచారణను మధ్యలోనే నిలిపివేస్తాం. వాదనలు ఇలాగే కొనసాగిస్తే ఇప్పుడే వెళ్లిపోతాం. సహకరించాల్సింది పోయి గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తారా..?

**ఎస్ఏ నజీర్ (న్యాయమూర్తి) :** పుస్తకం చించిపారేయడం వైరల్ అయ్యింది.

**రాజీవ్ ధావన్:** నేను పుస్తకం చించడం వైరల్ అయ్యింది నిజమే. దీనికి కారణం చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయే. ఆయన చెబితేనే నేను పుస్తకం చించేశాను.

**పీఎన్ మిశ్రా (హిందీ పిటిషనర్ న్యాయవాది) :** ధావన్ పుస్తకం చించడం సరికాదు. మూర్ఖంగా వ్యవహరించారు.

**రాజీవ్ ధావన్:** మిస్టర్ మిశ్రా గారూ.. మీరు చేస్తున్న వ్యాఖ్యలే మూర్ఖంగా ఉన్నాయి. ప్లీజ్ దయచేసి కూర్చోండి. మీకేం తెలీదు. ఇది వ్యక్తిగతమైన విషయం కాదు.

**పీఎన్ మిశ్రా:** నేను పీహెచ్‌డీ చేశాను. భూమిపై నేను కూడా పుస్తకం రాశాను. నేను మూర్ఖున్ని కాదు.

**రాజీవ్ ధావన్ :** అయితే మీకు నేను సెల్యూట్ చేస్తున్నాను. మీరు మేధావులు. అయినా మీకు చరిత్ర గురించి తెలీదు. ప్లీజ్ కూర్చోండి.

**రంజన్ గొగొయ్ :** పుస్తకంలోని విషయాలపై సదరు న్యాయవాది స్పష్టం చేయని పక్షంలో చించేయాల్సిందిగా రాజీవ్ ధావన్‌కు సూచించాను. కానీ వికాస్ సింగ్ చదవడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే రాజీవ్ ధావన్ దాన్ని తన చేతుల్లోకి తీసుకున్నారు. చింపేయడానికి ప్రయత్నించారు. చివరికి కొన్ని పేజీలు చించేశారు కూడా.

**రాజీవ్ ధావన్ :** దయచేసి విచారణ గడువును పొడగించండి.

**రంజన్ గొగొయ్ :** ఇక చాలు. ఒక్క రోజు కూడా పొడగింపు ఉండదు. బుధవారంతో 40 రోజుల గడువు ముగిసింది. ఒక్క రోజు అయోధ్య కేసు సుప్రీం కోర్టులో వినిపించినా.. అది తీర్పు రోజే. ఏమైనా చెప్పాలనుకుంటే రాత పూర్వకంగా మూడు రోజుల్లో తెలియజేయాలి.



రంజన్ గొగోయ్



రాజీవ్ ధావన్

### డిసెంబర్ 6 నుంచి నిర్మాణం: సాక్షి మహరాజ్

అయోధ్యలో రామ మందిర నిర్మాణం పనులు డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానున్నాయి. 1992, డిసెంబర్ 6న అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేయడం జరిగింది. మసీదు కూల్చివేసిన రోజు నుంచే రాముడి ఆలయం నిర్మాణ పనులు ప్రారంభం కావడం విశేషం. ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగీ ఆదిత్యనాథ్ కృషి వల్లే రామ మందిర నిర్మాణం కల నిజమైంది. రామ మందిర నిర్మాణానికి హిందువులు, ముస్లింలు కలిసి రావాలి. బాబర్ వారి పూర్వీకుడు కాదు. ఓ ఆక్రమణదారుడు. ఈ విషయాన్ని సున్నీ వక్ఫ్ బోర్డు అంగీకరించాలి. మరో బీజేపీ ఎంపీ సుబ్రమణియన్ స్వామి మాట్లాడుతూ.. తన పిటిషన్ తరువాతే అయోధ్య కేసులో సుప్రీం కోర్టు విచారణను వేగవంతం చేసిందని పేర్కొన్నారు. రామ మందిర నిర్మాణం ఎంతో మంది హిందువుల కల అని, దాన్ని సాకారం చేస్తుందని, ఈ దీపావళి కాకుండా మొత్తం ఏడాది పాటు పండుగ చేసుకుంటుందని చెప్పుకొచ్చారు.

## ఆ స్థలం హిందువులదే..!

### 134 ఏళ్ల కిందటే ఫైజాబాద్ హైకోర్టు తీర్పు

అయోధ్యలోని రామజన్మభూమి - బాబ్రీమసీదు వివాదా స్పద భూవివాదం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. సుప్రీంలో 40 రోజుల విచారణ ముగిసింది. వాదోపవాదనలు పూర్తయ్యాయి. రాజ్యాంగ ధర్మాస నం తీర్పును రిజర్వులో ఉంచింది. బహుశా వచ్చేనెల ద్వితీయార్థంలో తీర్పు వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ వివాదం మొదటి రోజుల్లోనే కేసు తేలిపోయిందని, రామజన్మభూమి యాజమాన్య హక్కులు హిందువుల కేనని బ్రిటీషు కాలం నాటి తీర్పు స్పష్టం చేస్తోంది. ఇప్పుడిది మరింత ఆసక్తికరంగా మారింది. 134 ఏళ్ల కిందట అంటే 1880లలో న్యాయస్థానం హిందువులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. ఇది హిందువుల స్థలం. దురదృష్టవశాత్తు ఇక్కడ మసీదు నిర్మించారని న్యాయమూర్తి వ్యాఖ్యానించి నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. 1985 జనవరి 19న నిర్మోహి అఖారా తరపున మహంత్ రఘుబర్ ఫైజాబాద్ కోర్టులో వ్యాజ్యం వేశారు. రామ్‌చాబుత్ర హక్కులను నిర్మోహి అఖారాకు కట్టబెట్టేందుకు న్యాయమూర్తి అనుమతిని నిరాకరించారు. ఈ మేరకు ఫైజాబాద్ జిల్లా కోర్టు జడ్జి ఆదేశాలిచ్చారు. మసీదుకు అత్యంత సమీపంలో చాబుత్ర ఉంది. ఇక్కడ ఆలయం నిర్మించాలన్న రఘుబర్ ఆకాంక్ష మేరకు అనుమతి ఇవ్వడం ప్రజా ప్రయోజన విధానానికి విరుద్ధమంటూ 1885 ఫిబ్రవరి 24న జడ్జి వ్యాఖ్యా నించారు. అయితే నిర్మోహి అప్పీళ్ల ను తోసిపుచ్చిన ఫైజాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఫీ చామైర్, వివాదాస్పద భూమి హిందువులకే చెందుతుం దని 17 మార్చి 1886 నాటి తుదితీర్పులో స్పష్టంచేశారు. ఇది చాలా దురదృష్టక రం. హిందువులు ఆలయం కోసం త్యాగం చేసిన స్థలంలో మసీదు నిర్మించారు. ఈ సంఘటన 356 ఏళ్ల కిందట జరిగింది. ఫిర్యాదు పరిష్కారానికి చాలా ఆలస్యమైంది. అందువ ల్ల దీనిపై యదాతథ స్థితిని కొనసాగించడమే ఉత్తమం అని న్యా యమూర్తి వ్యాఖ్యానించినట్లు చారిత్రక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇంటర్వ్యూ..




భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ మహిళా క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆటలో గెలుపు ఓటములను ఒకేరీతిలో తీసుకోవాలి. అత్యుత్తమ ప్రదర్శన చేసినా ఫలితం దక్కకపోతే కొంచెం బాధగా ఉంటుంది. ఓటమి నుంచే విజయం సాధించవచ్చు అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయనడానికి మేరీకోమ్ ఓ ఉదాహరణ!

# నా ఓటమి.. రిఫరీ తప్పిదమే!

## ఆంధ్రప్రభ-ఇండియా ఎహెడ్ జాతీయ చానెల్ ఇంటర్వ్యూలో మేరీకోమ్



భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ ఇటీవల జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 8వ పతకాన్ని గెలుచుకొని కొత్త చరిత్ర సృష్టించింది. అయితే ఈ మెగా చాంపియన్‌షిప్‌లో ఏడో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగిన మేరీకోమ్ 51 కేజీల సెమీఫైనల్స్‌లో ఊహించని విధంగా ఓటమిపాలై కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నిర్ణయంపై మేరీకోమ్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ రివ్యూకి అప్పీల్ చేసినా లాభం లేకుండా పోయింది. బుధవారం ఆంధ్రప్రభ-ఇండియా ఎహెడ్ జాతీయ వార్తా చానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మేరీకోమ్ మాట్లాడుతూ.. సెమీస్‌లో వచ్చిన ఫలితంపై నిరాశగా ఉందన్నారు. భారీ ఆశలతో తొలిసారి 51 కేజీల కేటగిరిలో బరిలోకి దిగాను. క్వార్టర్స్ వరకు మంచి విజయాలు సాధిస్తూ ముందుకు సాగాను. కానీ సెమీస్‌లో ఊహించని ఫలితం వచ్చింది. ఆ ఫలితాన్ని జీర్ణించుకోవడం ఇంకా కష్టంగానే ఉంది. మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేశాను. మ్యాచ్ ముగిసిన తర్వాత రిఫరీ ప్రత్యర్థిని విజేతగా ప్రకటించాడు. నేను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. అప్పుడే కోచ్‌తో చర్చించి రివ్యూ కోరాం. కానీ కొత్త రూల్స్ ప్రకారం అది సాధ్యంకాదని ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య తెలిపింది. నేను గత కొన్నేళ్లుగా వరుసగా ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్‌ల్లో పాల్గొంటున్నాను. ఇంతకు ముందు 48 కేజీల విభాంలో పాల్గొన్నాను. కానీ ఈసారి ఒలింపిక్స్‌లో ఆ 48 కేజీ విభాగం లేకపోవడంతో తొలిసారి 51 కేజీల విభాగాన్ని ఎంచుకుని ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీకి సిద్ధమయ్యాను. అందుకు తగ్గట్టే మూడు కిలోల బరువు పెంచుకోవడంతో పాటు కఠోర సాధనతో ఈ పోటీలకు రెడీ అయ్యాను. కానీ సెమీస్‌లో వెలువడిన ఫలితం పూర్తిగా నిరాశజనకంగా ఉంది. ఆటలో గెలుపు ఓటములు సాధారణమే కానీ అత్యుత్తమ ప్రదర్శన చేసినా ఫలితం దక్కకుంటే బాధగా ఉంటుంది. ఇది పూర్తిగా రిఫరీల తప్పిదమే అని మేరీకోమ్ పేర్కొన్నారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఎదురులేని బాక్సర్‌గా నిలిచిన మేరీకోమ్ అత్యధికంగా 8 పతకాలు గెలుచుకున్న ఏకైక బాక్సర్‌గా కొత్త ప్రపంచ రికార్డును సాధించింది. అందులో 6 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్య పతకాలు ఉన్నాయి.

# అందుకే కూల్‌గా ఉంటా!



## భావోద్వేగాలను నియంత్రించుకుంటా: ధోనీ

**న్యూఢిల్లీ:** అందరిలాగే తనకూ కూడా భావోద్వేగాలు ఉన్నాయని, కానీ నేను దాన్ని నియంత్రించుకోగలనని టీమిండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ అన్నాడు. బుధవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ మాట్లాడుతూ.. అందరిలాగే నాకు కూడా భావోద్వేగాలు ఉంటాయి. కానీ వాటిని నియంత్రించుకోగల శక్తి నాకు ఇతరులకంటే ఎక్కువగానే ఉంది. మైదానంలో ఎన్నోసార్లు నిరాశకు గురయ్యాను. ఒకొక్కసారి కోపం, అసహనం కూడా వచ్చేవి. కానీ ఆ కఠిన సమయంలో భావోద్వేగాలను నియంత్రించు కుంటూ జట్టు కోసం ఆలోచించేవాడిని. జట్టు విజయమే ముఖ్యమని మ్యాచ్‌పై దృష్టి సారిస్తాను. మైండ్‌ను పూర్తిగా డైవర్ట్ చేసి ఫలితంపై ధ్యాస పెట్టుతాను. ఆ సమయంలో తర్వాత బౌలింగ్ ఎవరికి ఇవ్వాలి.. లేక బ్యాటింగ్‌లో ఎవరిని పంపాలి అని ఆలోచించేవాడిని. ఇలా భావోద్వేగాల గురించి పూర్తిగా మరిచి మ్యాచ్‌లోకి వంద శాతం తిరిగి వచ్చేస్తాను. క్రికెట్‌లో విభిన్న రకాల ఫార్మాట్లు ఉన్నాయి. ఒకటి సుదీర్ఘ ఫార్మాట్ అయితే మరొక్కటి పరిమిత ఓవర్ల ఫార్మాట్. టెస్టుల్లో రెండు ఇన్నింగ్స్‌లు ఉండటంతో ఆలోచించడానికి ఎక్కువ సమయం ఉంటుంది. అదే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సమయం తక్కువగా ఉండటంతో ఏ నిర్ణయమైనా క్షణాల్లో తీసుకోవాలి. ఒకవేళ మనం కూల్‌గా లేకుంటే దాని ప్రభావం మనం తీసుకునే నిర్ణయంపై పడుతుంది. అందుకే మైదానంలో చాలా కూల్‌గా ఉండటానికి ప్రయత్నిస్తాను అని ధోనీ పేర్కొన్నాడు. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ప్రపంచ కప్ తర్వాత నుంచి ధోనీ విరామం లో ఉన్నాడు. వెస్టిండీస్ పర్యటనకు దూరమైన ధోనీ ఇప్పుడు స్వదేశంలో జరుగుతున్న సౌతాఫ్రికా సిరీస్‌కు కూడా ధోనీ అందుబాటులో లేడు. ఇక బంగ్లా సిరీస్ వరకైనా ధోనీ టీమిండియాలో చేరాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఆసీస్‌పై భారత్ విక్టరీ

## ఫైనల్ బెర్త్ ఖాయం • సుల్తాన్ జోహర్ కప్ హాకీ



**జోహర్ బారో (మలేసియా):** సుల్తాన్ జోహర్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో భారత యువ జట్టు సత్తా చాటుతోంది. బుధవారం పటిష్టమైన ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 5-1 గోల్స్‌తో ఘన విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. భారత తరపున శిలానంద్ లక్రా (26, 29ని.లలో) గోల్స్‌తో మరోసారి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు దిల్‌ప్రీత్ సింగ్ (44), గుర్‌సాహిబ్‌జీత్ (48), మందీప్ మోరె (50) నిమిషాల్లో గోల్స్ సాధించి భారత్‌కు భారీ ఆధిక్యాన్ని అందించారు. ఆసీస్ తరపున ఒకటే గోల్ నమోదవడంతో మ్యాచ్ పూర్తి సమయం ముగిసే సరికి ఐదు గోల్స్‌తో ఆధిక్యంలో ఉన్న భారత్ ఘన విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్‌తో భారత్ తలపడుతోంది



# ఫైనల్లో ఢిల్లీ X బెంగాల్

## సెమీస్‌లో ఓడిన ముంబై, బెంగళూరు

### ప్రో కబడ్డీ లీగ్ సీజన్-7

**అహ్మదాబాద్:** ప్రో కబడ్డీలీగ్ ఏడో సీజన్ ఫైనల్స్‌కు దబాంగ్ ఢిల్లీ, బెంగాల్ వారియర్స్ జట్లు అర్హత సాధించాయి. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో లీగ్స్ టాపర్ దబాంగ్ ఢిల్లీ 44-38తో డిఫెండింగ్ చాంపియన్ బెంగుళూరు బుల్స్‌ను ఓడించింది. ఉత్కంఠ బరితంగా జరిగిన మరో సెమీస్ పోరులో బెంగాల్ వారియర్స్ 37-35తో యు ముంబాపై విజయం సాధించి టైటిల్ పోరుకు సిద్ధమైంది. శనివారం జరిగే ఫైనల్‌లో ఢిల్లీ, బెంగాల్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. సెమీస్‌లో భాగంగా ఢిల్లీ, బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో దబాంగ్ స్టార్ రైడర్ నవీన్ కుమార్ 15 రైడింగ్ పాయింట్లు సాధించి తమ జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. కూతకు వెళ్లిన ప్రతిసారి ప్రత్యర్థి ఆటగాళ్లను హడలెత్తిస్తూ పాయింట్లు సాధిస్తూ ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు చంద్రన్ రంజీత్ (9 పాయింట్లు) కూడా ధాటిగా ఆడడంతో ఢిల్లీ విజయం ఖాయమైంది. ఇక డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు జట్టులో పవన్ కుమార్ 18 పాయింట్లు అద్భుతమైన పోరాటం కనబర్చినా లాభంలేకుండా పోయింది. ఇతర ఆటగాళ్లు విఫలమవడంతో కీలక మ్యాచ్‌లో బుల్స్‌కు ఓటమి తప్పలేదు. ఇక లీగ్ దశలో అత్యుత్తుమ ప్రదర్శన చేసి పాయింట్ల పట్టికలో టాపర్‌గా నిలిచిన దబాంగ్ ఢిల్లీ ఆరు పాయింట్ల తేడాతో ఈ మ్యాచ్‌ను గెలుచుకుని టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది.

### పోరాడి ఓడిన ముంబా..



ఉత్కంఠ బరితంగా జరిగిన మరో మ్యాచ్‌లో యు ముంబా చివరి వరకు అద్భుతంగా పోరాడి రెండు పాయింట్ల తేడాతో ఓడింది. ఈ మ్యాచ్‌లో కలిసికట్టుగా ఆడిన వారియర్స్ 37-35తో ముంబైను ఓడించి తుది పోరుకు అర్హత సాధించింది. వారియర్స్ జట్టులో సుకేశ్ హెగ్డె (8 పాయింట్లు), ఎస్మాయిల్ నబీబక్ష్ (5 పాయింట్లు), ప్రపంజన్ (4 పాయింట్లు) రాణించారు. మరోవైపు ముంబా తరపున అభిషేక్ సింగ్ (11 పాయింట్లు) దూకుడుగా ఆడినా తమ జట్టును ఓటమినుంచి తప్పించలేక పోయాడు.

# సైనా, శ్రీకాంత్‌కు షాక్!



## తొలి రౌండ్‌లోనే ఇంటికి చేరిన స్టార్ షట్లర్లు

### సమీర్‌వర్మ ముందంజ • డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్



**ఓడెన్స్:** డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌కు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన సైనా, శ్రీకాంత్ మరోసారి పేలవమైన ఆటతో నిరాశ పరుస్తూ మొదటి రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టారు. మరోవైపు యువ షట్లర్ సమీర్ వర్మ శుభారంభం చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రి-సిక్కిరెడ్డి జోడీ ముందంజ వేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, ఎనిమిదో సీడ్ సైనా నెహ్వాల్ 15-21, 21-23తో జపాన్ క్రీడాకారిణి సయకా తకహాషి చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆరంభం నుంచే చెలరేగి ఆడిన జపాన్ షట్లర్ సయకా సైనాపై పూర్తి ఆధిపత్యాన్ని కనబర్చింది. ప్రత్యర్థి దూకుడుముందు నిలబడలేక సైనా తొలి గేమ్‌ను 15-21తో కోల్పోయింది. తర్వాత జరిగే రెండో గేమ్ లో తేరుకున్న సైనా ప్రతర్యర్థిపై ఎదురుదాడికి దిగింది. వరుస స్మాష్‌లతో జోరును ప్రదర్శించింది. ఈ క్రమంలోనే సైనా 20-16తో మంచి స్థితిలో నిలిచింది. కానీ ఈ దశలో పుంజుకున్న సయకా ఒక్కసారిగా విజృంభించింది. సైనాపై విరుచుకపడి వరుసగా పాయింట్లు సాధిస్తూ స్కోరును సమం చేసింది. చివరికి ఈగేమ్ టైబ్రేకర్‌కు దారి తీసింది. ఇక టైబ్రేకర్‌లో సైనా మళ్లీ తేలిపోవడంతో జపాన్ క్రీడాకారిణి వరుసగా రెండో గేమ్ విజయంతో తర్వాతి రౌండ్‌కు అర్హత సాధించింది. మరోవైపు భారీ అంచనాలతో బరిలోకి దిగిన సైనా తొలి రౌండ్‌లోనే వైదొలిగి తీవ్రంగా నిరాశ పరిచింది.

### శ్రీకాంత్ ఓటమి..

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ 14-21, 18-21తో నాలుగో సీడ్ అండర్స్ ఆంటన్సన్ (డెన్మార్క్) చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. కొద్ది కాలంగా గాయాలతో సతమతమవుతున్న శ్రీకాంత్ డెన్మార్క్ ఓపెన్‌లో మొదటి రౌండ్‌ను కూడా దాటలేక పోయాడు. తొలి గేమ్‌ను 14-21తో కోల్పోయిన శ్రీకాంత్ రెండో గేమ్‌లో డెన్మార్క్ ప్రత్యర్థికి చివరి వరకు గట్టి పోటీ ఇచ్చాడు. కానీ ఆఖర్లో పైచేయి సాధించిన ఆంటన్సన్ మూడు పాయింట్ల తేడాతో ఈ గేమ్‌తో పాటు మ్యాచ్‌ను చేజిక్కించుకున్నాడు.

### సమీర్‌వర్మ దూకుడు..

పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ శుభారంభం చేశాడు. బుధవారం ఇక్కడ జరిగిన మొదటి రౌండ్‌లో సమీర్ వర్మ 21-11, 21-11తో జపాన్‌కు చెందిన కాంట సునెయామను వరుస గేముల్లో చిత్తు చేశాడు. ఆదినుంచే చెలరేగి ఆడిన సమీర్ వర్మ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యాన్ని కనబర్చాడు. కోర్టులో వేగంగా కదులుతూ బ్యాక్ ఫుట్, ఫార్వర్డ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. తొలి గేమ్‌ను 21-15తో గెలుచుకున్న సమీర్ రెండో గేమ్‌లోనూ అదే జోరు ప్రదర్శిస్తూ వేగంగా పాయింట్లు సాధించాడు. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా భారీ ఆధిక్యంలో దూసుకెళ్లిన సమీర్ వర్మ చివరికి 21-11తో రెండో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా కైవసం చేసుకుని ముందంజ వేశాడు. ఈ మ్యాచ్‌ను సమీర్ వర్మ 29 నిమిషాల్లోనే ముగించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రి చోప్రా-సిక్కిరెడ్డి జోడీ 21-16, 21-11తో జర్మనీ జంట మార్విన్ సీడెల్-లిండా ఎఫ్లర్‌లపై విజయం సాధించి రెండో రౌండ్‌లో దూసుకెళ్లారు. తొలి రౌండ్‌లో జర్మనీ ద్వయం నుంచి కొద్ది పోటీను ఎదుర్కొన్న భారత జోడీ రెండో గేమ్‌లో మాత్రం చెలరేగి ఆడింది. ఏకపక్షంగా ఈ గేమ్‌ను గెలుచుకొని టోర్నీలో ముందంజ వేసింది. మిక్స్‌డ్ డబుల్స్ మరో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-అశ్విని పొన్నప్ప జోడీ బరిలోకి దిగకుండానే గాయంతో తప్పు కున్నారు.

# జైస్వాల్ రికార్డు ద్విశతకం

## జార్ఖండ్‌పై ముంబై విజయం • విజయ్ హజారే ట్రోఫీ



**ఆలూరు:** దేశావాళి వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ముంబై యువ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ కొత్త రికార్డు నెలకొల్పాడు. గ్రూప్-ఎలో భాగంగా బుధవారం జార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై యువ ఓపెనర్ 17 ఏళ్ల యశస్వి జైస్వాల్ (203; 154 బంతుల్లో 17 ఫోర్లు, 12 సిక్స్‌లు) ద్విశతకంతో చెలరేగాడు. ఫలితంగా లీస్ట్-ఎ క్రికెట్‌లో అతిపిన్న వయసులో డబుల్ సెంచరీ సాధించిన బ్యాట్స్‌మన్‌గా జైస్వాల్ రికార్డుల్లో నిలిచాడు. జైస్వాల్ ఈ రికార్డును 17 ఏళ్ల 292 రోజుల వయసులో సాధించాడు. అంతకుముందు 1975లో సౌతాఫ్రికా ఆటగాడు అలాన్ బారో (20 ఏళ్ల 273 రోజులు) సాధించిన రికార్డును తాజాగా జైస్వాల్ బద్దలు కొట్టాడు. ఇక ఈ టోర్నీలో శతకాలతో చెలరేగుతున్న జైస్వాల్ కేరళపై 113, గోవాపై 122 పరుగులు చేశాడు. ఇప్పుడు తాజాగా జార్ఖండ్‌పై డబుల్ సెంచరీ నమోదు చేసి సత్తా చాటుకున్నాడు. ఇక ఈ సీజన్‌లో ద్విశతకం బాదిన మూడో బ్యాట్స్‌మన్‌గా జైస్వాల్ నిలి చాడు. ఇతని కంటే ముందు కేవీ కౌశల్, సంజూ శాంసన్‌లు డబుల్ సెంచరీ సాధించారు. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. ఓపెనర్లు జైస్వాల్ (203), ఆదిత్య తారె (78) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన జర్ఖాండ్ జట్టు 46.4ఓవర్లలో 319 పరుగులకు ఆలౌటైపోయింది. దీంతో ముంబైకు 39 పరుగుల విజయం దక్కింది. జర్ఖాండ్ బ్యాట్స్‌మెన్‌లో విరాట్ సింగ్ (100; 77 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), సౌరబ్ తివారి (77) రాణించిన ఫలితంలేకుండా పోయింది. ముంబై బౌలర్లలో ధవాల్ కులకర్ణి 5 వికెట్లతో విజృంభించాడు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com